
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 సంచిక: 301

SUNDAY Special

ఆదివారం 22-1-2023


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మన బౌలింగ్ భళా...

భారత బౌలర్ల దెబ్బకు రెండో వన్డేలో న్యూజిలాండ్ 108 ఆలౌట్. ఎనిమిది వికెట్లతో నెగ్గిన టీమిండియా. సిరీస్ 2-0తో సొంతం. మంగళవారం ఇండోర్‌లో చివరి వన్డే.

- వివరాలు 16లో▶



మనమెందుకు పట్టించుకోవాలంటే?

ఒమిక్రాన్ సబ్-వేరియంట్ ఎక్స్‌బీబీ 1.5 అమెరికాను అల్ల కల్లోలం చేస్తోంది. అక్కడున్న మనవారు అటు ఇటు ప్రయాణాలు సాగిస్తున్న నేపథ్యంలో దీని ప్రభావంపై కథనం.

- వివరాలు 15లో▶



బీబీసీ డాక్యుమెంటరీపై కన్నెర్ర

గోద్రా అల్లర్లకు మోదీ బాధ్యుడంటూ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీపై భారత సర్కార్ ఆంక్షల కొరడా ఝుళిపించింది.

- వివరాలు 6లో▶



జమ్మూలో జంట పేలుళ్లు

కాంగ్రెస్ జోడో యాత్ర మరో రెండ్రోజుల్లో జమ్మూ చేరుకోనుండగా జంట పేలుళ్లు చోటుచేసుకున్నాయి. 9 మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో▶



'మలివాల్ వర్సెస్ బీజేపీ'

ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్‌ను ఓ వ్యక్తి వేధించిన ఘటన బీజేపీ జోక్యంతో రాజకీయ రంగు పులుముకుంటోంది.

- వివరాలు 6లో▶



న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా..

న్యూజిలాండ్ నూతన ప్రధానమంత్రిగా క్రిస్ హిప్కిన్స్ నియమితులు కానున్నారు. ఆయన ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు.

- వివరాలు 6లో▶

గురు'కల' కొలువు!

సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో 12 వేల పోస్టుల భర్తీకి గతంలోనే ప్రభుత్వ ఆమోదం

ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వని టీఆర్‌ఈఐఆర్‌బీ

- తొలుత 9 వేల పోస్టులకు అనుమతులు.. ఉత్తర్వులు సైతం జారీ
- తర్వాత 3 వేల పోస్టులకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్.. అనుమతించని ఆర్థిక శాఖ
- అన్నిటికీ అనుమతులొచ్చిన తర్వాతే ప్రకటనలిస్తామంటున్న బోర్డు
- అభ్యర్థుల్లో నిరాశా నిస్పృహలు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. మొత్తం 12 వేలకు పైగా పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా..ఒక్క నోటిఫికేషన్ కూడా వెలువడక పోవడంతో, ఆయా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో నిరాశా నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. తొలుత వివిధ కేటగిరిల్లో 9,096 ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు జారీ చేసింది. అయితే అందుకు సంబంధించిన ప్రకటనలు జారీ చేయడంలో తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) తాత్సారం చేస్తోంది. ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాల భర్తీలో భాగంగా.. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ), తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామకాల బోర్డు (టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ), తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ)లు ప్రకటనలు వెలువరిస్తున్నాయి. ఈ మూడు నియామక సంస్థల పరిధిలో దాదాపు 45వేల ఉద్యోగాలకు వివిధ ప్రకటనలు జారీ చేయగా..టీఆర్‌ఈఐఆర్‌బీ మాత్రం 12 వేలకు పైగా పోస్టులకు ఇప్పటికి ఒక్క ప్రకటన కూడా జారీ చేయకపోవడం గమనార్హం.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో 80 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గతేడాది అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. ఇందులో భాగంగా గురుకుల విద్యా సంస్థల్లో 12 వేల ఖాళీలను ప్రభుత్వం

మిగతా 7వ పేజీలో ▶

రెండేళ్లుగా సిద్ధమవుతున్నా..



గురుకుల విద్యా సంస్థల్లో బోధన ఉద్యోగాలు, ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ కొలువులకు గత రెండు సంవత్సరాలుగా సిద్ధమవుతున్నా. గురుకుల ఖాళీల విషయం తెలిసిన వెంటనే ప్రైవేటు శిక్షణ కేంద్రంలో కోచింగ్ సైతం తీసుకున్నాను. ప్రభుత్వ శాఖల్లో గ్రూప్ ఉద్యోగాలు మొదలు ఇతర కేటగిరీల్లో పలు ఉద్యోగాలకు ప్రకటనలు వెలువడుతున్నా, బోధన రంగంలో ఉద్యోగాలకు ఎలాంటి ప్రకటనలు వెలువడటం లేదు.

– మల్రెడ్డిపల్లి సుజాత, కుల్కచర్ల, వికారాబాద్ జిల్లా

- అమ్మ అటు.. నాన్న ఇటు.. మరి నేను ఎటు?



దంపతులు ఒకేచోట పనిచేసేలా బదిలీలు చేపట్టాలంటూ ఉపాధ్యాయ దంపతులు తమ పిల్లలతో కలిసి శనివారం తలపెట్టిన పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు తల్లిదండ్రులను అరెస్ట్ చేసే సమయంలో పిల్లల రోదనతో ఉద్విగ్నత నెలకొంది.

5 లో



'పుడమి సాక్షి'గా..

పత్రికలో అక్షరం - టీవీలో వీక్షణం

పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు బాధ్యతగా సాక్షి మీడియా గ్రూప్ మూడేళ్లుగా 'పుడమి సాక్షిగా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ముంచుకొస్తోన్న ముప్పుపై సమాజాన్ని హెచ్చరిస్తూ, ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ వ్యవస్థను చైతన్యపరిచేలా ఉద్యమిస్తోన్న 'సాక్షి'.. ఎంచుకున్న థీమ్‌పై ప్రతీ ఏటా అన్ని అంశాలను స్పృశిస్తూ మార్పు కోసం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది 'రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్' నినాదంతో వ్యర్థాల నుంచి, కాలుష్యాల నుంచి ప్రకృతిని కాపాడుకోవలసిన బాధ్యతను గుర్తుచేస్తోంది. దీనికి సంబంధించి ప్రజలను చైతన్యపరిచే ప్రత్యేక కథనాలను నేటి 'ఫన్‌డే' బుక్‌తో మీకు అందిస్తున్నాం. 'పుడమి సాక్షిగా' మెగా టాకథాన్ కార్యక్రమం సాక్షి టీవీలో ఈ నెల 26న గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రసారం కానుంది.

న్యూస్‌రీల్

క్లిష్టపరిస్థితుల్లో ఉన్నాం..



'తెలంగాణ విద్యుత్ సంస్థలు దేశంలోని ఇతర డిస్కంల కంటే ముందున్నా... ఆర్థికంగా కొంత వెనుకబడ్డాయి. నష్టాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఆయా పంపిణీ సంస్థల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది' అని తెలంగాణ విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు అన్నారు.

- వివరాలు 17లో▶

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



వానాకాలం ధాన్యం సేకరణ పూర్తయిందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈసారి రికార్డుస్థాయిలో 64.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 9.76 లక్షలమంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.12,700 కోట్లు చెల్లించామని చెప్పారు.

- వివరాలు 5లో▶

ఇదండీ జగత్



నూతనంగా ఉండేది భవనమే.. బడ్జెట్ కాదు!

3 నుంచి బడ్జెట్ సమావేశాలు

గత అసెంబ్లీ, మండలి సమావేశాలకు కొనసాగింపుగానే ప్రస్తుత భేటీ

సభలు ప్రోరోగ్ కానందున ఈసారీ గవర్నర్ ప్రసంగం లేనట్టే!

- మధ్యాహ్నం 12.10 గంటలకు అసెంబ్లీ, మండలిలో బడ్జెట్ సమర్పణ
- తర్వాతి రెండు రోజులు విరామం.. 6వ తేదీ నుంచి చర్చలు
- బడ్జెట్ ముసాయిదాపై శనివారం సమీక్షించిన సీఎం కేసీఆర్
- వివిధ పద్దులు, ప్రతిపాదనలపై చర్చ.. ఈసారి బడ్జెట్ రూ.3 లక్షల కోట్లు?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ, శాసన మండలి బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల 3వ తేదీన (శుక్రవారం) ప్రారంభం కానున్నాయి. తొలుత ఉభయసభల్లో.. ఇటీవలికాలంలో మరణించిన మాజీ సభ్యులకు సంతాపం ప్రకటిస్తారు. తర్వాత మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2023–24ను శాసనసభలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, శాసన మండలిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమర్పిస్తారు. 4, 5 తేదీల్లో సమావేశాలకు విరామం ఇచ్చి.. 6వ తేదీ నుంచి బడ్జెట్‌పై చర్చ కొనసాగించనున్నారు. అయితే ఉభయసభల నిర్వహణకు సంబంధించి ఫిబ్రవరి 3న జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)ల సమావేశంలో షెడ్యూల్‌ను ఖరారు చేయనున్నారు.

ఎనిమిదో సమావేశంలో.. నాలుగో విడత..

ప్రస్తుత శాసనసభ, మండలి సమావేశాలను తాజా ప్రభుత్వంలో ఎనిమిదో పర్యాయంలో నాలుగో విడతగా పరిగణించనున్నారు. 2018లో తెలంగాణలో రెండో ప్రభుత్వం ఏర్పడింది. ఇందులో ఇప్పటివరకు ఎనిమిది పర్యాయాలు అసెంబ్లీ, మండలి సమావేశాలు జరిగాయి (ఎప్పుడైనా అసెంబ్లీ/మండలి సమావేశాలను ప్రోరోగ్ (నిరవధిక వాయిదా) చేస్తే ఆ పర్యాయం ముగిసినట్టు లెక్క. ప్రోరోగ్ చేయకుంటే ఇంకా ఆ పర్యాయం కొనసాగుతున్నట్టుగానే పరిగణిస్తారు). 2021 సెప్టెంబర్‌లో ఎనిమిదో పర్యాయం సమావేశాలు మొదలయ్యాయి. వాటిని ప్రోరోగ్ చేయకుండానే..

మిగతా 2వ పేజీలో ▶

'అసెంబ్లీ' తర్వాతే!



- జాతీయస్థాయిలో బీఆర్‌ఎస్ విస్తరణ ప్రణాళికపై కేసీఆర్ బిజీ
- ప్రగతిభవన్‌లో నేతలు, నిపుణులతో వరుస భేటీలు

2 లో

వచ్చే నెల 13న రాష్ట్రానికి మోదీ!

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ

- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఈ నెల 19నే జరగాల్సిన పర్యటన.. పలు కారణాలతో వాయిదా.... ఈ కార్యక్రమాలనే రీషెడ్యూల్ చేసినట్టుగా సమాచారం
- మోదీ సభ కోసం ఏర్పాట్లు మొదలుపెట్టిన రాష్ట్ర బీజేపీ!



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల (ఫిబ్రవరి) 13న రాష్ట్రానికి రానున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతోపాటు పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి కార్యాలయానికి సమాచారం అందినట్టు తెలిసింది.

19నాటి పర్యటన వాయిదాతో..

వాస్తవానికి ప్రధాని మోదీ ఈ నెల 19నే రాష్ట్రంలో పర్యటించి.. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను, సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాల్సి ఉంది. కానీ పలు కారణాల వల్ల ఆ పర్యటన వాయిదా పడింది. దీంతో ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి పండుగ కానుకగా ఈ నెల 15న ఢిల్లీ నుంచి వర్చువల్‌గా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలో తిరిగి రాష్ట్ర పర్యటనను పీఎం కార్యాలయం ఖరారు చేసినట్టు సమాచారం. దీనికి సంబంధించి ఇంకా దక్షిణ మధ్య రైల్వేకు అధికారికంగా సమాచారం అందలేదని తెలిసింది.

సభ ప్రయత్నాల్లో బీజేపీ!

పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ సభపై సమాచారం అందిన రాష్ట్ర బీజేపీ నేతలు ఏర్పాట్లలో పడినట్టు తెలిసింది. హైదరాబాద్, పొరుగున ఉన్న జిల్లాలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి జన సమీకరణతో మోదీ సభను విజయవంతం చేయాలని వారు భావిస్తున్నారు. ఇక ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వివిధ రూపాల్లో కేటాయింపులు పెంచుతారని.. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రం ఇస్తున్న నిధులను మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించే అవకాశం ఉందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. కేంద్రం సరిగా నిధులు ఇవ్వడం లేదంటూ సీఎం కేసీఆర్,

మిగతా 8వ పేజీలో ▶

'దావోస్' పెట్టుబడులు రూ. 21,000 కోట్లు

పర్యటన విజయవంతమైంది: మంత్రి కేటీఆర్



'స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో 52 సమావేశాలు, 6 రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నాం. రూ.21 వేల కోట్ల మేర పెట్టుబడులు సాధించాం. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తెచ్చి పెద్దసంఖ్యలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఆలోచనే నిరంతరం మమ్మల్ని నడిపిస్తోంది'. – ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

8 లో

ముంపు బాధితులనూ ముంచారు!

డిపాజిట్ల కోసం సహారా కమీషన్ ఏజెంట్ల ఎత్తుగడ

- ఐదున్నరేళ్లలో డబుల్ అంటూ డిపాజిట్ల సేకరణ
- మిడ్‌మానేరు భూ నిర్వాసితులను మళ్లీ ముంచిన వైనం

2 లో

'యాత్ర'పై దిశానిర్దేశం

జనవరి 26న లాంఛనంగా... ఫిబ్రవరి 6 నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర షురూ

పీసీసీ నేతలకు మాణిక్‌రావ్ ఠాక్రే మార్గనిర్దేశం

- ఫిబ్రవరి 6 నుంచి 2 నెలలపాటు కొనసాగింపు... ఆ రోజున లక్ష మందితో సభ
- సోనియా లేదా ప్రియాంక పాల్గొనాలని కోరుతూ పీసీసీ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవ తీర్మానం
- నేతలంతా పాల్గొని విజయవంతం చేయాలి: ఠాక్రే
- తాను ఎవరికీ అనుకూలం, వ్యతిరేకం కాదని వ్యాఖ్య



టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో రేవంత్, ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 26న హాథ్ సే హాథ్ జోడో యాత్రలను లాంఛనంగా ప్రారంభించి ఫిబ్రవరి 6 నుంచి రెండు నెలలపాటు ఈ యాత్రలను ఘనంగా కొనసాగించాలని టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. 'ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా యాత్రలను ప్రారంభించాలి. ఆ తర్వాత 30న శ్రీనగర్‌లో జరిగే భారత్ జోడో యాత్ర ముగింపునకు పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతతోపాటు ముఖ్య నేతలు అక్కడకు వెళ్లాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ సమావేశం ఉంటుంది. ఫిబ్రవరి 3 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశముంది. 5న రాష్ట్ర బడ్జెట్ ఉంటుందన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 6 నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్రలను రెండు నెలలపాటు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించాలి' అని సమావేశం తీర్మానించింది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన శనివారం టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం గాంధీ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హాథ్ సే హాథ్ జోడో యాత్రల కోసం ఏఐసీసీ నియమించిన సమన్వయకర్త గిరీశ్ చోడంకర్, పీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు, ఇన్‌చార్జి కార్యదర్శులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు,

మిగతా 2వ పేజీలో ▶



పవిత్ర జలాన్ని తీసుకొస్తున్న మెస్రం ఆడపడుచులు

నాగోబా జాతర షురూ

ఆదివాసీల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర శనివారం మొదలైంది. వేలాదిగా తరలివచ్చిన గిరిజనులతో ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ జనసంద్రమైంది. పుష్య అమావాస్య అర్ధరాత్రి పవిత్ర గంగాజలాలతో నాగోబాను అభిషేకించిన అనంతరం జాతర ప్రారంభమైంది.

- 7లో



నేడు రాష్ట్రానికి చేగువేరా కుమార్తె, మనవరాలు

- రవీంద్రభారతిలో క్యూబా సంఘీభావసభ
- హాజరు కానున్న అలైదా, ఎస్తెఫినా గువేరా

7 లో

క్లుప్తంగా...

13 భాషల్లో ఎగ్జామ్ వారియర్స్ పుస్తకం

ప్రధాని మోదీ ట్వీట్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని తెలుగు లోనూ అందుబాటులోకి తెచ్చారు. సవరించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని తెలుగుతో కలిసి మొత్తం 13 భారతీయ భాషల్లో ముద్రించారు. దేశవ్యాప్తంగా పరీక్షల ముందు విద్యార్థుల్లో భయాన్ని, ఆందోళనను పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం ఈ నెల 27న జరగనుంది. కార్యక్రమానికి ముందు ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని హిందీ, ఇంగ్లిష్, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, ఒడియా, అస్సామీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, బెంగాలీ భాషల్లో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

సీఎం చొరవతో అన్ని భాషల్లో ఎస్‌ఎస్‌సీ పరీక్షలు

వెల్లడించిన సీఎం కార్యాలయవర్గాలు

సాక్షి, హైదరాబాద్: రైల్వేలు, డిఫెన్స్, బ్యాంకులు తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) ద్వారా చేపట్టే ఉద్యోగ పోటీ పరీక్షలను, కేవలం హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే కాకుండా ఆయా రాష్ట్రాల స్థానిక భాషల్లోనే పరీక్షలు నిర్వహించాలన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు హిందీ ఇంగ్లిష్‌తోపాటు రాజ్యాంగం 8 వ షెడ్యూల్‌లో పొందుపరిచిన అన్ని భారతీయ భాషల్లో పోటీ పరీక్షలు నిర్వహించాలని, ఎస్‌ఎస్‌సీ శనివారం నిర్ణయం తీసుకుంది. దీంతో భిన్న భాషలు, భిన్న సాంప్రదాయాలున్న దేశంలో సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లాలని కేసీఆర్ చేస్తున్న కృషికి ఫలితం దక్కినట్టైందని సీఎంవో వర్గాలు వెల్లడించాయి.

'బీజేపీ తెలంగాణ అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతోంది'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిని బీజేపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం గతంతో పోలిస్తే రెట్టింపు అయిన తీరును వివరిస్తూ కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై బీజేపీ నేతలు మౌనం పాటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో లింగయ్య యాదవ్ శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ ఎజెండాను చూసి బీజేపీ, కాంగ్రెస్‌లో భయం మొదలైందని లింగయ్య వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మించిన కోవర్టు ఎవరూ లేరని దుయ్యబట్టారు. మునుగోడు ఉపఎన్నికలో బీజేపీకి అనుకూలంగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసే దమ్ము రేవంత్‌రెడ్డికి లేదన్నారు. దావోస్ పర్యటన ద్వారా కేటీఆర్ రాష్ట్రానికి రూ.21 వేల కోట్ల పెట్టుబడులు సాధించారని తెలిపారు.

అనాథల హక్కుల సాధనకు మద్దతివ్వండి

షర్మిలను కోరిన మంద కృష్ణ



వైఎస్సార్‌టీపీ నాయకులతో మందకృష్ణ

సాక్షి, హైదరాబాద్: అనాథల హక్కుల సాధనకు నిర్వహించతలపెట్టిన సమావేశానికి వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల మద్దతివ్వాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన లోటస్‌పాండ్‌లోని వైఎస్సార్‌టీపీ కార్యాలయానికి వచ్చారు. పార్టీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు, పార్టీ కో–ఆర్డినేటర్ వాడుక రాజగోపాల్, మహిళా అధ్యక్షురాలు గడిపెల్లి కవితలతో మంద కృష్ణ సమావేశమయ్యారు. ఈ నెల 28న అనాథలహక్కుల సాధనకు నిర్వహించతలపెట్టిన రౌండ్ టేబుల్ సమావేశంపై చర్చించారు. సమావేశానికి వైఎస్సార్‌టీపీ మద్దతు కోరగా.. అందుకు పార్టీ నేతలు సానుకూలతను వ్యక్తం చేశారు.

బీజేపీకి లబ్ధి చేకూరేలా బీఆర్‌ఎస్: గట్టు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ చర్యలన్నీ బీజేపీకి ఉపయోగపడేవేనని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు ఆరోపించారు. ఆయన శనివారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో తెలంగాణ వాదులు, బీఆర్‌ఎస వాదుల మధ్య వివాదం నడుస్తోందని స్పష్టం చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ నుంచి పోతున్నారనే కేసీఆర్ ఖమ్మంలో సభ పెట్టారని చెప్పారు. తెలంగాణకు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి అవుతారని గట్టు ధీమా వ్యక్తం చేశారు. జిల్లాల వారీగా తమ పార్టీ సమీక్ష సమావేశాలు జరుగుతున్నాయని, ఈ నెల 25న వరంగల్, 28న జీహెచ్‌ఎంసీ పరిధి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.



ముంపు బాధితులనూ ముంచారు!

డిపాజిట్ల కోసం సహారా కమీషన్ ఏజెంట్ల ఎత్తుగడ

ఐదున్నరేళ్లలో డబుల్ అంటూ డిపాజిట్ల సేకరణ

మిడ్‌మానేరు భూ నిర్వాసితులను మళ్లీ ముంచిన వైనం

సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్న బాధితులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గ్రామీణ ఆర్థిక వనరులను లక్ష్యంగా చేసుకొని తెలంగాణలో సహారా సాగించిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. సహారా సిబ్బంది డిపాజిటర్ల నుంచి భారీ ఎత్తున డబ్బులు పొదుపు చేయించేందుకు మిడ్ మానేరులో ముంపు గ్రామాల బాధితులను ఎంచుకోవడం గమనార్హం. ప్రాజెక్టులో నిలువ నీడ కోల్పోయి.. ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో బతుకుదామనుకున్న పేద, దిగువ మధ్య తరగతి, నిరక్షరాస్యుల వద్ద నుంచి రూ.లక్షలాది డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా సేకరించి ఇవ్వకుండా తిప్పించుకుంటున్న వైనం ఇప్పుడు బయటపడింది. సహారా డిపాజిట్ల వ్యవహారంపై ''పల్లెల్లో సహారా కలకలం''పేరిట శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేసేందుకు ముందుకు వస్తున్నారు. కొందరు న్యాయం కోసం సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించనున్నారు.

ఏం జరిగిందంటే?: మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఇళ్లు, భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారిన పలువురు పేదప్రజలు పక్కనే ఉన్న అనుపురం గ్రామంలో స్థిరపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో ఇళ్లు నిర్మించుకున్నారు. వీరందరిపై సహారా ఏజెంట్లు కన్నేశారు. భూములు కోల్పోయిన వారికి పరిహారంగా వచ్చిన డబ్బును వృథా చేసుకోవద్దని, తమ వద్ద డిపాజిట్ చేస్తే.. తక్కువ కాలంలోనే రెండింతలు చేసిస్తామని నమ్మబలికారు. బ్యాంకుల్లో వేస్తే ఎనిమిదేళ్లకు పైగా సమయం పడుతుందని, తమ వద్ద ఐదున్నరేళ్లలోనే రెట్టింపైన డబ్బును అందజేస్తామని ప్రచారం చేశారు. దీంతో చాలామంది రూ.లక్షలు కొద్దీ డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా సహారాలో పొదుపు చేశారు. తీరా ఇప్పుడు కాలపరిమితి తీరిన తర్వాత సహారా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. తమకు ఎలాంటి డబ్బు ఇవ్వలేదని వాపోతున్నారు. అన్నీ మునిగి బతుకుదెరువు కోసం ఇక్కడికి వస్తే.. తమకు డబ్బుల ఆశచూపి మరోసారి ముంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సుప్రీం కోర్టును ఆశ్రయిస్తున్నం

నాది రూ.3.40 లక్షలు, మా తల్లి నాగవెల్లి అమృతమ్మ రూ.2.60 లక్షలు 2015లో సహారాలో ఎఫ్‌డీ చేస్నిరు. ఐదున్నరేళ్లకు డబుల్ అన్నారు. ఈ అన్యాయంపై ఊరుకునేది లేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. రేపో మాపో కేసు నమోదవుతుంది. ఇక సహారా సంగతి సుప్రీంకోర్టులోనే తేల్చుకుంటాం.

– రాజలింగమూర్తి, కౌన్సిలర్, భూపాలపల్లి

పైసలకు బోతే దాటేస్తరు!



మిడ్ మానేరు ముంపు గ్రామం అనుపురంలో ఇంటి నష్టపరిహారం డబ్బులు రూ. 2 లక్షలు వచ్చినయ్. వాటిని సహారా చిట్‌ఫండ్‌లో గత ఏడేళ్ల కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినం. మెచ్యూరిటీ గడువు ముగిసి 15 నెలలు గడిచినయ్. పైసలకు పోతే తరువాత ఇస్తామని సమాధానం దాటేస్తరు. ఆ డబ్బులు వస్తే ఇల్లు కట్టుకుందామని అనుకున్నం. అవి రాకపోవడంతో అప్పుచేసి ఇల్లు కట్టుకున్నాం. మా పైసల్ మాకు సర్కారే ఇప్పియ్యాలె.

– సామల్ల సంతోష, అనుపురం

పొట్ట కొట్టిర్రు..



మా ఇల్లు అనుపురం మిడ్ మానేరులో ముంపునకు గురైంది. ఇంటి నష్టపరిహారం కింద రూ. 4.50 లక్షల పైసలు వచ్చినయ్. ఏడేండ్ల కింద ఏజెంట్ల మాటలు నమ్మి సహారాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన. మెచ్యూరిటీ ముగిసింది. మొత్తం పైసలల్ల రూ. 3 లక్షలే ఇచ్చిర్రు. ఇంకా రూ. 6 లక్షలు రావాలె. ఏజెంట్లను నమ్మి పొదుపు చేస్తే.. సహారా చిట్ ఫండ్ వాళ్లు మా పొట్టకొట్టిర్రు.

– తాండ్ర రాజవ్వ, అనుపురం

3 నుంచి బడ్జెట్ సమావేశాలు

▶ మొదటి పేజీ తరువాయి

తర్వాత మరో రెండు విడతలుగా సమావేశాలు నిర్వహించారు. అంటే ఎనిమిదో పర్యాయంలో మూడు విడతలు అయ్యాయి. వచ్చేనెల 3న మొదలయ్యే బడ్జెట్ సమావేశాలు నాలుగో విడత కానున్నాయి.

డిసెంబర్‌లో నిర్వహిస్తామన్నా..

చివరిగా గత ఏడాది సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. తర్వాత డిసెంబర్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, కేంద్ర వివక్షను వివరించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కానీ జరగలేదు. అధికారిక, బీఆర్‌ఎస్ కార్యకలాపాల్లో కేసీఆర్ బిజీగా ఉండటంతో ప్రత్యేక సమావేశాలు చేపట్టలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రూ.3 లక్షల కోట్లతో బడ్జెట్?

రాష్ట్ర బడ్జెట్ అంచనాలకు తుదిరూపు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన శనివారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఆర్థికమంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. 2023–24 బడ్జెట్ ముసాయిదా ప్రతిపాదనలపై ఈ సమావేశంలో సీఎం కేసీఆర్ లోతుగా సమీక్షించి.. పలు సవరణలు, మార్పుచేర్పులు సూచించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 2023–24 బడ్జెట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూ.2.56 లక్షల కోట్ల కంటే 13 నుంచి 15 శాతం అధికంగా ఉండనుంది. అంటే రూ. 2.95 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. బడ్జెట్‌ను ప్రాథమికంగా ఆమోదించేందుకు ఫిబ్రవరి 3న ఉదయం 10 గంటలకు ప్రగతిభవన్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.

గవర్నర్ ప్రసంగం ఈసారీ లేనట్టే!

ఇంతకుముందు జరిగిన శాసనసభ, మండలి సమావేశాలను ప్రొరోగ్ చేయనందున ఈ బడ్జెట్ సమావేశాల్లోనూ గవర్నర్ తమిళిసై ప్రసంగించే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వంతో గవర్నర్‌కు సాగుతున్న విభేదాలే దీనికి కారణమని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. గత ఏడాది బడ్జెట్ సమావేశాలు కూడా గవర్నర్ ప్రసంగం లేకుండానే ప్రారంభమయ్యాయి. ఇక 2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు 40 ఆర్డినెన్సులు జారీ చేయగా.. అందులో అత్యధికంగా 2016లో 11 ఆర్డినెన్స్‌లు ఇచ్చింది. అయితే 2021 నుంచి గవర్నర్‌తో కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో ఏడాదిన్నరగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్డినెన్సులు ఇవ్వలేదు. వాటికి ఆమోదం రాకపోవచ్చనే ఉద్దేశమే దీనికి కారణం. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 7 బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపినా.. అందులో ఆరు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే బిల్లులపైనా సస్పెన్స్ నెలకొంది.

పోటీ పరీక్షల అభ్యర్థులకు సలహాలు

గ్రూప్‌–1 అధికారుల సంఘం ఆధ్వర్యంలో సదస్సులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గ్రూప్–1 అధికారుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించనున్నట్టు గ్రూప్–1 ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో నిర్వహించే ఈ సదస్సుల్లో గ్రూప్–1 అధికారులు, గ్రూప్–2 అధికారులతోపాటు నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశాల తర్వాతే!

జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ విస్తరణ ప్రణాళికపై కేసీఆర్ బిజీ

- ప్రగతిభవన్‌లో వివిధ రాష్ట్రాల నేతలతో కేసీఆర్ వరుస భేటీలు
- పార్టీ విధివిధానాలపై వివిధ రంగాల నిపుణులతో సమావేశాలు
- మూడురోజులుగా రాష్ట్ర పర్యటనలో తమిళనాడు వీసీకే ఎమ్మెల్యేలు
- బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నవారితో మంత్రుల భేటీలు



సాక్షి, హైదరాబాద్: ఖమ్మంలో భారత్ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) తొలిసభను భారీగా నిర్వహించి దేశం దృష్టిని ఆకర్షించిన ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు జాతీయస్థాయిలో పార్టీని విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పార్టీ విస్తరణలో భాగంగా వివిధ రాష్ట్రాల నేతలతో ప్రగతిభవన్ వేదికగా మంతనాలు జరుపుతున్నారు. పార్టీ విధివిధానాల కోసం వివిధ రంగాలకు చెందిన 150 మంది నిపుణుల బృందం కసరత్తు చేస్తుండగా, వారితో జరుగుతున్న చర్చల్లో కేసీఆర్ బిజీగా ఉంటున్నారు. మరోవైపు రాష్ట్రవార్షిక బడ్జెట్ రూపకల్పనకు సంబంధించిన కసరత్తు చివరిదశకు చేరగా, దానికి తుదిరూపు ఇవ్వడంపైనా కేసీఆర్ దృష్టి కేంద్రీకరించారు. కాగా, ఇప్పటికే పార్టీ అనుబంధ రైతువిభాగం అధ్యక్షుడిగా పంజాబ్‌కు చెందిన గుర్నామ్ సింగ్, బీఆర్‌ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడిగా మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్‌ను నియమించారు. పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోనూ రైతువిభాగాలను ప్రారంభిస్తామని గతేడాది డిసెంబర్‌లో కేసీఆర్ ప్రకటించారు. ఈ ఏడాది చివరలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తూనే బీఆర్‌ఎస్ విస్తరణపై దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

రాష్ట్రమంత్రులతో ఇతర రాష్ట్రాల నేతల భేటీ

బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్న తమిళనాడు విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు, ఎంపీ తిరుమావలవన్ ఇప్పటికే పలు సందర్భాల్లో కేసీఆర్‌తో భేటీ అయ్యారు. తాజాగా వీసీకే శాసనసభాపక్షం నేతలు మూడురోజులుగా తెలంగాణలో పర్యటిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేస్తున్నారు. దళితబంధు పథకం అధ్యయనం కోసం వీసీకే శాసనసభాపక్షం నేత సింతనై సెల్వన్, మరో ఎమ్మెల్యే ఎస్ఎస్ బాలాజీతోపాటు మరికొందరు నేతలు కరీంనగర్‌లో పర్యటిస్తున్నారు. హుజూరాబాద్ ప్రాంతంలో దళితబంధు పథకం అధ్యయనంతోపాటు శనివారం బోరబండ ఎస్సార్ హిల్స్‌లోని దళిత్ స్టడీ సెంటర్‌ను కూడా వీసీకే బృందం సందర్శించింది. ఈ నెల మొదటి వారంలో నాగాలాండ్ ఎన్‌సీపీ అధ్యక్షుడు సులుమ్ తుంగ్ లోథా మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో భేటీ కాగా, కొన్ని తమిళ సంఘాలు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో సమావేశమై బీఆర్‌ఎస్‌కు సంఘీభావం ప్రకటించాయి. బిహార్‌కు చెందిన కొందరు నేతలు ఇటీవల హోం మంత్రి మహమూద్ అలీని కలిసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ తన కుమారుడు శిశిర్ గమాంగ్‌తో కలిసి ఇటీవల కేసీఆర్‌తో భేటీ కాగా, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ కార్యదర్శి కైలాశ్ ముఖి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న రాజకీయ పార్టీల నేతలు, వివిధ రంగాల వారితో భేటీ, సమన్వయం బాధ్యతలను కొందరు మంత్రులకు కేసీఆర్ అప్పగించారు.

ఈశాన్య రాష్ట్రాల రాజకీయంపై అధ్యయనం

ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ శాసనసభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 18న షెడ్యూల్ ప్రకటించింది. 2024 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ విస్తరణ కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్న కేసీఆర్ మూడు ఈశాన్యరాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితిపై అధ్యయనం చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఓ మాజీ ఐఆర్‌ఎస్ అధికారి నేతృత్వంలోని బృందానికి బాధ్యత అప్పగించినట్లు తెలిసింది. ఈ బృందం ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించి ప్రస్తుత పరిస్థితి, ఎన్నికల్లో జాతీయ, స్థానిక పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు తదితరాలపై కేసీఆర్‌కు నివేదికలు అందజేస్తుంది.

'యాత్ర'పై దిశానిర్దేశం..

▶ మొదటి పేజీ తరువాయి

డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగానే హాథ్ సే హాథ్ జోడో యాత్రల నిర్వహణపై పలువురు నేతలు మాట్లాడారు. అందరి అభిప్రాయాలను తీసుకున్నాక మాణిక్‌రావ్ ఠాక్రే పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఏఐసీసీ తనకిచ్చిన బాధ్యతల నిర్వహణ, పార్టీ భవిష్యత్తు, నేతల పనితీరు, హాథ్ సే హాథ్ జోడో యాత్రల నిర్వహణ, ఎన్నికలను ఎదుర్కొనే అంశాలపై కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఆయన మార్గదర్శనం చేశారు.

పార్టీ బాగుంటేనే మీ భవిష్యత్తు బాగు..

'భారత్ జోడో యాత్రతో ఈ దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు రాహుల్‌గాంధీ కృషి చేస్తున్నారు. ఈ యాత్ర లక్ష్యాన్ని రాష్ట్రంలో ప్రతి గడపకూ తీసుకెళ్లే బాధ్యత మీ అందరిది. అలాగే అందరూ సమష్టిగా పనిచేసి హాథ్ సే హాథ్ జోడో యాత్రలను విజయవంతం చేయాలి. పార్టీ భవిష్యత్తు బాగుంటేనే మీ భవిష్యత్తు బాగుంటుంది. సీనియర్లంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేయాలి. పార్టీ అంతర్గత విషయాలు ఏవైనా నాతో మాట్లాడండి. నేను ఎవరికీ అనుకూలం కాదు... వ్యతిరేకమూ కాదు. నేతలెవరూ పార్టీకి నష్టం కలిగేలా మీడియా ముందు మాట్లాడొద్దు. హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా సీనియర్లు ఎక్కువ నియోజకవర్గాల్లో యాత్రలు చేయాలి. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి కూడా 40–50 నియోజకవర్గాల్లో యాత్రల్లో పాల్గొంటారు. మనం బలహీనపడుతున్నామనే భావనతో బీజేపీ ఉత్తరాదిన చేస్తున్న రాజకీయాలనే తెలంగాణలో చేయాలని చూస్తోంది. కానీ బీజేపీ ఆటలు సాగవు. 100 శాతం మనం గెలవబోతున్నాం' అని ఠాక్రే పీసీసీ కార్యవర్గ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

సమావేశాలకు రాని వారిపై చర్యలు..

కార్యవర్గ సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ ఫిబ్రవరి 6న జరిగే హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రల ప్రారంభ కార్యక్రమంలో సోనియా లేదా ప్రియాంకా గాంధీల్లో ఒకరు పాల్గొనేలా చూడాలని ఠాక్రేను కోరారు. లక్ష మందితో జరిగే ఈ సభలో వారిద్దరిలో ఒకరిని పాల్గొనాలని కోరుతూ ఏఐసీసీ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. అలాగే కొత్త ఇన్‌చార్జి ఠాక్రే వచ్చాక నిర్వహించిన సమావేశాలకు హాజరుకాని వారి నుంచి వివరణ కోరాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను రేవంత్ ఆదేశించారు.

గడపగడపకూ 'భారత్‌జోడో' స్టిక్కర్, రాహుల్ లేఖ

సాక్షి, హైదరాబాద్: హాథ్‌సే హాథ్ జోడో యాత్రలను రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. బ్లాకు యూనిట్‌గా అన్ని గ్రామాల్లో యాత్రలు నిర్వహించనుంది. ఈ యాత్రల్లో ప్రతి గడపకూ భారత్‌జోడో యాత్ర స్టిక్కర్ అంటించాలని, తన యాత్ర ఉద్దేశాన్ని వివరిస్తూ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు రాసిన లేఖను తెలుగులో అనువదించి అందరికీ ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ వేసే చార్జిషీట్లను కూడా గ్రామగ్రామాన పంచాలని కాంగ్రెస్ నిర్ణయించింది.

60 రోజుల్లో ఎంతవరకు యాత్ర చేయగలమో చేస్తాం: రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా ఫిబ్రవరి 6 నుంచి రెండు నెలలపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతవరకు వెళ్ల గలమో అంతవరకు వెళ్తామని, అప్పటి పరిస్థితులను బట్టి యాత్రల కొనసాగింపు అంశంపై నిర్ణయం తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులందరం భాగస్వాములవుతామని, గడపగడపకూ రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్తామని వెల్లడించారు. శనివారం గాంధీ భవన్‌లో జరిగిన టీపీసీసీ కార్యవర్గ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రల రాష్ట్ర సమన్వయకర్త గిరీశ్ చోడంకర్, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎంపీ మల్లు రవి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లతో కలసి రేవంత్ మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలను విజయవంతం చేసే బాధ్యతలను అందరం తీసుకుంటామన్నారు. ఫిబ్రవరి 6 నుంచి 60 రోజులపాటు యాత్రలు చేసి రాహుల్ సందేశాన్ని గడపగడపకూ తీసుకెళ్తామని రేవంత్ చెప్పారు. ఫిబ్రవరి 6న ప్రారంభ కార్యక్రమం ఎక్కడ నిర్వహించాలన్న దానిపై పలు ప్రతిపాదనలు ఉన్నాయని, భద్రాచలం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లలో ఎక్కడ నుంచి ప్రారంభించాలన్న విషయమై పీఏసీ, పీఈసీలో చర్చించి నిర్ణయిస్తామన్నారు.

నాగర్‌కర్నూల్‌లో నేడు దళిత గిరిజన ఆత్మగౌరవ సభ

మార్కండేయ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా తమ పార్టీ ఎస్సీ, ఎస్టీ నేతలపై బీఆర్‌ఎస్ నేతల దాడికి నిరసనగా ఆదివారం నాగర్ కర్నూల్‌లో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు రేవంత్ తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి కాంగ్రెస్ నేత నాగం జనార్దనరెడ్డితోపాటు పార్టీ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ బరితెగింపునకు నిరసనగా జరిగే ఈ సభలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతోపాటు పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారని రేవంత్ చెప్పారు.

యాత్రల్లో క్రియాశీల పాత్ర పోషించాలి

అనుబంధ సంఘాల నేతలతో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఠాక్రే



సాక్షి, హైదరాబాద్: భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా తెలంగాణలో నిర్వహించనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో పార్టీ అనుబంధ సంఘాలు క్రియాశీల పాత్ర పోషించాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సూచించారు. శనివారం రాత్రి గాంధీ భవన్‌లో ఆయన యూత్ కాంగ్రెస్, సేవాదళ్, ఎన్‌ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గాలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘాలే పునాది అని, పార్టీ కార్యక్రమాల విజయవంతంలో అనుబంధ సంఘాలదే కీలకపాత్ర అని చెప్పారు. అనుబంధ సంఘాల్లో చురుకుగా పనిచేసే నాయకులకు పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశాల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాథ్ సే హాథ్ జోడో యాత్రల సమన్వయకర్త గిరీశ్ చోడంకర్, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి నదీమ్ జావేద్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్రావు, సునీతారావు తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోండి: కొండా సురేఖ

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. శనివారం టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎంపీ కోమటిరెడ్డి పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరించారని ఆరోపించారు. మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని కాకుండా తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారని, రాహుల్ భారత్ జోడో యాత్రలో కూడా ఆయన పాల్గొనలేదని చెప్పారు. ఇన్నాళ్లు కోమటిరెడ్డి పార్టీకి దూరంగా ఉన్నందున తాను ఏమీ మాట్లాడలేదని, ఇప్పుడు మళ్లీ పార్టీకి దగ్గరయ్యేందుకు ఆయన ప్రయత్నిస్తున్నందునే తాను మాట్లాడాల్సి వస్తోందన్నారు. ఇతర నేతలెవరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలంటే కోమటిరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్ష అభ్యర్థిత్వాన్ని పరిశీలించండి


ఈ ఏడాది మార్చిలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ఉపాధ్యాయ సంఘం మాజీ నేత, టీపీసీసీ ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని పలువురు కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేకు వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికలకు ముందే కంటి జబ్బులా?

బీఆర్‌ఎస్ హయాంలో ఏ స్కీం కూడా స్కాం లేకుండా జరగదు: మాజీ ఎంపీ బూర



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాత్రమే కంటి వెలుగును ప్రభుత్వం ఎందుకు అమలు చేస్తోందని బీజేపీ నేత, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ప్రశ్నించారు. 2018 ఎన్నికలకు ముందు... ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రజలకు కంటి జబ్బులు, సమస్యలు వస్తున్నాయా అని నిలదీశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మొదటి విడతలో రూ.100 కోట్లతో కొనుగోలు చేసిన మెషీన్లు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండోవిడతకు కేటాయించిన రూ.200 కోట్ల బడ్జెట్‌లో రూ.50 కోట్లు ప్రచారానికి ఖర్చు చేస్తున్నారని, కంటి వెలుగు యాడ్స్ అఫ్గానిస్తాన్‌లో కూడా వేశారని ఎద్దేవా చేశారు. మొత్తం రూ.150 కోట్లలో ఒక్కో కర్రిపై పెట్టే ఖర్చు కేవలం రూ.35 మాత్రమేనని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏ స్కీమ్ కూడా స్కాం లేకుండా జరగదని, లక్షన్నర మెషీన్‌ను రెండున్నర లక్షలకు కొనుగోలు చేశారని ఆరోపించారు. తొలివిడత కంటి వెలుగులో కాటరాక్ట్ ఆపరేషన్ వల్ల 18 మంది అంధులయ్యారన్నారు. ఈ పథకం అమలుకు కొత్తగా ఒక్క డాక్టర్‌ను అయినా నియమించారా అని ప్రశ్నించారు. సరోజిని కంటి ఆసుపత్రిని పూర్తిగా నిర్వీర్యం చేశారని, సీఎం కేసీఆర్ విద్య, వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇన్నేళ్లలో ఒక్క కొత్త ప్రభుత్వ ఆసుపత్రి అయినా కట్టారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.35 వేల కోట్ల వైద్య వ్యాపారం నడుస్తోందని బూర పేర్కొన్నారు.


GRAND REPUBLIC SALE
21-26 జనవరి
JioMart.com
బ్లాక్‌బస్టర్ డీల్స్ పొందండి
#OnPublicDemand
ఇప్పుడు వాట్సాప్ నుండి ఆర్డర్ చేయండి
'Shop now from JioMart' అని 79770 79770 కి పంపండి
5G మొబైల్స్ & యాక్సెసరీస్
ఐఫోన్ 14 ప్లస్
₹89900
@₹71,900/-**
రెడిమి నోట్ 11T 5G | 8GB | 128GB | 50MP AI కెమెరా
₹22999
@₹15,499/-*
శాంసంగ్ గాలాక్సీ S20 FE 5G | 8GB | 128GB
₹74999
@₹28,999/-*
పెబ్రాస్ పల్స్‌ఫిట్ P261 4.31 cm BT కాలింగ్ స్మార్ట్‌వాచ్
₹5999
@₹999/-
బోట్ రాకర్స్ 235v2 రెడ్
₹2990
@₹799/-
యాక్టివ్ నాయిస్ కాన్సిలేషన్‌తో రియల్‌మి బడ్స్ క్యూ2
₹3499
@₹1,499/-
ఎలక్ట్రానిక్స్ & అప్లియెన్సెస్
మాక్‌బుక్ ఎయిర్ | M1 చిప్ 8 GB | 256 GB
₹99900
@₹71,990/-*
ఐపాడ్ | 9వ జెన్ 64 GB | వైఫై
₹33900
@₹24,990/-*
శాంసంగ్ 108 cm క్రిస్టల్ అల్ట్రా హెచ్‌డి (4K) స్మార్ట్ TV
12 నెలల పాటు నో కాస్ట్ EMI
@₹2583/నెల
(48 గంటలలోగా ఉచిత ఇన్‌స్టలేషన్‌తో)
ఎల్‌జి 260L ఫ్రాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్ స్మార్ట్ ఇన్వర్టర్ కంప్రెసర్
₹30999
@₹21,591/-*
IFB 6 kg ఫుల్లీ ఆటోమాటిక్ వాషింగ్ మెషీన్ ఫ్రంట్ లోడింగ్
₹28290
@₹21,141/-*
బటర్‌ఫ్లై మిక్సర్ గ్రైండర్ 3 జార్ | 500 W
₹4399
@₹2,099/-
డైలీ ఎస్సెన్షియల్స్
టీ
50% వరకు తగ్గింపు
సోప్స్
33% వరకు తగ్గింపు
స్పోర్ట్స్ న్యూట్రిషన్
50% వరకు తగ్గింపు
డైపర్స్
50% వరకు తగ్గింపు
ఇండియా గేట్ బాస్మతి రోజానా 5 kg + ఫార్చ్యూన్ రైస్ బ్రాన్ ఆయిల్ 5 L కాంబో
₹1570
@₹1,099/-
సూపర్ సర్వోత్తం రైస్ బ్రాన్ ఆయిల్ 1 L
₹199
@₹129/-
హోమ్ & లైఫ్ స్టైల్
సారీస్ & కుర్తాలు
1 U మొదలు
@₹149/-
జీన్స్ & టీ షర్ట్స్
1 U మొదలు
@₹129/-
షూస్, హీల్స్, సాండల్స్ & మరెన్నో
1 U మొదలు
@₹99/-
హ్యాండ్‌వోవెన్ ఇకత్ డ్రెస్ మెటీరియల్స్
80% వరకు తగ్గింపు
నిర్లెప్ 3 Pcs కుక్‌వేర్ సెట్
₹1467
@₹499/-
సింప్లీ వుడ్ కింగ్ స్టోరేజ్ - బెడ్ & మ్యాట్రెస్
₹37798
@₹14,742/-
10% INSTANT DISCOUNT^ ^T&C APPLY
bob World
FEDERAL BANK YOUR PERFECT BANKING PARTNER
ICICI Bank
kotak
UNLESS SPECIFIED, THE RETAIL PRICES SHOWN ARE FOR 1 UNIT OF THE PRODUCT.
Terms & Conditions Apply. Offer valid till stocks last and all offers are subject to change without prior intimation/notice. The pictures/photographs of the products shown are for representation purposes only. MRP of all products are inclusive of all taxes. All offers are valid till 26th January 2023. All disputes are subject to the exclusive jurisdiction of the courts in Mumbai only. Only Select offers available on WhatsApp. ICICI Offer applicable on Credit Cards. Kotak offer applicable on Credit, Debit and EMI transactions.
*Prices are inclusive of bank offers if and when applicable. | **Price incl. of HDFC Bank Offer. | ^Only applicable on first transaction on JioMart.
SAATCHI & SAATCHI

> కలహమునకు దూరముగా నుండుట నరులకు ఘనత.
> మూర్ఖుడైన ప్రతివాడును పోరును కోరును.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.పాడ్యమి రా.12.57 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.8.00 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: ప.11.43 నుండి 1.11 వరకు, దుర్ముహూర్తం: ప.4.15 నుండి 5.01 వరకు, అమృతఘడియలు: రా.8.36 నుండి 10.04 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.45
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

డాక్టర్ తమిళిసై (గవర్నర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఒకే గ్రహం మీది మనుషులు ఒకర్నొకరు ఎందుకు అసహనంగా, అనుమానంగా చూసుకుంటారు! ఒకే గ్రహం కాదు.. ఒకే దేశం, ఒకే రాష్ట్రంలోని మనుషుల కూడా!

మనుషులు మనుషులుగా ఉన్నంత వరకేనేమో ఒకరితో ఒకరు బాగుండటం?! అవతలి వ్యక్తి గవర్నర్‌గా రాగానే ఇవతలి వ్యక్తికి తను మనిషిని కాదనీ, ముఖ్యమంత్రిననీ ఎందుకు గుర్తుకు రావాలి!

మనిషిగా నాకున్న మంచి జ్ఞాపకాలన్నీ కేవలం మనుషులతోనే. అధినేతలతో కాదు. ముప్పై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. మనిషిని చెయ్యి వదిలిన రోజు లేదు నేను. మనిషి కనిపిస్తే నాడి పట్టుకుని చూస్తాను. "ఏం తల్లీ, బాగున్నావా?" అని అడుగుతాను. బాగున్నవాళ్ల నాడి పట్టుకుని చూడకూడదనే ముంది?! ఏ దారిలోనైనా స్కూలు కనిపిస్తే ఆగి, స్కూలు లోపలికి వెళతాను. "పిల్లలూ.. వేళకు భోంచేస్తున్నారా?" అని అడుగుతాను. వాళ్ల తరగతి గదిలో ఉన్నంత మాత్రాన "పిల్లలూ.. బాగా చదువుతున్నారా?" అని మాత్రమే నేను



అడగాలనేముంది?

కేసీఆర్ గారిని కూడా.. ఆయన నన్ను గవర్నరుగా మాత్రమే చూసేందుకు పరిమితం కాకపోయుంటే నన్ను నేను గవర్నర్‌గా మాత్రమే చూసుకుని ఉంటానా? "ఏమండీ చంద్రశేఖర్రావు గారూ.. ఎప్పుడూ మీరు ప్రజలకు సేవ చేయడమేనా! ప్రజల్నీ మీకు సేవ చేయనివ్వండి.." అని తేనీటి సేవనానికి ఆయన్ని రాజ్‌భవన్‌కు ఆహ్వానించి ఉండనా?!

"అసలు మీకు, కేసీఆర్ గారికి మధ్య గొడవెలా మొదలైంది?" అని తమిళ జర్నలిస్టు ఒకరు రాజ్‌భవన్‌లో మోదీజీ పుస్తకం 'ఎగ్జామ్ వారియర్స్' ఆవిష్కరణకు వచ్చినప్పుడు నన్ను అడిగారు. తమిళ జర్నలిస్టుకైనా, తెలుగు జర్నలిస్టుకైనా, హిందీ జర్నలిస్టుకైనా నేను చెప్పేది ఒకటే. ఆ గొడవన్నది తెలంగాణ అనే ఒక రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రికీ, ఆ రాష్ట్ర గవర్నరుకీ మధ్య మొదలైనదే తప్ప.. ఒకే గ్రహానికి చెందిన ఇద్దరు మనుషుల మధ్య మొదలైంది కాదని.

రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లేకపోవచ్చు కానీ.. మహిళలు మాత్రమే రాజకీయాల నుంచి ఒక మనిషిని 100 శాతం వేరు చేసి చూడగలరు. అలా వేరు చేసి చూస్తే.. కేసీఆర్ గారు పర్‌ఫెక్ట్ జెంటిల్మన్. మమతా బెనర్జీ అల్రెడీ తమ కొత్త గవర్నర్ ఆనంద బోస్‌ను పర్‌ఫెక్ట్ జెంటిల్మన్ అనేశారు కనుక, కేసీఆర్ గారిని మోస్ట్ పర్‌ఫెక్ట్ జెంటిల్మన్ అనాలి. ఆయన మరొకరి ఘనతను అంగీకరించరు కాబట్టి.


ప్రొటోకాల్ విషయంలో కేసీఆర్ గారు ఎలాగున్నా, రాష్ట్రపతి శ్రీమతి ముర్ము హైదరాబాద్ వచ్చినప్పుడు మాత్రం ఆయన తన మానవ ధర్మాన్ని విస్మరించలేదు. మేడమ్‌ను ఆహ్వానించడానికి నాతో కలిసి వచ్చారు. నన్ను తనతో కలుపుకొని వెళ్లారు! ఖమ్మం సభలో కూడా ముందుగా ఏమీ ఆయన గవర్నర్‌లను అనలేదు. కేజ్రీవాల్, విజయన్ అన్నాకే.. తను అనవలసి వచ్చి అన్నారు.

గవర్నర్‌లను అనకూడదనేమీ లేదు. అయితే ఒక పార్టీ ఆవిర్భావ సభకు వచ్చిన ముఖ్యమంత్రులు ఆ పార్టీ నాయకుడి సామర్థ్యాల గురించి కాకుండా, గవర్నర్‌లు తమను వేధిస్తున్నారని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని వాపోవడం ఏమిటి!

సభకు వచ్చిన ఆ ఇద్దరు ముఖ్యమంత్రుల కన్నా.. సభకు రాని ముఖ్యమంత్రులు నితీశ్‌కుమార్, మమతాబెనర్జీ, స్టాలిన్, నవీన్ పట్నాయక్.. వీళ్లే నిజంగా కేసీఆర్ గారి వెంట ఉన్నట్లు. కేసీఆర్ గారి కొత్త జాతీయ పార్టీకి నిజంగా మద్దతు ఇస్తున్నట్లు.

ఈ మాటంటే కేసీఆర్ గారు వినిపించుకుంటారా?! మోదీజీని మైండ్‌లోంచి దించేసుకుంటే తప్ప ఆయన ఆలోచనలకేదీ ఎక్కదు. ఆయన తనని ముఖ్యమంత్రి అనుకుంటున్నంత కాలం.. మోదీజీని వట్టి ప్రధానిగానే చూస్తారు. అసలైన ప్రజా నాయకుడిగా చూడలేరు. తనూ అసలైన ప్రజా నాయకుడిగా ఉండలేరు.

చిలుక జోస్యమే చివరి ఆశ!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

తూర్పు దిక్కున విచ్చుకుంటున్న ప్రభాత రేకల్ని మనం చూడగూడదు. పడమటి సంధ్యారాగపు విభాత గీతాలాపన మన చెవిన పడగూడదు. తలుపులకూ, కిటికీలకూ ఇనుప తెరలు కప్పేద్దాం. మన పాలితులకు మన సినిమానే చూపిద్దాం. ఆధిపత్య వర్గాలకు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగుబాటయ్యే సమాజాల్లో ఈ భావజాలం రాజ్యం చేస్తుంది. సకల వ్యవస్థలనూ ఈ వర్గాలు పెంపుడు చిలుకలుగా మార్చివేస్తాయి. వార్తలనూ, వ్యాఖ్యానాలనూ ఈ చిలుకల పలుకుల్లోనే మనం గ్రహించాలి. ధర్మమేమిటో, సంప్రదాయమేమిటో, వ్యవహారమేమిటో కూడా ఈ చిలుకలే మనకు బోధిస్తాయి. 'హెచ్ఎమ్‌వి' రికార్డుల్నే ఈ చిలుకలు వినిపిస్తాయనేది ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు.

ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు తాలం వేయని ప్రభుత్వాలు ఏర్పడితే ఇక రణమే. పెంపుడు చిలుకలు కూడా కత్తులు దూస్తాయి. మీడియానే ముందుండి యుద్ధం చేస్తుంది. ఈ పరిణామాలకు ఆంధ్రప్రదేశ్ కంటే స్పష్టమైన ఉదాహరణ ఇంకొకటి లేదు. పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసే ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలో పెంపుడు చిలుకలకు అరాచకమే కనిపిస్తుంది. తొక్కిసలాట నిరోధించే భద్రతా చర్యలైనా, అక్రమ భవంతులను కూల్చివేయడమైనా అప్రజాస్వామికంగానే కనిపిస్తాయి.

సూర్యుడు మార్నింగ్ బెల్ కొట్టకముందే వేకువ కిరణాల మాదిరిగా సంక్షేమాన్ని జనం ముంగిటకు చేర్చుతున్న వలంటీర్లలో ఎల్లో మీడియాకు సంఘ విద్రోహులు కనబడుతున్నారు. తనకు కనిపించడమే కాదు, ప్రజలందరూ ఇదే విషయాన్ని నమ్మి తీరాలని కూడా ఎల్లో మీడియా సమాజాన్ని ఆదేశిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థను దేశంలో ఉన్న విజ్ఞులందరితోపాటు ఇంగిత జ్ఞానమున్న సామాన్యులు సైతం ప్రశంసిస్తున్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాకారంలో విప్లవాత్మకమైన ముందడుగుగా భావిస్తున్నారు. కానీ, మన పెత్తందారీ వర్గాల పెంపుడు చిలుకలు మాత్రం ఒక దుందుడుకు చర్యగా పరిగణిస్తున్నాయి. వాటి మీద విష ప్రచారాన్ని ఎక్కుపెట్టాయి. రైతు పండించిన ధాన్యానికీ, మద్దతు ధరకూ మధ్యన అడ్డుగోడగా నిలిచిన దళారీ వ్యవస్థను ప్రభుత్వం తొలగించింది. ఇది గిట్టని ఎల్లో మీడియా ప్రతిరోజూ కళ్లల్లో నిప్పులు గుమ్మరించుకుంటూనే ఉన్నది.

పేద పిల్లలకు ఇంగ్లిషు మీడియం చదువు చెబితే ఎల్లో మీడియాకు కడుపునొప్పి. నాణ్యమైన ఆధునిక విద్యను ఉచితంగా అందజేస్తే అజీర్తి రోగం. అత్యుత్తమమైన ప్రజా వైద్యం పల్లెగడప తొక్కితే మూలశంక వ్యాధి మెలిపెడుతున్నది. మహిళల సాధికారత కోసం పదవులూ, నిధులూ అందుబాటులో ఉంచితే కడుపు తరుక్కుపోతున్నది. సొంత ఇంటి రూపంలో కొంత ఆస్తిని సమకూర్చితే ఎల్లో కూటమి కాలేయం కమిలిపోతున్నది. పేదవర్గాలకు ప్రత్యక్షంగా నగదు బదిలీని చేస్తుంటే తనువెల్లా దహించుకుపోతున్నది. తను ఇంతగా రోగపీడితం కావడానికి కారణమైన ప్రభుత్వంపై ఈ కూటమి తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నది. తక్షణం గద్దె దింపాలన్న కోరికతో సెగలు కక్కుతున్నది. అందుకోసం సమాచార విధ్వంసానికి పూనుకుంటున్నది. నందిని పందిగా, పందిని నందిగా ప్రచారం చేయడానికి తెగబడుతున్నది. వ్యవస్థల్లోని పెంపుడు చిలుకలను ఉపయోగించుకొని ప్రజాభిప్రాయాన్ని 'ఉత్పత్తి' చేయడానికి ఒడిగడుతున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెస్తున్న అప్పులపైనా, చేస్తున్న ఖర్చులపైనా ఎల్లో మీడియా ఎంత గోబెల్స్ బీభత్సాన్ని సృష్టించిందో లోకమంతా చూసింది. రాష్ట్రం నేడో, రేపో మరో శ్రీలంక కాబోతున్నదని ప్రజలను బెదరగొట్టే ప్రయత్నాలు చేసింది. డబ్బంతా పప్పు బెల్లాలకే ఖర్చు చేస్తున్నారు తప్ప అభివృద్ధి కోసం పైసా విదల్చడం లేదని చాటింపు వేసి మరీ బాకా ఊదారు. ఇటువంటి కుక్క కాట్లకు ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ శాఖలే చెప్పుదెబ్బల్లాంటి సమాధానాలిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో అభివృద్ధి వాటానే ఎక్కువని బడ్జెట్ గణాంకాలను ఉటంకిస్తూ ఆర్‌బీఐ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. సామాజిక రంగంపై చేసే ఖర్చు... అంటే విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, గోదాముల నిర్మాణం వంటివన్నీ అభివృద్ధి ఖాతాలోకే వస్తాయని ఆర్‌బీఐ తేటతెల్లం చేసింది. 11.43 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి

> ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెస్తున్న అప్పులపైనా, చేస్తున్న ఖర్చులపైనా ఎల్లో మీడియా ఎంత గోబెల్స్ బీభత్సాన్ని సృష్టించిందో లోకమంతా చూసింది. రాష్ట్రం నేడో, రేపో మరో శ్రీలంక కాబోతున్నదని ప్రజలను బెదరగొట్టే ప్రయత్నాలు చేసింది. డబ్బంతా పప్పు బెల్లాలకే ఖర్చు చేస్తున్నారు తప్ప అభివృద్ధి కోసం పైసా విదల్చడం లేదని చాటింపు వేసి మరీ బాకా ఊదారు. ఇటువంటి కుక్క కాట్లకు ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ శాఖలే చెప్పుదెబ్బ ల్లాంటి సమాధానాలిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో అభివృద్ధి వాటానే ఎక్కువని బడ్జెట్ గణాంకాలను ఉటంకిస్తూ ఆర్‌బీఐ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. సామాజిక రంగంపై చేసే ఖర్చు... అంటే విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, గోదాముల నిర్మాణం వంటివన్నీ అభివృద్ధి ఖాతాలోకే వస్తాయని ఆర్‌బీఐ తేటతెల్లం చేసింది. 11.43 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి దేశంలోనే మొదటిస్థానంలో (2021–22) ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నివేదికల సారాంశం ఎల్లో మీడియాకు నిద్ర పట్టనివ్వడం లేదు. అది వితండ వాదానికి తెగబడుతున్నది. అమరావతిలో నాలుగు భవంతుల నిర్మాణమే అభివృద్ధిగా ప్రచారం చేయడానికి అపసోపాలు పడుతున్నది.

దేశంలోనే మొదటిస్థానంలో (2021-22) ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నివేదికల సారాంశం ఎల్లో మీడియాకు నిద్ర పట్టనివ్వడం లేదు. అది వితండవాదానికి తెగబడుతున్నది. అమరావతిలో నాలుగు భవంతుల నిర్మాణమే అభివృద్ధిగా ప్రచారం చేయడానికి అపసోపాలు పడుతున్నది.

ప్రపంచమంతటా ఇప్పుడు కొత్త గాలులు వీస్తున్నాయి. నయా ఉదారవాదానికి (Neo Liberalism) కాలం చెల్లినట్టేనని పెట్టుబడిదారీ ఆర్థిక ప్రవక్తలే గట్టిగా వాదిస్తున్నారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ఈ దేశంలో సృష్టించిన కీలుబొమ్మల్లో ముఖ్యుడైన చంద్రబాబు సహా ఆయన పెత్తందారీ ఎల్లో కూటమి ఇంకా దాన్నే పట్టుకొని వేలాడుతున్నాయి. మానవాభివృద్ధి కంటే వస్తుగతాభివృద్ధిలోనే పెత్తందారీ వర్గాల స్వీయ ప్రయోజనాలు ఇమిడి ఉండటమే అందుకు కారణం.

గడిచిన నాలుగేళ్లలో ఒకదాని తర్వాత ఒకటి చొప్పున లాటిన్ అమెరికాలో నయా ఉదారవాద ప్రభుత్వాలు కుప్పకూలుతున్నాయి. వాటి స్థానంలో వామపక్ష, వామపక్ష మధ్యేవాద ప్రభుత్వాలను ప్రజలు అధికారంలోకి తెస్తున్నారు. మెక్సికో, అర్జెంటీనా, చిలీ, పెరూ, బొలీవియా, హోండూరస్, బ్రెజిల్ వగైరా డజన్‌కు పైగా లెఫ్టిస్టు ప్రభుత్వాలతో దక్షిణ అమెరికా ఖండం రంగు మారుతున్నది. నయా ఉదారవాదపు అమానవీయ పంపిణీ విధానాన్ని జనం తిరస్కరిస్తున్నారు.

నయా ఉదారవాదం సృష్టించిన అసమానతలు ఎంత అమానుషంగా ఉన్నాయో ఎప్పటికప్పుడు ఆక్స్‌ఫామ్ విడుదల చేస్తున్న నివేదికలు స్పష్టం చేస్తూనే ఉన్నాయి. మొన్నటి దావోస్ సమావేశాల తొలిరోజు విడుదల చేసిన తాజా నివేదిక మరింత భయంగొలిపే విధంగా ఉన్నది. ఈ రెండున్నరేళ్లలో ప్రపంచం 42 ట్రిలియన్ డాలర్ల సంపదను సృష్టించింది. జనాభాలో ఒక్క శాతం శ్రీమంతుల ఖాతాలో అందులో 67 శాతం సంపద పడిపోయింది. మిగిలిన 99 శాతం మందికి 33 శాతం సంపద. 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్' పేరుతో విడుదల చేసిన ఈ నివేదిక నయా ఉదారవాద అమానుషత్వాన్ని ఎత్తి చూపింది. సంపన్నుల సంపద ఈ పాతికేళ్లలో ఎంత వేగంగా పెరిగిందో అంతే వేగంగా పేద ప్రజల పేదరికం కూడా పెరిగింది.

భారతదేశం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. అట్టడుగున ఉండే 50 శాతం మంది పేద ప్రజల చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉన్నది. ఒక్కశాతం కుబేరుల చేతిలో 40 శాతం సంపద పోగుపడింది. ఈ కుబేరుల్లో వరసగా 10 శాతం మందిని లెక్కిస్తే వారందరి చేతిలో కలిపి 80 శాతం సంపద ఉన్నది. అంటే ఈ దేశంలో ఒక వంద రూపాయల సంపద ఉందనుకుంటే, దేశ జనాభా వందమంది అనుకుంటే పంపిణీ ఈవిధంగా ఉంటుంది. పదిమంది ధనవంతుల ఆస్తి 80 రూపాయలు. 50 మంది పేదవారి ఉమ్మడి ఆస్తి 3 రూపాయలు. 40 మంది మధ్య–ఎగువ మధ్యతరగతి వారి ఆస్తి విలువ 17 రూపాయలు. దేశంలోని సమస్త ప్రజలు సమష్టిగా శ్రమించి, అందరికీ చెందవలసిన సహజ వనరులను ఉపయోగించుకుని సృష్టించిన సంపదలో ఈ రకమైన పంపిణీ న్యాయమైనదేనా? ఈ దేశంలోని శ్రీమంతులకూ, పెట్టుబడిదారులకూ ఇంకో సౌలభ్యం కూడా ఉన్నది. వాళ్లు బ్యాంకుల్లో ఉన్న ప్రజల సొమ్మును అప్పుగా తీసుకొని ఆ తర్వాత ఎగవేయవచ్చు. అలా గడిచిన ఎనిమిదేళ్లలో 12 లక్షల కోట్ల రుణాలను ఎన్‌పీఏలుగా పరిగణించి కేంద్ర పెద్దల సాయంతో మాఫీ ముద్ర వేసేశారట. ఏ పేదవాడి రుణాన్నయినా ఈ దేశంలోని ఏ బ్యాంకయినా ఇలా మాఫీ చేసిన చరిత్ర ఉన్నదా? చెంబూ, తపేలాలతో సహా ఇంటినీ, ఒంటి మీది గోచీని కూడా వేలంవేసి వసూలు చేయడమే బ్యాంకులకు రివాజు.

ఈ నేపథ్యంలోనే నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా కొత్త ఆలోచనలు ముందుకు వచ్చాయి. ఈ ఆలోచనలకే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు పట్టం కడుతున్నారు. లాటిన్ అమెరికా దేశాల్లోని పరిణామాలను కూడా ఈ కోణం నుంచే అర్థం చేసుకోవలసి ఉంటుంది. అసమానతలతో కూడిన అమానవీయ అభివృద్ధికి బదులుగా సమస్త మానవుల అభివృద్ధి, ప్రకృతి వనరుల పరిరక్షణతో కూడిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (Sustainable development) ఎంపిక చేసుకోవాలనేది ఒక ముఖ్యమైన ఆలోచన. ముఖ్యమైన పరిశ్రమలు, కీలక మౌలిక రంగాల మీద ప్రభుత్వరంగ అజమాయిషీయే కొనసాగాలనేది మరో ఆలోచన. ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేయడానికీ, విద్య, వైద్య సౌకర్యాల విస్తరణకూ, వారి సాధికారతకూ ప్రభుత్వాలు పెద్దఎత్తున ఖర్చు చేయాలి. ధనిక–పేద, ఆడ–మగ, జాతి లేదా కులాల మధ్య అంతరాల్లేని అభివృద్ధి లక్ష్యంగా ఉండాలి. ఈ తరహా ఆలోచనలకే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పట్టం కడుతున్నారు.

> పేద వర్గాల ప్రజలను నిలబెట్టడానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రెండు లక్షల కోట్లను ప్రత్యక్షంగా బదిలీ చేయడాన్ని 'ఈనాడు' సహిత ఎల్లో మీడియా, ఆంధ్రప్రదేశ్ పెత్తందార్లు, వారి నాయకుడైన చంద్రబాబు సహించలేకపోతున్నారు. ఇలా ఖర్చుపెడితే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని శాపనార్థాలు పెడుతున్నారు. ట్యాక్స్‌పేయర్ల సొమ్మును ఉచితాలకు తగలేస్తున్నారని మధ్యతరగతి వారిని రెచ్చగొడుతున్నారు. అయ్యా ట్యాక్స్ పేయర్లూ! మీ సొమ్మును ఎవరు కబళించుకుపోతున్నారో కొంచెం బుర్రపెట్టి ఆలోచించండి. ఎల్లో మీడియా మిడిమిడి జ్ఞానపు రాతలకూ, వాట్సప్ యూనివర్సిటీ పోసుకోలు పాఠాలకూ ప్రభావితం కావద్దు. మీ ట్యాక్స్ సొమ్మునే కాదు, పేద ప్రజలు రక్తమాంసాలు కరిగించి చిందించిన చెమట చుక్కల్ని కూడా కుబేరులు దోచుకుంటున్నారు. ఆ కుబేరులు పోగేసుకున్న 80 శాతం సంపదలో కనీసం సగమైనా సామాజిక అభివృద్ధికి తరలించవలసిన అవసరం లేదా? ఆలోచించండి.

ఈ పూర్వరంగం నుంచి చూసినప్పుడే మనకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కూడా అర్థమవుతాయి. పేద వర్గాల ప్రజలను నిలబెట్టడానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండు లక్షల కోట్లను ప్రత్యక్షంగా బదిలీ చేయడాన్ని 'ఈనాడు' సహిత ఎల్లో మీడియా, ఆంధ్రప్రదేశ్ పెత్తందార్లు, వారి నాయకుడైన చంద్రబాబు సహించలేకపోతున్నారు. ఇలా ఖర్చుపెడితే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని శాపనార్థాలు పెడుతున్నారు. ట్యాక్స్ పేయర్ల సొమ్మును ఉచితాలకు తగలేస్తున్నారని మధ్యతరగతి వారిని రెచ్చగొడుతున్నారు. అయ్యా ట్యాక్స్ పేయర్లూ! మీ సొమ్మును ఎవరు కబళించుకుపోతున్నారో కొంచెం బుర్రపెట్టి ఆలోచించండి. ఎల్లో మీడియా మిడిమిడి జ్ఞానపు రాతలకూ, వాట్సప్ యూనివర్సిటీ పోసుకోలు పాఠాలకూ ప్రభావితం కావద్దు. మీ ట్యాక్స్ సొమ్మునే కాదు, పేద ప్రజలు రక్తమాంసాలు కరిగించి చిందించిన చెమట చుక్కల్ని కూడా కుబేరులు దోచుకుంటున్నారు. ఆ కుబేరులు పోగేసుకున్న 80 శాతం సంపదలో కనీసం సగమైనా సామాజిక అభివృద్ధికి తరలించవలసిన అవసరం లేదా? ఆలోచించండి.

'యుద్ధం ముగిసిన రణభూమి వృద్ధాప్యం' అంటారు. చేతులు – కాళ్లు తప్ప మరే ఆస్తిలేని పేదలంతా కరాల బిగువు, నరాల సత్తువ ఉన్నంతవరకూ జీవన పోరాటం చేసి అలసిసొలసి, కొంచెం సాంత్వన కోరుకుంటారు. కన్నబిడ్డలు ఎవరి బతుకు పోరులో వారు నిమగ్నం కాగా, బుక్కెడు బువ్వకోసం, ఓ చిన్న పలకరింపు కోసం అవ్వాతాతలు ఎదురుచూస్తుంటారు. వారి ఇళ్ల వద్దకు వలంటీర్లు వెళ్లి యోగక్షేమాలడిగి పెన్షన్ డబ్బులు చేతిలో పెడితే పాపమా? అది వ్యవస్థ బాధ్యత కాదా? 'ఈనాడు'–చంద్రబాబు ఎల్లో కూటమి అది పాపమనే అభిప్రాయపడుతున్నాయి. పేద పిల్లలు ఇంగ్లిషు మీడియంలో చదవడం కూడా పాపమనే భావిస్తున్నాయి. మహిళలకు సమాన స్థాయి సామాజిక – రాజకీయ – ఆర్థిక హోదాను కల్పించడాన్ని కూడా పాపకార్యంగానే భావిస్తున్నాయి. కనుక ఈ తరహా సుస్థిర–మానవీయ అభివృద్ధి లక్ష్యాలను ఎంచుకున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై అవి యుద్ధానికి సమాయత్తమవుతున్నాయి. కానీ ఈ కూటమి నమ్ముకున్న నయా ఉదార విధానాలు ప్రపంచమంతటా మట్టికరుస్తున్నాయి. కొత్త ఆలోచనల ఝంఝామారుతం ప్రచండ వేగంతో వీస్తున్నది. ఇనుప తెరలు ఆ వేగాన్ని తట్టుకోలేవు. ఎన్ని రాజకీయ కూటములను ఏర్పాటు చేసుకున్నా, ఎంతమంది ప్రవచకుల చేత సుభాషితాలు చెప్పించినా, ఎన్ని చిలుక జోస్యాలను ప్రచారంలో పెట్టినా, జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న పేదవర్గాలు – మధ్యతరగతి ప్రజల ఐక్య సంఘటనను ఎదుర్కోలేవు.

vardhelli1959@gmail.com

గిడుగు తెలుగు భాషకు గొడుగు

సందర్భం



శ్రీనివాస్ కొరాడ

గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు (1863 ఆగస్టు 29–1940 జనవరి 22) తెలుగు వ్యావహారిక భాషోద్యమ పిత. వ్యాకరణ బంధనాల్లో చిక్కుకొని, పండిత కుటుంబాలకే అంటే అగ్రవర్ణాలకే పరిమితమైన చదువును... బడుగు బలహీన వర్గాలకు దగ్గర చేసినవాడు గిడుగు. భాష ద్వారా సామాజిక అంతరాలను తగ్గించి, తెలుగు నేలను అభ్యుదయం వైపు నడిపించిన పిడుగు మన గిడుగు.

18, 19 శతాబ్దాలలో విజయనగరం సంస్థానంలో పని చేయడానికి కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి వలస వచ్చిన అనేక కుటుంబాలలో గిడుగు కుటుంబం కూడా ఒకటి. గిడుగు తండ్రి గిడుగు వీర్రాజు. ఈయన స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా (నేడు డా॥ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా) ఇందుపల్లి గ్రామం. 1858లో వీర్రాజు విజయనగరం వలస వచ్చి, సంస్థానంలో ఉద్యోగంలో చేరారు. తర్వాత రామ్మూర్తి 1863 ఆగస్టు 29న జన్మించారు.

రామ్మూర్తి విజయనగరం మహారాజా కళాశాలలో లోయర్ ఫోర్త్‌లో చేరారు. గురజాడ అప్పారావు కూడా అదే తరగతి. మెట్రిక్యులేషన్ పూర్తయ్యే వరకు అంటే 1879 వరకు ఇద్దరిదీ ఒకటే తరగతి. వీరికి దిగువ తరగతిలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు ఉండేవారు. 1879లో మెట్రిక్యులేషన్ పూర్తయింది. అదే సమయంలో కుటుంబ, వివాహ బాధ్యతల వలన రామ్మూర్తి పంతులు విశాఖపట్నం కలెక్టర్ ఆఫీసులో గుమాస్తాగా చేరాల్సి వచ్చింది. రెవెన్యూలో ఉద్యోగం నచ్చక పర్లాకిమిడి హైస్కూల్లో నెలకు రూ. 30 జీతానికి ఉపాధ్యాయునిగా చేరారు. ఉద్యోగం చేస్తూనే ఎఫ్ఏ, బీఏలను ప్రైవేటుగా పాస య్యారు. తదుపరి చరిత్ర ఉపన్యాసకులుగా కూడా పనిచేశారు.

పర్లాకిమిడిలో 'రీడింగ్ రూమ్' అనే సమాజం ద్వారా సంఘ సంస్కరణ కోసం కృషిచేశారు. 'రీడింగ్ రూమ్' సమాజం వితంతు వివాహాల కోసం చురుకుగా పనిచేసేది. దీని వెనుక 1908 వరకు ఆ సమాజానికి కార్యదర్శిగా ఉన్న గిడుగు కృషే ఉంది.

పర్లాకిమిడి పట్టణ ప్రాంత సమీప కొండల్లో సవరజాతివారు నివసిస్తుండేవారు. కొండల్లో కట్టెలు కొట్టుకువచ్చి పర్లాకిమిడిలో అమ్ముకొనేవారు. రామ్మూర్తి పంతులు వారి జీవితాలను పరిశీలించారు. వారు దోపిడీకి గురవుతున్నారని గ్రహించారు. వారిని నాగరిక ప్రపంచంలోనికి తీసుకురావాలంటే చదువుకున్నవారిగా తయారుచేయాలని భావించారు. తెలుగు భాష తెలిసిన సవర 'పొట్టెడు' వద్ద సవర భాష నేర్చుకొన్నారు. సవరల బతుకులు మార్చాలనీ, వారి కోసం బడులను తెరవాలనీ రామ్మూర్తి భావించారు. ఈ క్రమంలో సవరలతో స్నేహం చేయడానికి చేసే ప్రయత్నంలో మలేరియా జ్వరం బారిన పడి, క్వినైన్ మందు వాడారు. అందు వలన చెముడు వచ్చింది. చివరకు సవరలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పి, వారినే ఉపాధ్యాయులుగా ఉపయోగించి, వారి కోసం పాఠశాలలను ఏర్పాటు చేశారు. సవర భాషకు చేసిన సేవకు గాను రామ్మూర్తి పంతులు 'కైజర్–ఇ–హింద్' బిరుదును మద్రాసు గవర్నర్ జనరల్ చేతుల మీదుగా అందుకున్నారు.



ఇదే సమయంలో 1906లో జేఏ ఏట్స్ గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల పాఠశాల తనిఖీ అధికారిగా విశాఖపట్నంలో విధుల్లో చేరారు. ఉద్యోగ రీత్యా ఈయన తెలుగు నేర్చుకోవల్సి వచ్చింది. ఏట్స్ నేర్చుకుంటున్న భాషకు జనసామాన్యంలో ఉన్న భాషకు విపరీతమైన తేడా ఉన్నట్లు గుర్తించారు. పాఠశాలల తనిఖీ సమయంలోనూ పాఠశాలలో చెప్పే గ్రాంథిక భాషకూ, వాడుక భాషకూ చాలా వ్యత్యాసం ఉందని ఏట్స్ గ్రహించారు. ఆ విషయంపై గురజాడ సలహా మీద గిడుగు రామ్మూర్తి ముందు తన సందేహాలను ఉంచారు ఏట్స్. ఆయన కొంత సమయం ఇవ్వమని ఏట్స్‌ను అడిగారు. ఆయనకు విద్యారంగంలో ఉన్న అనుభవం వలన ఏట్స్ లేవనెత్తిన అంశం సరైనదిగా తోచింది. కాని తనకు తెలుగు భాషపై ప్రావీణ్యత లేదని భావించి దానిని సాధించడం కోసం నన్నయ్య కాలం నుండి చిన్నయ్య సూరి కాలం వరకు తెలుగు కావ్య భాషను పరిశీలించారు. భాష అనేది మారుతూ ఉన్నదనీ, జీవద్భాషకు మార్పు సహజమనీ రామ్మూర్తి గ్రహించారు.

ఏట్స్ గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల కొరకు ఉపాధ్యాయ పరిషత్ ఏర్పాటు చేసి 1907 నుంచి వేసవి సెలవులలో సభలు నిర్వహించారు. 1910 నాటి సభలో ఫోర్త్ ఫారం నుంచి బీఏ వరకు విద్యార్థుల చేత వ్యాస రచనలు, అనువాదాలు తెలుగు వ్యావహారిక భాషలో రాయించడం మంచిదని రామ్మూర్తి సూచించారు. ఇదే వ్యావహారిక భాషావాదంలోని మొదటి కలకలం.

రామ్మూర్తి పంతులు గ్రాంథిక వాదులను ఎదుర్కొంటూ తను మరణించేంత వరకు అంటే 1940 వరకు ఒక్కడై పోరాడి విజయం సాధించారు. బడుగు బలహీన వర్గాలవారికి చదువు దగ్గరై సామాజిక తారతమ్యాలు దూరమవడానికి ఆయన కృషి ప్రధాన సాధనం అయ్యింది. వ్యావహారిక భాష విద్యారంగంలో ముందుగానే ప్రవేశపెట్టిన బెంగాలీలు నాడు దేశంలో అందరికంటే ముందుండేవారు. తెలుగు నేలపై కూడా వ్యావహారిక భాషోద్యమం మరి కొన్నాళ్ళు అలస్యమై ఉండి ఉంటే, మనం మరికొంత వెనుకబడి ఉండేవారమేమో!

1928–1936 మధ్య పర్లాకిమిడి రాజావారితో ఏర్పడిన విభేదాల కారణంగా ఆయన ఒరిస్సా రాష్ట్రం ఏర్పడే సమయానికి రాజమండ్రికి చేరుకొని అక్కడే చివరి శ్వాస వరకు జీవించారు. తెలుగువారం ఉన్నంత కాలం రామ్మూర్తికి రుణపడే ఉంటాం.

వ్యాసకర్త తహశీల్దార్, భోగాపురం మండలం, విజయనగరం జిల్లా

(నేడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి)

హిమాలయాలను కాపాడాలి

హిమాలయాలు లేకపోతే, భారతదేశమే లేదంటే అతిశయోక్తి కాదు. దేశంలో 70 శాతం ప్రజలకు తాగునీరు, సాగునీరు, అందజేస్తున్న మూడు జీవనదులు గంగా, సింధు, బ్రహ్మపుత్రల పుట్టినిల్లు హిమాలయాలు. మనకు అందమైన పర్యాటక ప్రదేశాలు, కులూ మనాలి, సిమ్లా, ముస్సోరి, డార్జిలింగ్ వంటి హిల్ స్టేషన్లు, ప్రపంచములోనే అత్యంత అందమైన కశ్మీర్ లోయ, హిమాలయాల్లోనే ఉన్నాయి. మన పుణ్యక్షేత్రాలు బదరీనాథ్, కేదార్‌నాథ్, అమర్‌నాథ్ వంటివి అక్కడే ఉన్నాయి. మనకు ఆపిల్ తోటలు, న్యూస్‌ప్రింట్ కాగితం, ఆయుర్వేదానికి కావాల్సిన విలువైన మూలికలు వంటి వాటికి హిమాలయాలే పుట్టిల్లు. అంతేనా... సైబీరియా నుంచి వచ్చే శీతల గాలుల నుండి దేశాన్ని రక్షిస్తున్నదీ, ఈశాన్య ఋతు పవనాలకు సహకరించేదీ హిమాలయాలే. ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద వ్యాసమే అవుతుంది.

అలాగే హిమాలయాల గురించి భూగర్భ శాస్త్రవేత్తలు చెపుతున్న విషయాలలో రెండు ముక్కలు ప్రస్తావించుకుందాము. హిమాలయాలు ప్రపంచంలోనే అతి పిన్న ముడుత పర్వతాలు. దక్షిణ భారతంలో గ్రానైట్ రాళ్ళు అతి కఠినమైనవీ, పురాతనమైనవీ. టెక్టానిక్ ఫోర్సెస్ (భూ అంతర్గత ఒత్తిడుల) వల్ల భారత ఉప ఖండ పలక, అతిపెద్దదైన యురేషియన్ పలక వైపు జరిగే నేపథ్యంలో ఏర్పడుతున్న ముడుత పర్వతాలే హిమాలయాలు. ఇప్పటికీ ఈ నిర్మాణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. అంతే కాకుండా ఇవి భూకంప జోన్‌లో ఉన్నాయి. మరి ఇంత సున్నిత పర్వతాలలో, జలవిద్యుత్ కేంద్రాలు, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, రోడ్ల వెడల్పు చేయటం ఎంతవరకు మన దేశానికి శ్రేయస్కరం? దీనికితోడు ప్రపంచ వ్యాప్తమైన పర్యావరణ విధ్వంసం, మరి జోషీమఠ్, నైనిటాల్ వంటి చోట్ల భూమిలో పగుళ్లు, ఇళ్లలో బీటలు, హఠాత్తుగా వస్తున్న వరదలు ఊహించదగినవే. అందమైన, సున్నితమైన హిమాలయాలను అంతే సున్నితంగా నియంత్రణతో వాడుకోవటం దేశానికి ఎంతో శ్రేయస్కరం. హిమాలయాల వెంబడి ఉన్న రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి, ఉత్తర్వులు ఇవ్వాలి. అందమైన, విలువైన హిమాలయ ప్రాంతాన్ని, అంతే అందంగా, సున్నితంగా వాడుకుందాం. ప్రపంచం మేలు కొరకు, వీలైతే చైనాకు కూడా చెపుదాం.

– మరింగంటి శ్రీరామ, రిటైర్డ్ చీఫ్ జీఎం, సింగరేణి

బీసీ స్టడీ సర్కిల్ గ్రూప్-2 కోచింగ్ దరఖాస్తు గడువు 25వరకు పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 ఉచిత శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అలోక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సిటీ కాలేజీలోని బీసీ స్టడీ సెంటర్‌లో 200 మందికి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040-27077929, 7780359322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



ఉపాధ్యాయురాలిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు





పోలీసులు తల్లిదండ్రులను అరెస్టు చేస్తుండటంతో రోదిస్తున్న చిన్నారులు

మమ్మల్ని కలపండి సారూ..

- స్పౌజ్ బదిలీల కోసం పిల్లలతో సహా ఉపాధ్యాయ దంపతుల ఆందోళన
- డీఎస్సీ కార్యాలయం ముందు మౌన దీక్ష..
- నలుమూలల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయ కుటుంబాలు
- 513మంది ఉపాధ్యాయుల అరెస్టు
- ఆ సందర్భంలో పిల్లలు, మహిళల రోదనలతో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం

సాక్షి, హైదరాబాద్, ఖైరతాబాద్: తమ పిల్లలతో సహా ఉపాధ్యాయ దంపతుల ఆందోళన, దీక్ష.. ప్రతిగా పోలీసుల అరెస్టులు.. తల్లిదండ్రులను ఎక్కడికి తీసుకువెళ్తున్నారో.. ఏం జరుగుతోందో తెలియక చిన్నారుల రోదనలు.. వెరసి శనివారం హైదరాబాద్‌లో స్పౌజ్ ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దంపతులు నిర్వహించిన ధర్నాలో ఉద్విగ్న వాతావరణం చోటుచేసుకుంది. 13 జిల్లాలకు చెందిన వందలాది మంది ఉపాధ్యాయ దంపతులు తమ పిల్లలతో కలిసి వచ్చి బదిలీలకు సంబంధించిన జీవో 317కి వ్యతిరేకంగా పాఠశాల డైరెక్టర్(డీఎస్సీ) కార్యాలయం ముందు మౌన దీక్ష నిర్వహించారు. 'ఉద్యోగ దంపతుల్ని కలపండి... ముఖ్యమంత్రి మాటను నిలపండి'... 'భార్యా భర్తలను, పిల్లలను విడదీయకండి'... 'అమ్మ అటు ... నాన్న ఇటు.. మరి నేను ఎవరివైపు???' అంటూ ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శించారు. భార్య ఒక చోట, భర్త ఒక చోట ఉద్యోగం చేసే పరిస్థితికి స్వస్తి చెప్పి, ఒకే దగ్గర కలిసి ఉండేలా స్పౌజ్ బదిలీలు నిర్వహించాలని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన సంవత్సరంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రతి స్పౌస్ బాధితుడికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

615 మందికే స్పౌజ్ బదిలీ!

దంపతుల బదిలీలను బ్లాక్ చేసిన 13 జిల్లాల్లో 2100 మంది బాధితులు ఉండగా, అందులో 615 మందికి మాత్రమే స్పౌజ్ బదిలీలు జరుగుతున్నాయని నిరసన దీక్ష సందర్భంగా ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. 30 శాతం మందికే దంపతుల బదిలీలు చేపట్టి, పూర్తిగా అవకాశం ఉన్న క్యాడర్లను పక్కకు పెట్టడంతో స్పౌజ్ బదిలీల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలలో ఆవేదన మిగిలిందని వాపోయారు.

రసాభాసగా మౌనదీక్ష

ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో పరిస్థితి రసాభాసగా మారింది. తల్లిదండ్రులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తుండటంతో పిల్లలకు అక్కడ ఏం జరుగుతోందో తెలియక విలపిస్తూ ఉండిపోయారు. దీంతో తల్లులు ఒక్కసారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. తల్లుల, పిల్లల రోదనలతో కొద్దిసేపు ఉద్విగ్న వాతావరణం నెలకొంది. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 513మంది టీచర్లను అరెస్టు చేసి నాంపల్లి, చిక్కడపల్లి, గాంధీనగర్, ముషీరాబాద్, బేగం బజార్, నారాయణగూడ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాగా, నిరసన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని నేతలు వివేక్, ఖాదర్, కృష్ణ, నరేష్, మమత, త్రివేణి, సుజాత స్పష్టం చేశారు. అరెస్టులను తెలంగాణ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అందరికీ ఇచ్చే అవకాశం ఉన్నా..

సంగారెడ్డి జిల్లాలో ఎస్జీటీ కేడర్ లో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే స్పౌజ్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ జిల్లాలో 362 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే సూర్యాపేటలో 252 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉంటే... 28 మంది ఎస్జీటీలు మాత్రమే బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో కూడా 40 మంది ఎస్జీటీ దంపతులు బదిలీల కోసం అర్జీ పెట్టుకోగా, 341 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించనున్న ప్రమోషన్ల ప్రక్రియ ద్వారా కూడా వందల సంఖ్యలో ఖాళీలు ఏర్పడనున్నాయి. ఒకటి రెండు క్యాడర్ల మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ స్పౌజ్ అప్పీళ్ళు అన్నిటినీ క్లియర్ చేసే అవకాశం ఉందని ఉపాధ్యాయుల వాదన. సీఎం కేసీఆర్ వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు.

ముగిసిన వానాకాలం ధాన్యం కొనుగోళ్లు

- 7,024 కొనుగోలు కేంద్రాల ద్వారా 64.30 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- ఆలస్యంగా నాట్లేసిన రైతులు ధాన్యం అమ్ముకోవడానికి 24 వరకూ చాన్స్
- కొనుగోళ్లపై మంత్రి గంగుల సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం ధాన్యం సేకరణ పూర్తయిందని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా, రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే ధాన్యాన్ని సేకరించి రైస్‌మిల్లులకు తరలించిందన్నారు. ఆలస్యంగా వరి నాట్లేయడం వల్ల ఎక్కడైనా రైతుల వద్ద ధాన్యం మిగిలి ఉంటే ఈ నెల 24 వరకూ సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. శనివారం ఇక్కడ మంత్రి గంగుల ఆ శాఖ అధికారులతో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న వ్యవసాయ అనుకూల విధానాలతో ధాన్యం దిగుబడి ఏయేటికాయేడు పెరుగుతోందన్నారు. ఈసారి రికార్డుస్థాయిలో 64.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు చెప్పారు. అక్టోబర్ 21 నుంచి మొదలైన వానాకాలం పంట సేకరణ మూడునెలలకు పైగా నిరంతరాయంగా సాగిందని తెలిపారు. మారుమూల ప్రాంతాల రైతులకు అందుబాటులోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో 7,024 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.13,570 కోట్ల విలువైన 64.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 9.76 లక్షలమంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతుల్లో ఓపీఎంఎస్‌లో నమోదైన రైతులకు రూ.12,700 కోట్లు చెల్లించామని చెప్పారు.

పంజాబ్ తరువాత తెలంగాణనే...

దేశంలో పంజాబ్ తరువాత తెలంగాణ నుంచే అత్యధిక ధాన్యం సేకరణ జరుగుతోందని మంత్రి గంగుల తెలిపారు. రాష్ట్రంలో 2014–15లో 11.04 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న వానాకాలం ధాన్యం సేకరణ గతేడాది 70.44 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందన్నారు. ఈ ఏడు బహిరంగ మార్కెట్లలో అత్యధిక ధర లభించడంతో రైతులు లాభసాటిగా ప్రైవేటుగా ధాన్యం విక్రయించుకోవడం సంతోషకర పరిణామమని అన్నారు. ఈ సీజన్‌లో అత్యధికంగా నిజామాబాద్‌లో 5.86 లక్షల మెట్రిక్ టన్నులు, కామారెడ్డిలో 4.75, నల్లగొండలో 4.13, మెదక్‌లో 3.95, జగిత్యాలలో 3.79 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించగా, అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 2,264 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వివరించారు. కాగా, ఈ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ ప్రక్రియను సైతం వేగంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, జాయింట్ కమిషనర్ ఉషారాణి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జీఎం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతులపై పీఆర్‌టీయూటీఎస్ హర్షం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై ఉన్న నిషేధాన్ని తొలగించడంపై పీఆర్‌టీయూటీఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయురాలు

రాయపర్తి: అటెండెన్స్ విషయంలో కోపంతో ఓ ఉపాధ్యాయురాలు ఇద్దరు విద్యార్థులను చితకబాదారు. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. దీంతో గ్రామస్తులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అంబటి దేవకి శుక్రవారం ఎనిమిదో తరగతి చదువుతున్న హపావత్ వైష్ణవి, బాలకృష్ణలను తీవ్రంగా చితకబాదారు. తోటి టీచర్లు అక్కడికి చేరుకొని గాయాలపాలైన విద్యార్థులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఇదేంటని ప్రశ్నించిన తోటి టీచర్లను సైతం దేవకి పరుష పదజాలంతో దూషించారు. ఇంటికి వెళ్లిన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు విషయం తెలపడంతో శనివారం పాఠశాల వద్ద ఆందోళన చేశారు. తమ పిల్లలను ఎందుకు కొట్టారని టీచర్‌ను నిలదీశారు. దీనిపై దేవకిని వివరణ కోరగా అటెండెన్స్ తీసుకునే సమయంలో వైష్ణవి పేరు పిలవగా విద్యార్థిని తరగతి గదిలో ఉన్నా ఆబ్సెంట్ అని బాలకృష్ణ చెప్పాడని, దీంతో క్రమశిక్షణ కింద దండించానని తెలిపారు. 'పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులు కొడితే ఒప్పు.. టీచర్‌గా తాను కొడితే తప్పా' అని ప్రశ్నించారు.

స్మితా సబర్వాల్ ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు

- అర్ధరాత్రి వేళ ప్లెజెంట్ వ్యాలీలో కలకలం
- నిందితుల్లో ఒకరు డిప్యూటీ తహసీల్దార్

సాక్షి, హైదరాబాద్: యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్‌లోని ప్లెజెంట్ వ్యాలీలో నివాసం ఉంటున్న ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ నివాసంలోకి అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆనంద్‌కుమార్‌రెడ్డి (45) అనే వ్యక్తి తన స్నేహితుడు దుర్గా విలాస్‌హోటల్ యజమాని బాబుతో కలిసి కారులో గురువారం అర్ధరాత్రి 11గంటల ప్రాంతంలో పోలీస్ లైన్స్‌లోని ప్లెజెంట్ వ్యాలీలో ఐఏఎస్ క్వార్టర్స్ వద్దకు వచ్చాడు. తనకు అపాయింట్‌మెంట్ ఉందంటూ అక్కడి భద్రతా సిబ్బందిని నమ్మించి ఆనంద్‌కుమార్‌రెడ్డి లోనికి ప్రవేశించి స్మితా సబర్వాల్ ఇంటివద్దకు వెళ్లాడు. అక్కడ భద్రత లేకపోవడంతో ప్రధాన ద్వారం గుండా ఇంట్లోకి వెళ్లాడు. అలికిడికి బయటకు వచ్చిన స్మితా సబర్వాల్ గుర్తుతెలియని వ్యక్తి కనిపించడంతో ఆందోళనకు గురై అతడిని బయటకు వెళ్లిపోవాల్సిందిగా కేకలు పెట్టారు. దాంతో ఆనంద్‌కుమార్ బయటకు వెళ్లిపోయాడు. తన అనుమతి లేకుండా గుర్తుతెలియని వ్యక్తిని లోనికి ఎవరు పంపారంటూ సెక్యూరిటీ సిబ్బందిని ప్రశ్నించడంతో అప్రమత్తమైన సిబ్బంది బయటకు వస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడకు చేరుకున్న పోలీసులు నిందితుడు ఆనంద్‌కుమార్‌తో పాటు అతడి వెంటవచ్చిన బాబును అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. కాగా, తనకు కొన్ని సమస్యలున్నాయని, వాటిని స్మితా సబర్వాల్ దృష్టికి తీసుకెళ్లాలనుకున్నానని ఆనంద్‌కుమార్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా...

న్యూజిలాండ్ నూతన ప్రధానిగా క్రిస్ హిప్కిన్స్



అక్లాండ్: క్రిస్ హిప్కిన్స్(44) న్యూజిలాండ్ నూతన ప్రధాన మంత్రి కానున్నారు. ప్రధాని జెసిండా ఆర్డెర్న్ గురువారం అనూహ్యంగా రాజీనామా ప్రకటన చేయడం తెలిసిందే. ఆ పదవికి అధికార లేబర్ పార్టీ నుంచి ఎంపీ హిప్కిన్స్ ఒక్కరే నామినేషన్ వేశారు. ఆదివారం ప్రతినిధుల సభ సమావేశంలో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధికారికంగా ప్రకటించనుంది. తర్వాత ఆయన బాధ్యతలు చేపడతారు. 2008లో తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికైన ఆయన 2020లో కోవిడ్–19 మంత్రిగా నియమితులయ్యారు. ఈ ఏడాది చివర్లో న్యూజిలాండ్‌లో ఎన్నికలున్నాయి. లేబర్ పార్టీకి గెలుపు కష్టమేనని విశ్లేషకులు అంటున్నారు.

జోషీమఠ్‌లో మళ్లీ కూల్చివేతలు


డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో మంచు, వర్షం కారణంగా నిలిచిపోయిన భవనాల కూల్చివేత పనులు శనివారం నుంచి మళ్లీ మొదలయ్యాయి. భూమి కుంగిపోవడంతో జోషీమఠ్‌లో 849 ఇళ్లకు పగుళ్లు రావడం తెలిసిందే. 289 కుటుంబాలను తాత్కాలిక సహాయ కేంద్రాలకు తరలించామన్నారు. వీరికి హీటర్లు, ఉలెన్ దుస్తులు, వేడి నీరు, ఆహారప దార్థాల కిట్లు అందజేశామన్నారు.

కేంద్రంపై కాంగ్రెస్ చార్జ్‌షీట్



న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను విమర్శిస్తూ కాంగ్రెస్ శనివారం చార్జ్‌షీట్ విడుదలచేసింది. బీజేపీ తప్పుడు హామీలు గుప్పిస్తోందని ఆరోపించింది. బీజేపీ అంటే భ్రష్ట జుమ్లా పార్టీ అంటూ కొత్త భాష్యం చెప్పింది. ''మోదీ ప్రభుత్వం సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ అంటూ ఎప్పుడూ నినదిస్తుంది. కానీ నిజానికది కుచ్ కా సాథ్, కుచ్ కా వికాస్, సబ్‌కే సాథ్ విశ్వాస్‌ఘాత్ (కొద్ది మందికే లబ్ధి, మిగతా అందరికీ మోసం)'' అంటూ మండిపడింది. కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' లోగోను పార్టీ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ శనివారం ఆవిష్కరించారు. మోదీ సర్కారుపై చార్జ్‌షీట్‌ను, రాహుల్ సందేశ లేఖను ఇంటింటికీ తీసుకెళ్లే ఈ కార్యక్రమం జనవరి 26న మొదలవుతుందని చెప్పారు.

తారలు తెర'మరుగు'



బెంగళూరు: మబ్బుల్లేని రాత్రి వేళ అలా ఆకాశంలోకి చూసినప్పుడు లెక్కలేనన్ని నక్షత్రాలు తళుకుమంటూ కనువిందు చేస్తుంటే ఎంతో బావుంటుంది కదా! కానీ వినువీధిలో తారల తళుకులు నానాటికీ తగ్గిపోతున్నాయి. 2011తో పోలిస్తే 2022 నాటికి అబ్జర్వేటరీల కెమెరా కంటికి కన్పిస్తున్న నక్షత్రాల సంఖ్య ఏకంగా 10 శాతం తగ్గిందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది! అయితే, దీనికి కారణం నక్షత్రాలు నశించిపోవడం కాదు. భూమిపై కృత్రిమ వెలుగులు మితిమీరి పెరిగిపోవడం! మరోలా చెప్పాలంటే కాంతి కాలుష్యమన్నమాట!! దాంతో కాస్త తక్కువ ప్రకాశంతో కూడిన నక్షత్రాలన్నీ సదరు కృత్రిమ వెలుగు మాటున మరుగున పడిపోతున్నాయట! ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితని యూనివర్సిటీ ఆఫ్ శాంటియాగో డీ కాంపొస్టెలా భౌతిక శాస్త్రవేత్త ఫాబియో ఫాల్చీ ఆవేదన వెలిబుచ్చారు. ''కాంతి కాలుష్యం ఏటా 7 నుంచి 10 శాతం చొప్పున పెరిగిపోతోంది! ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. దీనికి తక్షణం అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది'' అని ఆయనన్నారు. ''ఒకప్పట్లా చిక్కటి చీకటితో నిండిన రాత్రుళ్లు ఎప్పటికీ తిరిగిరావు. ముఖ్యంగా నగరాల్లోనైతే రాత్రిపూట వెలుగులు అనివార్యంగా మారి దశాబ్దాలు దాటింది. కానీ పరిస్థితి పూర్తిగా చేయి దాటకుండా చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆకాశంలో కేవలం వేళ్లపై లెక్కబెట్టగలిగినంతకు మించి చుక్కలు కన్పించని రోజు ఎంతో దూరంలో లేదు'' అంటూ హెచ్చరించారు.

వైరస్‌కు ప్రతి సృష్టి!

లండన్: మానవ చరిత్రలో తొలిసారిగా వైరస్‌కు కంప్యూటర్ సాయంతో యథాతథంగా ప్రతి సృష్టి చేశారు! గతంలోనూ ఇలాంటివి జరిగినా జీవపరంగా, 3డి నిర్మాణపరంగా, జన్యుపరంగా ఓ వైరస్‌ను అచ్చుగుద్దినట్టుగా పునర్నిర్మించడం ఇదే తొలిసారట! బ్రిటన్లోని ఆస్టన్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డ్మిత్రీ నెరుక్ ఈ ఘనత సాధించారు! అత్యాధునిక సూపర్ కంప్యూటర్లు వాడినా కూడా ఈ పరిశోధనకు ఏకంగా మూడేళ్లు పట్టిందట! ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైరస్ నిర్మాణాలను క్రయో ఎలక్ట్రాన్ మైక్రోస్కొపీ, కంప్యుటేషనల్ మోడలింగ్ సాయంతో పరిశీలించారు. ''ఇంతకాలం పాటు వైరస్‌ల పూర్తి జన్యు నిర్మాణక్రమం అందుబాటులో లేని కారణంగా వాటి తాలూకు జీవక్రియలపై మనకు సంపూర్ణ అవగాహన లేదు. తాజా అధ్యయనం ఈ విషయంలో దారి చూపగలదు'' అని సైంటిస్టులు చెబుతున్నారు. ''అంతేగాక ఈ పరిశోధన వల్ల యాంటీబయాటిక్స్‌కు మెరుగైన, సమర్థమైన ప్రత్యామ్నాయాల దిశగా కొత్త దారి దొరుకుతుంది. యాంటీబయాటిక్స్‌కు లొంగని మొండి బ్యాక్టీరియా సమస్యకూ పరిష్కారం లభిస్తుంది'' అని వారంటున్నారు. ఈ అధ్యయనం ఫారడే డిస్కషన్స్ జర్నల్‌లో పబ్లిషైంది.

పెన్షన్.. టెన్షన్

ఆందోళనలతో అట్టుడికిన ఫ్రాన్స్ • రిటైర్‌మెంట్ వయసు 62 నుంచి 64కు పెంచడంపై వ్యతిరేకత
పెన్షన్ సంస్కరణలకి వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసన ప్రదర్శన



పారిస్‌లో వేలాది మంది కార్మికుల నిరసన ర్యాలీ

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ పెన్షన్ సంస్కరణలు దేశ చరిత్రలో అతి పెద్ద నిరసన ప్రదర్శనకు దారి తీశాయి. పదవీ విరమణ వయసుని 62 నుంచి 64కి పెంచుతూ ప్రతిపాదనలు చేసినందుకే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పెన్షన్ అందుకోవడానికి మరో రెండేళ్లు పని చేయాలా అంటూ ప్రజలు ఆందోళన బాట పట్టారు. రైళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. పాఠశాలలు తెరుచుకోలేదు. కార్యాలయాలు మూతబడ్డాయి. ఈఫిల్ టవర్‌ను మూసేశారు. పారిస్ సహా పలు నగరాల్లో 10 లక్షల మందికిపైగా నిరసనకారులు వీధుల్లోకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. 12 ట్రేడ్ యూనియన్లు, లెఫ్ట్ పార్టీలు, ఫార్ రైట్ పార్టీలు కలసికట్టుగా ఈ ఆందోళనల్లో పాల్గొనడం విశేషం. దేశంలో 68% ప్రజలు ఈ పెన్షన్ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్టుగా సర్వేలు చెబుతున్నాయి. రైట్ పార్టీల మద్దతుతో అధికారంలో ఉన్న సంకీర్ణ సర్కార్ వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే పెన్షన్ సంస్కరణల బిల్లుకు ఎంతవరకు మద్దతు లభిస్తుందన్న అనుమానాలున్నాయి.

రిటైర్మెంట్ వయసు పెంపు ఎందుకు?

ప్రపంచమంతటా సగటు ఆయుఃప్రమాణం పెరుగుతోంది. జననాల రేటు తగ్గిపోతోంది. దీంతో వయసు మీద పడినా కష్టపడి పని చేయాల్సి వస్తోంది. అయితే రిటైర్మెంట్ వయసు యూరప్‌లోకెల్లా ఫ్రాన్స్‌లోనే తక్కువ. స్పెయిన్‌లో 65, యూకేలో 67, జర్మనీలో 67 ఏళ్లుగా ఉంది. జర్మనీ కూడా రిటైర్మెంట్ వయసును 70 ఏళ్లకు పెంచే యోచనలో ఉంది. ఫ్రాన్స్ కూడా పెన్షన్ నిధుల్ని పెంచుకోవడానికే ఈ సంస్కరణలను తీసుకొచ్చింది. రెండేళ్ల రిటైర్‌మెంట్ వయసు పెంపుతో ఏడాదికి 1,770 కోట్ల యూరోలు జమ అవుతాయి. 2027 నాటికి బ్రేక్ ఈవెన్ సాధ్యపడుతుంది.

ఎందుకీ వ్యతిరేకత?

హాయిగా ఇంటి పట్టున ఉండి పెన్షన్ అందుకుందామని అనుకున్న వారు మరో రెండేళ్లు పనిచేయడానికి సుముఖంగా లేరు. ఇంకా పని చేస్తే రిటైరవక ముందే ఆరోగ్యం పూర్తిగా పాడవుతుందని రైల్వే వర్కర్లు, మహిళలు, నైట్‌షిఫ్ట్‌ల్లో ఉండేవారు ఆందోళనగా ఉన్నారు. కనీసం 43 ఏళ్లు పని చేయాలన్న నిబంధనపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆలస్యంగా మొదలు పెట్టే మహిళలు, ఉన్నత విద్య చదివే వారు 67 ఏళ్ల దాకా పని చేయాల్సి వస్తుంది. మరోవైపు నిరుద్యోగులు కూడా తమకు ఉద్యోగాలు లేటవుతాయంటూ ఆందోళనల్లో పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌లో కనీస పెన్షన్ పెరుగుతున్న ధరలకి అనుగుణంగా లేదు. కరోనా, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ధరాభారం పెరిగింది. ఫ్రాన్స్‌లో పెన్షన్ సంస్కరణలపై నిరసనలు ఇదేం మొదటిసారి కాదు. 2010లో రిటైర్‌మెంట్ వయసుని 60 నుంచి 62 ఏళ్లకు పెంచినప్పుడు కూడా ఇదే స్థాయి వ్యతిరేకత ఎదురైంది. ఫ్రాన్స్ అధ్యక్షుడయ్యాక మాక్రాన్ ఈ సంస్కరణలు తేవాలని గట్టిగా అనుకున్నారు. 2019లో ఈ ప్రతిపాదిత సంస్కరణలకి వ్యతిరేకంగా సమ్మె జరిగినా కరోనా సంక్షోభంతో సమ్మెని ఆపేశారు. పెన్షన్ నిధి పెంచుకోవాలంటే సంపన్నులకి పన్నులు పెంచాలని, పెన్షన్ పథకంలో యాజమాన్యాల వాటాను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పెన్షన్ పథకంలో సంస్కరణలివే

- రిటైర్మెంట్ వయసును ఏడాదికి మూడు నెలల చొప్పున పెంచుతూ 2030 నాటికి 64 ఏళ్లకు పెంచడం.
- 2027 తర్వాత చేరే ఉద్యోగులెవరైనా పూర్తి పెన్షన్ కోసం కనీసం 43 ఏళ్లు పని చేయాలి.
- పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రిటైరయ్యే నాటికి 43 ఏళ్ల సర్వీసు లేకపోతే 67 ఏళ్లు వచ్చేదాకా పని చేస్తేనే పెన్షన్ లభిస్తుంది.
- పూర్తి కాలం ఉద్యోగం చేసిన అల్పాదాయ వర్గాలకు 85% పెంపుతో పెన్షన్ 1200 యూరోలు అవుతుంది. 20 లక్షల మంది చిన్న ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుంది.

''నేను ఒక కాస్మటిక్ కంపెనీలో పనిచేస్తున్నాను. మా కార్యాలయంలో పని చేసే పరిస్థితుల్లేవు. మరో రెండేళ్లు పనిచేయాలంటే నా వల్ల కానేకాదు. ఈ పెన్షన్ బిల్లు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు''
– వర్జీనియా, మహిళా ఉద్యోగి

''నేను రైల్వేల్లో పనిచేస్తాను. శారీరక శ్రమ చేయాలి. చేతులు, కాళ్లు విరగ్గొట్టుకుంటూ పని చేస్తున్నాను. ఈ పరిస్థితుల్లో ఎన్నేళ్లు వచ్చే వరకు పని చెయ్యగలను. కనీసం 43 ఏళ్ల సర్వీసు ఉంటేనే పెన్షన్ వస్తుందనడం చాలా అన్యాయం''
– రైల్వే కార్మికుడు

ఇక వృద్ధులు భారమేనా..?

- ప్రపంచ దేశాలు పెన్షన్లను ఖరీదైన వ్యవహారంగా పరిగణిస్తున్నాయి. అమెరికాలో 50 ఏళ్ల క్రితం ప్రతీ 10 మందిలో 8 మందికి డిఫైన్డ్ బెనిఫిట్ పథకాలు వర్తిస్తే ఇప్పుడు ప్రతీ 10 మందిలో ఒక్కరికే వర్తిస్తోంది.
- ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే మొత్తం వృద్ధులలో దాదాపు మూడో వంతు మందికి పెన్షన్‌పై భరోసా లేదు. కొందరికి పెన్షన్ వస్తున్నా అది వారి కనీస అవసరాలకి ఏ మూలకూ సరిపోవడం లేదు.
- వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలు ఆర్థికంగా అండదండగా ఉంటారన్న నమ్మకం లేదు. ఎందుకంటే పిల్లల సంఖ్య కూడా ప్రపంచమంతటా క్రమక్రమంగా తగ్గిపోతోంది. కుటుంబంలో పిల్లల సంఖ్య సగటున 1.73 పడిపోయింది.
- 1960వ దశకంలో ప్రపంచ జనాభాలో ఒక వృద్ధునికి సగటున 12 మంది పని చేసే శ్రామికుల చొప్పున ఉండేవారు. కానీ ప్రస్తుతం అలా పని చేసేవారి సంఖ్య ఏకంగా ఎనిమిదికి పడిపోయింది! 2050 నాటికల్లా ఈ సంఖ్య మరీ తక్కువగా 4కు పడిపోతుందని అంచనా. దీంతో పని చేయలేని వృద్ధులను ప్రభుత్వాలు భారంగా చూసే రోజులొస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారతీయ భాషల్లోకి తీర్పుల కాపీలు: సీజేఐ

ముంబై: కోర్టు తీర్పులను అన్ని భారతీయ భాషల్లోకి అందుబాటులోకి తెచ్చేందుకు కృత్రిమ మేథ(ఏఐ)ను వినియోగించుకుంటామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. సమాచార అంతరాలను తొలగించడంలో సాంకేతికత చాలా కీలకమైందని ఆయన అన్నారు. ఇంగ్లిష్‌లో ఉండే కొన్ని చక్కని అంశాలు గ్రామీణ ప్రాంతాల లాయర్లు ఆకళింపు చేసుకోలేరు. లాయర్లందరికీ ఉచితంగా సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నదే నా ఉద్దేశం. ఇందుకోసం తీర్పుల ప్రతులను ఏఐను వినియోగించుకుని అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయిస్తాం'అని చెప్పారు. శనివారం బార్ కౌన్సిల్ ఆఫ్ మహారాష్ట్ర, గోవా నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. విచారణల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా లా విద్యార్థులు, టీచర్లు కోర్టుల కార్యకలాపాలను ప్రత్యక్షంగా తెలుసుకునే వీలుంటుందన్నారు. తద్వారా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను గుర్తించగలుగుతారని చెప్పారు.



చంద్రునిపై కాలుపెట్టిన ఆల్డ్రిన్‌కు...
93వ ఏట నాలుగో పెళ్లి



లాస్ ఏంజెలెస్: చంద్రునిపై కాలు పెట్టిన రెండో వ్యక్తిగా చరిత్రకెక్కిన అమెరికా వ్యోమగామి బజ్ ఆల్డ్రిన్ లేటు వయసులో మళ్లీ ఓ ఇంటివాడయ్యారు! శుక్రవారం 93వ పుట్టినరోజు నాడే తన చిరకాల ప్రేయసి అయిన 63 ఏళ్ల డాక్టర్ అంకా ఫార్‌ను పెళ్లాడారు. లాస్ ఏంజెలెస్‌లో నిరాడంబరంగా తామిద్దరం వైవాహిక బంధంతో ఒక్కటయ్యామంటూ ట్వీట్ చేశారు. తామిప్పుడు లేచిపోయి పెళ్లి చేసుకున్న టీనేజర్లలా ఎక్సైటింగ్‌గా ఫీలవుతున్నామంటూ చిలిపిదనం చిందించారు! రెండు పెళ్లి ఫొటోలను షేర్ చేశారు. వాటిలో ఆయన చూడచక్కని సూట్ ధరించి మురిసిపోతూ కన్పిస్తున్నారు. దానిపై మెడల్, ఎయిర్‌ఫోర్స్ బ్యాడ్జ్ కూడా ధరించారు. గతంలో మూడుసార్లు విడాకులు తీసుకున్న ఆల్డ్రిన్‌కు ఇది నాలుగో పెళ్లి! ఆయనకు ముగ్గురు పిల్లలు, ఒక మనవడు, ముగ్గురు ముని మనవలతో పాటు ఒక ముని ముని మనవరాలు కూడా ఉన్నారు! నాసా అపోలో–11 మిషన్లో భాగస్వాములైన ముగ్గురు వ్యోమగాముల్లో 1969 జూలై 20న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై కాలుపెట్టి చరిత్ర సృష్టించడం తెలిసిందే. కాసేపటికి ఆల్డ్రిన్, ఆయన తర్వాత మైకేల్ కొలిన్స్ చంద్రునిపై దిగారు. వారిలో ఇప్పటికీ జీవించి ఉన్నది కూడా ఆల్డ్రినే. ఆయన 1971లో నాసా నుంచి రిటైరయ్యారు. తర్వాత షేర్‌స్పేస్ వెంచర్స్ స్థాపించారు. అంకా అందులో 2019 నుంచి పని చేస్తున్నారు.

నేతాజీ, ఆరెస్సెస్ భిన్నధ్రువాలు: అనితా బోస్



కోల్‌కతా: భావజాలపరంగా నేతాజీ సుభాష్ చంద్ర బోస్, ఆరెస్సెస్ భిన్న ధ్రువాలని నేతాజీ కూతురు అనితా బోస్ పిఫాఫ్ అన్నారు. జనవరి 23న నేతాజీ జయంతిని ఆరెస్సెస్ ఘనంగా జరిపేందుకు ఆరెస్సెస్ ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. దాని వెనక కూడా బీజేపీ, ఆరెస్సెస్ స్వప్రయోజనాలు నెరవేర్చుకునే ఉద్దేశం ఉండొచ్చని అనిత అభిప్రాయపడ్డారు. జర్మనీలో ఉంటున్న ఆమె పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడారు. ''ఆరెస్సెస్ భావజాలం గురించి నేను విన్నదాని ప్రకారం వారిది బహుశా నేతాజీ వారసత్వాన్ని సొంతం చేసుకోవాలన్న ప్రయత్నం అయ్యుండవచ్చు. కానీ నేతాజీ హిందూ అయినా అన్ని మతాలనూ గౌరవించారు. భిన్న మతాలను పాటించే వారు సామరస్యంగా జీవించాలని కోరుకున్నారు. ఈ ధోరణి బీజేపీ, ఆరెస్సెస్‌లో కన్పించదు. సింపుల్‌గా చెప్పాలంటే వాళ్లు రైటిస్టులైతే నేతాజీ లెఫ్టిస్టు. భావజాలపరంగా నేతాజీకి, కాంగ్రెస్‌కు మధ్య చాలా సారూప్యత ఉంటుంది'' అన్నారు. అయితే నేతాజీని గౌరవించుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలు అభినందనీయమన్నారు. నేతాజీ 1945లో విమాన ప్రమాదంలోనే మరణించారని కాంగ్రెస్ హయాంలో వేసిన రెండు కమిషన్లు తేల్చగా అది అవాస్తవమని బీజేపీ హయాంలో వేసిన ముఖర్జీ కమిషన్ పేర్కొంది.

జోడో యాత్ర వేళ జమ్మూలో పేలుళ్లు



జమ్మూ: జమ్మూ శివారులో శనివారం ఉదయం 15 నిమిషాల వ్యవధిలో జరిగిన జంట పేలుళ్లలో 9 మంది గాయపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర రెండు రోజుల్లో జమ్మూ చేరుకోనుండగా ఈ ఘటన జరిగింది! నర్వాల్ ప్రాంతంలో పాత సామాను దుకాణం వద్ద ఓ వాహనం, 50 మీటర్ల దూరంలోని రిపేర్ షాప్‌లో బొలెరో వాహనంలో ఐఈడీలే ఈ పేలుళ్లకు కారణమని పోలీసులు అంటున్నారు. సమీపంలో ఉన్నవారు పేలుళ్లలో గాయపడ్డారు. ఫోరెన్సిక్ నిపుణులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, స్నైపర్ డాగ్స్‌తో ఆధారాల కోసం అన్వేషణ ప్రారంభించారు.

మాస్కో–గోవా విమానానికి మళ్లీ బెదిరింపు

పణజి: రష్యా రాజధాని మాస్కో నుంచి గోవాకు వస్తున్న విమానానికి శనివారం వేకువజామున మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో విమానాన్ని ఉజ్బెకిస్తాన్ వైపు దారి మళ్లించారు. రష్యాకు చెందిన అజూర్ ఎయిర్ చార్టెర్డ్ విమానం 240 ప్రయాణికులు, ఏడుగురు సిబ్బందితో మాస్కో నుంచి బయలుదేరింది. వేకువజామున 4.15 గంటలకు గోవా చేరాల్సి ఉంది. అందులో బాంబు పెట్టినట్లు అర్ధరాత్రి 12.30 గంటలప్పుడు గోవా విమానాశ్రయం డైరెక్టర్‌కు మెయిల్ రావడంతో ఉజ్బెక్‌కు దారి మళ్లించారు. తనిఖీలు చేసి ప్రమాదకర వస్తువులు లేవని నిర్ధారించాక విమానం గోవా బయల్దేరింది. ఈ నెల 9న కూడా అజూర్ ఎయిర్‌కే చెందిన మాస్కో–గోవా విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో జామ్‌నగర్ ఎయిర్‌పోర్టులో దించేయడం తెలిసిందే.

బెంగళూరులో జి-20 తొలి భేటీ

న్యూఢిల్లీ: భారత్ అధ్యక్షతన జి–20 దేశాల తొలి పర్యావరణ సమావేశాలు ఫిబ్రవరి 9–11 తేదీల మధ్య బెంగళూరులో జరగనున్నాయి. జి–20 సభ్య దేశాలతోపాటు అతిథి దేశాలు, అంతర్జాతీయ సంస్థలు పాల్గొననున్నాయి. షేర్పా ట్రాక్ కింద 13 వర్కింగ్ గ్రూపులు ఏర్పాటయ్యాయి. సమావేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులు శనివారం చర్చించారు.

త్రిపుర ఎన్నికల నోటిఫికేషన్ జారీ

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 16వ తేదీన పోలింగ్ జరగనుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 30 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 2 తుది గడువు. 60 స్థానాలకు ఫిబ్రవరి 16న పోలింగ్, మార్చి 2న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి.

వేధింపులపై 'మలివాల్ వర్సెస్ బీజేపీ'

- ఆప్‌తో కలిసి పోలీసులపై బురదజల్లుతున్నారు
- ఎల్జీకి బీజేపీ ఫిర్యాదు, ఖండించిన మలివాల్



న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను మద్యం మత్తులో ఓ వ్యక్తి వేధించిన ఘటన రాజకీయ రంగు పులుముకుంటోంది. కేంద్రం అజమాయిషీలో ఉండే ఢిల్లీ పోలీసులు సత్వరం స్పందించలేదంటూ స్వాతి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. మహిళా కమిషన్ చీఫ్ హోదాలో కేసును ప్రభావితం చేస్తున్నారని ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ దుయ్యబట్టారు. ''ఢిల్లీలో మహిళలకు భద్రత లేదని చూపేందుకు, ఢిల్లీ పోలీసులను అసమర్థులుగా చిత్రీకరించేందుకు సీఎం కేజ్రీవాల్, ఆయన నియమించిన స్వాతి కుట్ర చేస్తున్నారు. వాస్తవానికి నిందితుడు హరీశ్ చంద్ర ఆప్ కార్యకర్త. ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్ తరఫున ప్రచారం చేశారు. అందుకే దర్యాప్తు నిష్పాక్షికంగా పూర్తయ్యేదాకా స్వాతిని పదవి నుంచి తప్పించాలి'' అంటూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు కపూర్ లేఖ రాశారు.

నన్ను భయటపెట్టలేరు: స్వాతి

బీజేపీ నేతల ఆరోపణలను స్వాతి ఖండించారు. ''నన్ను భయపెట్టలేరు. జీవితంలో ఎన్నో సవాళ్లను, దాడులను ఎదుర్కొన్నా. ఏనాడూ వెనక్కి తగ్గలేదు. ఇలాంటి ప్రతి ఘటనా నాలోని ఉద్యమాగ్నిని మరింతగా ఎగదోస్తుంది. మరింత బలంగా మారుస్తుంది. తుది శ్వాస దాకా పోరాడుతూనే ఉంటా'' అన్నారు. జనవరి 19న తెల్లవారుజామున ఢిల్లీ రోడ్లపై మహిళల భద్రతను పరిశీలిస్తున్న స్వాతిని ఒక తాగుబోతు కారెక్కాలంటూ వేధించడం తెలిసిందే. అతన్ని పట్టుకునే ప్రయత్నంలో ఆమె చేయి కారు డోర్, అద్దం మధ్య ఇరుక్కోవడం, నిందితుడు ఆమెను కొద్ది దూరం ఈడ్చుకెళ్లడం తెలిసిందే.

బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం

గోధ్రా అల్లర్లకు మోదీ బాధ్యుడనటంపై కేంద్రం ఆగ్రహం • యూట్యూబ్ వీడియోలు, ట్విట్టర్ పోస్టులు బ్లాక్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 2002లో గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాలంలో రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లకు మోదీనే కారణమంటూ బ్రిటన్‌కు చెందిన బీబీసీ వార్తాసంస్థ రూపొందించిన డాక్యుమెంటరీపై భారత సర్కార్ ఆంక్షల కొరడా ఝుళిపించింది. దేశంలోని పలు యూట్యూబ్ వీడియోలు, ట్విట్టర్ పోస్టుల ద్వారా షేర్ అవుతుండటాన్ని బ్లాక్ చేయాలని ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఆ వీడియోల లింక్‌లు ఉన్న 50 ట్వీట్లను తొలగించాలని ట్విట్టర్‌ను కేంద్ర సమాచార, ప్రసారశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ఆదేశించారు. 'గోధ్రా అల్లర్ల కేసులో మోదీకి క్లీన్‌చిట్ ఇస్తూ తీర్పు వెలువర్చిన సుప్రీంకోర్టు విశ్వసనీయతను ఈ డాక్యుమెంట్ ప్రశ్నిస్తోంది. సమాజంలోని వేర్వేరు వర్గాల మధ్య వైషమ్యాలను పెంచేలా దీనిని వండివార్చారు' అని విదేశాంగ, హోం, సమాచార, ప్రసార శాఖల్లోని ఉన్నతాధికారుల అభిప్రాయాల మేరకు డాక్యుమెంట్‌ను ప్రభుత్వం బ్లాక్ చేసిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి భంగం కలిగేలా, భారత్, బ్రిటన్ స్నేహసంబంధాలు దెబ్బతినేలా, దేశంలో మత సామరస్యానికి ముప్పు వాటిల్లేలా డాక్యుమెంట్‌ను రూపొందించారని ఆ ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. 'ప్రధానిపై ప్రయోగించిన దుష్ప్రచారాస్త్రం ఇది. భారత్ పట్ల బ్రిటన్ వలసవాద వైఖరి ఇంకా మారలేదని చెప్పేందుకు ఈ డాక్యుమెంట్ నిదర్శనం' అంటూ గురువారం భారత విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తంచేయడం తెల్సిందే.

అది దురుద్దేశపూర్వక చార్జ్‌షీట్

బీబీసీ డాక్యుమెంటరీపై మాజీ జడ్జీలు, ఉన్నతాధికారులుసహా 300 మందికిపైగా బ్యూరోక్రాట్లు మండిపడ్డారు. 'మోదీపై తప్పుడు ఉద్దేశంతో తయారుచేసిన అభియోగ పత్రమది. విభజించు – పాలించు విధానంతో భారతీయ హిందూ, ముస్లింలలో చిచ్చురేపిన బ్రిటన్ వైఖరికి ఇది చక్కని ఉదాహరణ' అని వారు వ్యాఖ్యానించారు. ఈ మేరకు రాజస్తాన్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ అనిల్ సింగ్, మాజీ 'రా' చీఫ్ సంజీవ్ త్రిపాఠి, మాజీ ఎన్ఐఏ డైరెక్టర్ యోగేశ్ చందర్, మాజీ హోం శాఖ కార్యదర్శి ఎల్‌సీ గోయల్, పలువురు మాజీ జడ్జీలు, దౌత్యవేత్తలుసహా 302 మంది సంతకాలతో ఒక సంయుక్త ప్రకటన వెలువడింది. మోదీదే బాధ్యత అంటూ అనాటి పోలీస్ అధికారులు ఆర్‌బీ శ్రీకుమార్, సంజీవ్ భట్, బీజేపీ నేత హరేన్ పాండ్యా చేసిన ఆరోపణలను సుప్రీంకోర్టు కొట్టేసిందని ప్రకటన గుర్తుచేసింది. వీరి పేర్లను బీబీసీ తన డాక్యుమెంట్‌లో పేర్కొనడం గమనార్హం.

నా ట్వీట్ తీసేశారు: డెరిక్ ఓబ్రియాన్

బీబీసీ డాక్యుమెంట్‌పై తాను చేసిన పోస్టును ట్విట్టర్ తొలగించేసిందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరిక్ ఓబ్రియాన్ చెప్పారు. 'భారతీయ చట్టాలను ఉల్లంఘించినందుకే తొలగించాం' అంటూ ట్విట్టర్ మెయిల్ చేసింది. ఈ చర్య సెన్సార్ విధించడమే' అని ఓబ్రియాన్ మరో ట్వీట్‌చేశారు.



నదుల గుండెకోతకు సజీవ సాక్ష్యమీ చిత్రం. బోస్నియా, సెర్బియా, మోంటెనిగ్రో దేశాల గుండా ప్రవహించే డ్రీనా నదిలోకి టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా కొట్టుకొచ్చాయి.

ఏడాది సెలవులు, ఇంట్లో ఆయాలు

జనాభాను పెంచేందుకు సిక్కింలో ప్రభుత్వోద్యోగినులకు వరాలు

గాంగ్‌టాక్: సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు సీఎం ప్రేమ్ సింగ్ తమంగ్ పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. వారి చిన్నారులకు ఇంటి వద్దే సహాయకులను ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిన్నారుల బాధ్యత తీసుకునే ఆయాలకు నెలకు రూ.10 వేలను ప్రభుత్వమే ఇస్తుందన్నారు. 40 ఏళ్లు, ఆపైన వయస్సుండే మహిళలకు చిన్నారులను ఏడాది వరకు చూసుకునే బాధ్యతలను అప్పగిస్తామన్నారు. మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవులను 365 రోజులకు, తండ్రులకైతే నెల రోజులు సెలవులు ఇస్తామని చెప్పారు. రెండో బిడ్డను పోషించేందుకు ఒక ఇంక్రిమెంట్, మూడో బిడ్డకైతే రెండు ఇంక్రిమెంట్లు ఇస్తామన్నారు. తరిగిపోతున్న జననాల రేటు చాలా ఆందోళన కలిగించే అంశమన్నారు. క్షీణిస్తున్న స్థానిక జాతుల జనాభాను పెంచేందుకు ప్రభుత్వం సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లులవ్వాలనుకునే ఉద్యోగినులు పుట్టబోయే తమ సంతానం బాగోగుల గురించి ఆందోళన చెందరాదనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. జననాల రేటు పెంచేందుకు సాధారణ ప్రజానీకానికి కూడా ప్రోత్సాహకాలు ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు. సంతానం కలగడంలో ఇబ్బందులు ఎదురయ్యే వారి కోసం ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో చికిత్స తీసుకునే వారికి రూ. 3 లక్షలు గ్రాంటుగా అందజేస్తామన్నారు. సిక్కింలోని 7 లక్షల లోపు జనాభాలో 80 శాతం మంది స్థానిక తెగల ప్రజలే. సంతానోత్పత్తి రేటు 1.1%గా ఉంది.

క్లుప్తంగా...

త్వరలో మరో మూడు వందేభారత్ రైళ్లు

దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు త్వరలో మరో మూడు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఈ రైలు ప్రారంభం కావడం తెలిసిందే. చైర్‌కార్ సదుపాయం ఉన్న ఈ రైలు ప్రారంభమైనప్పటి నుంచి.. అనూహ్య రీతిలో ప్రయాణికుల ఆదరణ చూరగొంటోంది. రోజూ వంద శాతం ఆక్యుపెన్సీతో వందేభారత్ పరుగులు తీస్తోంది. ఈ క్రమంలోనే కాచిగూడ-బెంగళూరు, సికింద్రాబాద్-తిరుపతి, సికింద్రాబాద్-పూనేల మధ్య త్వరలో మరో మూడు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేపట్టింది. రైళ్ల నిర్వహణ కోసం మెకానికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిచ్చేందుకు కార్యాచరణ మొదలైంది. వందేభారత్ రైళ్ల కోసం డిపోల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు.

ఆ ఫీజులు తక్షణమే తిరిగి ఇవ్వాలి

కేఎన్ఆర్‌హెచ్ వర్సిటీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఆర్ వైద్య కళాశాలలో అడ్మిషన్ల రద్దు తర్వాత సంబంధిత ఫీజులను వెంటనే తిరిగి ఇవ్వాలని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. టీఆర్ఆర్ కాలేజీలో అడ్మిషన్లు రద్దు చేసి ఇతర కాలేజీల్లో సర్దుబాటు చేసినప్పటికీ ఫీజులు తిరిగి ఇవ్వకపోవడంతో మరోమారు ఫీజులు చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు తిరిగి ఇవ్వాలని కోరుతూ వీసీకి తల్లిదండ్రులు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై వీసీ స్పందిస్తూ టీఆర్ఆర్ కళాశాలకు నోటీసులిస్తామని వివరించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

అల్యూమినియం బ్యాటరీలు అభివృద్ధి చేయనున్న ఐఐసీటీ

సాక్షి, హైదరాబాద్: లిథియం అయాన్ బ్యాటరీలకు ప్రత్యామ్నాయంగా రీచార్జబుల్ అల్యూమినియం బ్యాటరీలను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ప్రముఖ విద్యుత్ ఉపకరణాలు, బ్యాటరీల తయారీ సంస్థ ల్యూమినస్ పవర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో చేతులు కలిపింది. ఈ మేరకు ఇరు సంస్థలు అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ప్రత్యామ్నాయ బ్యాటరీల తయారీ కోసం ఐఐసీటీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థతో చేతులు కలపడం తమకు గర్వకారణమని ల్యూమినస్ పవర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రీతి బజాజ్ తెలిపారు. ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భూమ్మీద విస్తృతంగా లభించే పదార్థాలతో ఐఐసీటీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అందుకొనే ప్రయత్నం చేస్తోందని, ఇందులో భాగంగానే అల్యూమినియంతో పనిచేసే రీచార్జబుల్ బ్యాటరీల తయారీకి సిద్ధమవుతున్నామన్నారు. ఈ బ్యాటరీలు పర్యావరణ అనుకూలమైనవని చెప్పారు.

కాంగ్రెస్‌కు 21 సీట్లు దాటితే రాజీనామా చేస్తా..

నాగం గెలిస్తే రాజకీయ సన్యాసం చేస్తా : మర్రి జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 21 సీట్లు దాటితే.. వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఎవరిని చూసి ప్రజలు ఓట్లేయాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం అయిందని, భవిష్యత్‌లో నాలుగో స్థానానికి వెళ్లినా ఆశ్చర్యం పోవాల్సిన అవసరంలేదన్నారు. ఈ దుస్థితికి కాంగ్రెస్ నేత లు, వారి మాటలే కారణమని చెప్పారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో 'దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ' పేరుతో కులచిచ్చు రేపేందుకు ఢిల్లీ, హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ నేతలు రాబోతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలన్నారు. నాగర్‌కర్నూల్‌లో ఈసారి కూడా తనపై నాగం జనార్దన్‌రెడ్డి పోటీ చేయాలని, నాగం గెలిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని శపథం చేశారు.

జీతాలందక బలవన్మరణం

పురుగు మందు తాగిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని

నర్సంపేట రూరల్: నాలుగు నెలలుగా జీతాలు రాక.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిందొక ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని. వరంగల్ జిల్లా నర్సంపేటలో శనివారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలివి. నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో రావుల రమాదేవి (45) స్వీపర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు రెండేళ్ల క్రితం మృతి చెందగా.. ఆయన స్థానంలో రమాదేవిని అవుట్ సోర్సింగ్ కింద స్వీపర్‌గా విధుల్లోకి తీసుకున్నారు. నాలుగు నెలలుగా జీతాలు రాక.. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన రమాదేవి వరంగల్‌లో పురుగు మందు తాగింది. స్థానికులు గమనించి ఆమెను 108లో ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

సాక్షి, హైదరాబాద్

అదో బస్టాపు.. స్కూలుకు, కాలేజీకి బయలుదేరిన విద్యార్థులు.. ఆఫీసుకు వెళుతున్న ఉద్యోగులు.. ఏవో పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్తున్న మరికొందరు ప్రయాణికులు.. 40–50 మందిదాకా వేచి ఉన్నారు. అంతలో బస్సు వచ్చింది. అప్పటికే దాదాపు సీట్లన్నీ నిండిపోయి ఉన్నాయి. మరో బస్సు ఎప్పుడు వస్తుందో తెలియదు. సమయం మించిపోతోందంటూ అంతా ఎక్కేశారు. లోపల స్థలం లేక ఫుట్‌బోర్డుపైనా నిలబడ్డారు. అక్కడక్కడా గుంతలు, మలుపులు, పక్కపక్కనే దూసుకెళ్లే వాహనాలు.. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, పట్టుతప్పినా ప్రమాదం బారినపడే పరిస్థితి. హైదరాబాద్ నగరం చుట్టూరా శివార్లలో సిటీ బస్సుల్లో పరిస్థితి ఇది. ఆర్టీసీ బస్సులు తగ్గిపోవడం, ప్రైవేటు రవాణా చార్జీలు పెరిగిపోవడంతో ప్రయాణికులు ఫుట్‌బోర్డులపై నిలబడి ప్రయాణాలు చేస్తున్నారు. పలుమార్లు ప్రమాదాల బారినపడుతున్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

డేంజర్ జర్నీ..



నగర శివారు ప్రాంతాల్లో పరిస్థితి ఇదీ...

గ్రేటర్ హైదరాబాద్ శివార్లలో తప్పని ఫుట్‌బోర్డు జర్నీలు

- ఆర్టీసీ సిటీ బస్సుల కొరతతో ప్రయాణికులకు ఇబ్బందులు
- గంటల తరబడి ఎదురుచూపులు.. కిక్కిరిసి ప్రయాణాలు
- విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు అందరి పరిస్థితీ ఇదే..
- అవసరానికి తగినట్టుగా బస్సులు పెంచాలనే డిమాండ్లు
- అమలుకు నోచని రహదారి భద్రత చట్టాలు

ప్రమాదకరం, నేరం అయినా..

మోటారు వాహన చట్టం ప్రకారం ఫుట్‌బోర్డు ప్రయాణం నేరం. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు గతంలో మొబైల్ కోర్టులు ఉండేవి. ఫుట్‌బోర్డు ప్రయాణికులపై జరిమానాలు విధించేవారు. ఇప్పుడు మొబైల్ కోర్టులు లేవుగానీ.. ఫుట్‌బోర్డు జర్నీ మాత్రం ఆగలేదు. ఎంతోమంది మంది ప్రయాణికులు పట్టుతప్పి పడిపోతున్నారు. గాయాలపాలవుతున్నారు. పలుమార్లు బాధితులు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. ఇది రహదారి భద్రతకు సవాల్‌గా మారింది.



వందలాది రూట్లకు బస్సుల్లేవు..

ప్రపంచ నగరాలకు దీటుగా ఎదుగుతున్న హైదరాబాద్ నగరం ప్రజారవాణాలో మాత్రం వెనుకబడి పోతోంది. యునిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హంటా) అధ్యయనం ప్రకారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఏ) 7,228 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించింది. నగరంలో అందుబాటులో ఉన్న ప్రజారవాణా సదుపాయం 31 శాతమే. బస్సుల కొరత కారణంగా వందలాది రూట్లను ఆర్టీసీ వదిలేసుకుంది. హైదరాబాద్‌లో గతంలో 1,150 రూట్లలో ప్రతిరోజూ 42 వేల ట్రిప్పులు నడిచిన సిటీ బస్సులు.. ఇప్పుడు 795 రూట్లలో కనీసం 25 వేల ట్రిప్పులు కూడా తిరగడం లేదు.

అక్కడ పెంచుతుంటే.. ఇక్కడ తగ్గాయి..

గ్రేటర్ హైదరాబాద్‌లో బస్సుల సంఖ్య మూడేళ్లలో 3,850 నుంచి 2,550కి తగ్గింది.	ఢిల్లీ నగరంలో బస్సుల సంఖ్య 6 వేలు ఉండగా.. 7 వేలకు పెంచారు.

బెంగళూరు సిటీలో ప్రస్తుతం 7,000 బస్సులు తిరుగుతున్నాయి. వాటిని 13 వేలకు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రజారవాణాలో హైదరాబాద్..

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా విస్తీర్ణం	రోడ్ నెట్‌వర్క్
7,228 చదరపు కిలోమీటర్లు	5,400 కి.మీ.
	జనాభా: సుమారు కోటీ 8 లక్షలు (రాష్ట్ర జనాభాలో 29.6%)

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్	కార్లు	క్యాబ్‌లు, ట్యాక్సీలు
31%	9%	18%



ఏమూల చూసినా అంతే..

- ఎల్‌బీనగర్ నుంచి ఇబ్రహీంపట్నం, చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే సిటీబస్సుల్లో విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు ప్రతిరోజూ ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేస్తుంటారు. ఉదయం, సాయంత్రం రద్దీవేళల్లో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తుంది.
- ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ మీదుగా ఏదులాబాద్ వైపు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఉదయం 8 గంటలకల్లా బస్సు అందుకోగలిగితేనే సకాలంలో విధులకు హాజరవుతారు. ఆ రూట్‌లో వెళ్లే ఒకేఒక్క బస్సులో వేలాడుతూ ప్రయాణం చేయాల్సిందే. ఏ కొంచెం ఆలస్యమైనా సెవెన్ సీటర్ ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించాల్సిందే. ఇందుకోసం అయ్యే ఖర్చు అదనపు భారం.
- ఘట్‌కేసర్, ఇబ్రహీంపట్నం, కీసర, నాగారం, షామీర్‌పేట్ వంటి రూట్లలోనే కాదు. హైదరాబాద్ చుట్టూ ఉన్న వందలాది కాలనీలకు ఉదయం, సాయంత్రం రెండు, మూడు ట్రిప్పులు మాత్రమే బస్సులు తిరుగుతున్నాయి.
- సికింద్రాబాద్-కోఠి, ఉప్పల్-కోఠి వంటి సుమారు 150 రూట్లలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఉంటే.. పలు మార్గాల్లో అరగంట నుంచి గంటకు ఒకటి చొప్పున మాత్రమే నడుస్తున్నాయి.
- మేడ్చల్ నుంచి పటాన్‌చెరు మీదుగా గండిమైసమ్మ వరకు ప్రతిరోజు కనీసం 25 బస్సులు నిరంతరం రాకపోకలు సాగించే స్థాయిలో ప్రయాణికుల డిమాండ్ ఉంది. కానీ నడుపుతున్నది 5 బస్సులే. సికింద్రాబాద్-బహదూర్‌పల్లి, సికింద్రాబాద్-మణికొండ తదితర రూట్లలోనూ అదే పరిస్థితి.



సరిగా బస్సులు రాక సమస్య



బస్సులు సరిగా అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందిపడుతున్నాం. కిక్కిరిసి ప్రయాణించాలి. లేదా ఆటోలు, క్యాబ్‌లలో వెళ్లాల్సి వస్తోంది. ఆర్థికంగా ఎంతో భారం అవుతోంది. – ఎస్.అనిత, టీచర్

రహదారి భద్రతకు విఘాతం

బస్సులే కాదు ఆటోలు, క్యాబ్‌లు వంటి ఏ వాహనాల్లోనైనా సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రధాన రహదారుల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ శాతం ఇలాంటి ఓవర్‌లోడ్ జర్నీయే. అలాంటి ప్రతి ప్రయాణికుడిపై జరిమానా విధించే అవకాశం ఉంది.
– డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, ఉప రవాణా కమిషనర్

ప్రమాదం అనిపించినా తప్పడం లేదు



ఫుట్‌బోర్డు మీద నిలబడి ప్రయాణం చేయాలని ఎవరూ కోరుకోరు కదా. బస్సులు లేకపోవడం వల్లే చాలా మంది పిల్లలు ఫుట్‌బోర్డ్ జర్నీ చేయాల్సి వస్తోంది. – యాదగిరి, ప్రయాణికుడు

నేడు రాష్ట్రానికి చేగువేరా కుమార్తె, మనవరాలు

క్యూబా సంఘీభావ సభకు హాజరు కానున్న అలైదా, ఎస్తిఫినా గువేరా

సాక్షి, హైదరాబాద్: క్యూబా విప్లవనేత చే గువేరా వారసులు ఆదివారం హైదరాబాద్‌కు రాను న్నారు. నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా(ఎన్‌సీఎస్‌సీ), ఐప్సో(ఏఐపీ ఎస్‌ఓ)ల సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరగ నున్న క్యూబా సంఘీభావసభకు చే కుమార్తె, క్యూబా బాలల హక్కుల కార్యకర్త, అడ్వకేట్ అలైదాగువేరా, ఆమె కుమార్తె, చే మనవరాలు ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరా హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి రానున్న అలైదా, ఎస్తిఫినాకు పలు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడ క్యూబన్ ప్రతినిధి బృందంతో వారిద్దరూ సమావేశమవుతారు. ఆ తర్వాత సుందరయ్య విజ్ఞానకేంద్రం, మఖ్దూం భవన్, హరితప్లాజా, రవీంద్రభారతిని సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి రవీంద్రభారతిలో జరగనున్న క్యూబా సంఘీభావ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా వారు చేగువేరాతో తమ అనుభవా లను పంచుకోవడంతోపాటు చే సమరశీలత, ప్రజాస్వామిక చైతన్యానికి ప్రేరణ ఇవ్వనున్నారని నిర్వాహకులు వెల్లడించారు. వామపక్ష పార్టీల నేతలు ఎస్.బాలమల్లేశ్, డీజీ నర్సింహారావు సమన్వయకర్తలుగా వ్యవహరించే ఈ కార్యక్రమా నికి అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వివిధ పార్టీల ప్రముఖులు, రాజకీయ విశ్లేషకులు హాజరుకానున్నారు. రాత్రి హరితప్లాజాలోనే బసచేయనున్న అలైదా, ఎస్తిఫినా సోమవారం ఉదయం 6 గంటలకు శంషాబాద్ విమానా శ్రయం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

గూడేలు వీడి... 'నాగోబా' చేరి!

ప్రారంభమైన ఆదివాసీ జాతర

ఇంద్రవెల్లి/ఉట్నూర్(ఖానాపూర్): ఆదివాసీలు గూడేలు వీడెను. నాగోబా సీడన చేరెను. ఆదివాసీల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర శనివారం మొదలైంది. వేలాదిగా తరలివచ్చిన గిరిజనులతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ జనసంద్రంగా మారింది. మూడురోజులుగా వడమర (మర్రిచెట్ల) వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు తూమ్ పూజలు(చనిపోయిన వారికి కర్మకాండలు) నిర్వహించి శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్నారు. పుష్య అమావాస్య అర్ధరాత్రి పవిత్ర గంగాజలాలతో నాగోబాను అభిషేకించిన అనంతరం జాతర ప్రారంభమైంది. మెస్రం వంశీయులు ఉదయం నుంచి ఆచార సంప్రదాయాలు పాటిస్తూ నాగోబాను స్మరిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ సమీపంలోని వడమర వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు, పెద్దలు(పటేళ్లు) శనివారం తెల్లవారుజామున 84 మందికి తూమ్ నిర్వహించారు. శనివారం నాగేంద్రుడి విగ్రహంతో నియమనిష్టలు, వాయిద్య చప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. సిరికొండ మండల కేంద్రం నుంచి తెప్పించిన మట్టికుండలకు మెస్రం పెద్దలు పూజలు నిర్వహించారు. మెస్రం వంశంలోని 22 తెగలకు చెందిన ఆడపడుచులు పెద్దలకు, పూజారులకు పాదాభివందనం చేస్తూ నాయక్‌పొడ్ నుంచి మట్టికుండలు స్వీకరించారు. అనంతరం వడమర సమీపంలోని కోనేరు నుంచి పవిత్రజలాలను నాగోబా సన్నిధికి తెచ్చారు. గతేడాది నిర్మించిన మట్టి పుట్టలను మెస్రం వంశ అల్లుళ్లు తొలగించగా దానిస్థానంలో కొత్తగా పుట్టలను తయారు చేశారు. మట్టి ఉండలను మహిళలు చేతుల మీదుగా తరలించి సతిదేవతల ఎదుట మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మెస్రం వంశీయులు గోవాడా (గుండ్రంగా గోడకట్టి ఉండే ప్రదేశం) చేరుకుని విడిది చేశారు. మహాపూజకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాగా జాతరకు ఉమ్మడి జిల్లా నలుమూలాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ఆదివాసీలు, గిరిజనేతరులు భారీగా తరలివచ్చారు.



నాగోబా మహాపూజకు బయలుదేరిన మెస్రం వంశీయులు

ఆర్టీసీకి సంక్రాంతి గలగల

11 రోజుల్లో టికెట్ల ద్వారా రూ.165 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పండుగ రద్దీ ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించింది. ప్రయాణికులు పండుగకు ముందు సొంతూళ్లకు వెళ్లడం, అలాగే పండుగ తర్వాత తిరిగి వచ్చేవరకు.. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు టికెట్ల రూపంలో రూ. 165.46 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది గతేడాది సంక్రాంతి సమయంలో వచ్చిన ఆదాయం కంటే రూ. 62.29 కోట్లు ఎక్కువ కావటం విశేషం. ఈసారి పండుగ రద్దీ కొనసాగిన 11 రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో 2.82 కోట్ల మందిని సురక్షితంగా గమ్యం చేర్చినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సమయంలో బస్సులన్నీ కలిపి 3.57 కోట్ల కిలోమీటర్లు తిరిగినట్టు ఆయన వివరించారు. ఇది గతేడాది కంటే 26.60 లక్షల కి.మీ. అధికం కావటం గమనార్హం. ఈసారి ఆక్యుపెన్సీ రేషియో 71.19 శాతంగా నమోదైనట్టు పేర్కొన్నారు. పండుగ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీ లేకపోవటం, తిరుగు ప్రయాణం టికెట్‌ను ముందుగా రిజర్వ్ చేసుకుంటే చార్జీలో రాయితీ కల్పించటం, టోల్‌ప్లాజాల వద్ద ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక లేన్‌లు ఏర్పాటు చేయటం వంటి చర్యలతో ఆర్టీసీ వైపు ఎక్కువ మంది మొగ్గు చూపారని అధికారులు భావిస్తున్నారు. ఆర్టీసీపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగిందని, ప్రయాణికుల కోసం టెంట్లు వేసి నీడకల్పించటం, మంచినీటి వసతి ఏర్పాటు చేయటం, మొబైల్ బయో టాయిలెట్లు అందుబాటులో ఉంచటం లాంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, సిబ్బంది కూడా కష్టపడి పనిచేశారని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్‌లు వివరించారు. ఇక ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సభకు ఆర్టీసీ 1,750 బస్సులు నడిపింది. వీటి ద్వారా రూ. 2.97 కోట్ల ఆదాయం సమకూరింది.

దేశంలో ప్రశ్నించే పరిస్థితి లేదు

- రామప్ప వద్ద ప్రదర్శనకు అనుమతివ్వకపోవడం బాధాకరం
- ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయి



విలేకరులతో మాట్లాడుతున్న నృత్యకారిణి మల్లికా సారాభాయ్. చిత్రంలో బీవీ పాపారావు

హనుమకొండ: ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన రామప్ప ఆలయ సన్నిధిలో రామప్ప ఉత్సవాల నిర్వహణకు కేంద్రం అనుమతివ్వకపోవడం బాధాకరమని ప్రముఖ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయి అన్నారు. శనివారం హనుమకొండలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు బీవీ పాపారావుతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. శివుడికి ప్రీతిపాత్రమైన అభినయాన్ని శక్తి స్థలమైన రామప్పలో చేయాలని నిర్ణయించుకున్నానని, కానీ దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భావ వైరుధ్యాలను కళలకు ఆపాదించడం సమంజసం కాదన్నారు. రాజకీయంగా అభద్రత ఉన్న వారి కారణంగా దేశంలో ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అయితే భారత్ ప్రజాస్వామ్య దేశమని, ప్రశ్నించడం సగటు భారతీయుడి డీఎన్ఏలోనే ఉన్నదని పేర్కొన్నారు. వేదాల్లోంచే ఇది వచ్చిందన్నారు. అందుకే ప్రశ్నలు కొనసాగుతుంటాయని, తాను ప్రశ్నిస్తూనే ఉంటానని చెప్పారు. రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత మొదటిసారి ఇక్కడ నృత్య ప్రదర్శన చేయాలని అనుకున్నానన్నారు. రామప్ప ఆలయం ఆవరణలో ప్రదర్శన రద్దయినా, వెంటనే హనుమకొండలో ప్రదర్శనను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లను తాను వ్యతిరేకించానని, బాధ్యత కలిగిన పౌరురాలిగా గుజరాత్ అల్లర్లకు అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, పోలీసులు, ప్రభుత్వందే బాధ్యత అని చెప్పడంతోపాటు సుప్రీంకోర్టుకు వెళ్లానని పేర్కొన్నారు. అప్పటినుంచి ఇప్పటి పాలకులతో విభేదిస్తూనే ఉన్నానని, అదే కొనసాగుతుందని అన్నారు.

గురు'కల' కొలువు!

▶ మొదటి పేజీ తరువాయి

నోటిఫై చేసింది. ఇందులో 9,096 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు జారీ చేసింది. ఆర్థిక శాఖ సైతం అన్ని రకాల ఉత్తర్వులను జారీ చేసింది. ఇదంతా జరిగి దాదాపు ఏడు నెలలు గడిచింది. కానీ టీఆర్ఈఐఆర్‌బీ మాత్రం ఇప్పటికీ ఒక్క ప్రకటన కూడా జారీ చేయలేదు. బోర్డు పరిధిలో అదనంగా వచ్చిన కొన్ని కొలువులకు అనుమతులు రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గురుకుల విద్యా సంస్థల్లో 3 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కాస్త ఆలస్యంగా ఆమోదం తెలిపింది. అయితే అందుకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతులు ఇంకా వెలువడలేదు. ఈ అంశం ప్రస్తుతం ఆ శాఖ వద్దే పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ 3 వేల కొలువులకు కూడా అనుమతులు వచ్చిన తర్వాత ఒకేసారి ప్రకటనలు జారీ చేస్తామని టీఆర్ఈఐఆర్‌బీ అధికారులు చెబుతున్నారు. దాదాపు రెండున్నర నెలలుగా గురుకుల నియామకాల బోర్డు అధికారులు అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. అయినా ఇప్పటివరకు ఆర్థిక శాఖ అనుమతి మంజూరు చేయకపోవడంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



గురుకులాల్లో టీజీటీ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు శిక్షణ తీసుకున్నాను. దాదాపు నాలుగు నెలలుగా నోటిఫికేషన్లు వస్తాయనే ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటికీ ఒక్క ప్రకటన కూడా వెలువడకపోవడం తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తోంది.
– చిట్టెల మల్లేశ్, ముజాహిద్‌పూర్, వికారాబాద్ జిల్లా

రెండు రోజుల్లో 3.87 లక్షల మందికి కంటి పరీక్షలు

- 97 వేల మందికి కళ్లద్దాల పంపిణీ
- సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: కంటి వెలుగు కార్యక్రమం క్షేత్రస్థాయి క్యాంప్‌ల నిర్వహణ విజయవంతంగా జరుగుతుండటంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొదటి రెండు రోజుల్లో 3.87 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఇందులో 97,335 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కంటి వెలుగు అమలుపై శనివారం ఆమె బీఆర్‌కేఆర్ భవన్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం. రిజ్వీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి ఇందులో పాల్గొన్నారు. కాగా, అన్ని జిల్లాల్లోని బఫర్ టీమ్స్‌ను ఉపయోగించి ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కోర్టు భవన సముదాయాలు, పోలీస్ బెటాలియన్లు, జర్నలిస్టుల కోసం ప్రెస్‌క్లబ్‌ల వద్ద ప్రత్యేక కంటి వెలుగు క్యాంప్‌లను నిర్వహించాలని శాంతి కుమారి సూచించారు.

రాష్ట్రాల సమన్వయంతో పర్యాటకాభివృద్ధి


పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: పర్యాటకులను ఆకర్షించేందుకు అన్ని రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరుగుతున్న ఫిట్టర్-23లో తెలంగాణ పర్యాటకాభివృద్ధిలో భాగంగా వివిధ రాష్ట్రాల పర్యాటకశాఖ అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. దేశానికి వచ్చే పర్యాటకులకు వివిధ రాష్ట్రాల్లో ప్రాధాన్యమున్న పర్యాటక కేంద్రాల సమాచారాన్ని అందించాలని ఆయన సూచించారు. ఆయా రాష్ట్రాల పర్యాటక శాఖాధికారులు సమన్వయంతో పర్యాటకులను ఆకర్షించేందుకు సహకరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి వివరించారు.

ధరణిపై దండుగా కదలాలి

భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ పిలుపు



చేవెళ్ల: ధరణి పోర్టల్‌పై అన్ని రాజకీయపార్టీలు, రైతులు దండుగా కదిలి పోరాడాలని భూ చట్టాల నిపుణుడు, నల్సార్ విశ్వవిద్యాలయ అనుబంధ ఆచార్యులు భూమి సునీల్ పిలుపునిచ్చారు. తెలంగాణలో భూములు రీ సర్వే చేస్తేనే ధరణి, భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ ప్రధాన అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఎజెండాగా చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కందవాడ గ్రామంలో శనివారం లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ పార్మర్స్ సొసైటీ (లీఫ్స్), గ్రామీణ న్యాయపీఠం సంస్థ, తెలంగాణ సోషల్‌మీడియా ఫోరం, తెలంగాణ రెవెన్యూ మాసపత్రిక ఆధ్వర్యంలో భూ న్యాయ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు ఉచిత న్యాయ సలహాలు అందించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ..ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి గ్రామస్థాయిలో పరిష్కరించుకోవాల్సిన సమస్యల్ని కలెక్టరేట్ వరకు తీసుకుపోయిందని ఆరోపించారు. ధరణి పోర్టల్ సమస్యలపై త్వరలో గవర్నర్‌ను, సీఎస్‌ను కలిసి నివేదికను సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ మాసపత్రిక సంపాదకులు వి.లచ్చిరెడ్డి, సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ నాయకులు కోదండరెడ్డి, బీజేపీ నేత కొండావిశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

లింగమంతుల జాతర దేవరపెట్టెకు పూజలు



చీకటాయపాలెంలో దేవరపెట్టెకు పూజలు నిర్వహిస్తున్న ఉషా దయాకర్‌రావు

తొర్రూరు: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి లింగమంతుల జాతరకు తీసుకెళ్లే దేవరపెట్టెకు శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలో తండు వంశస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషా దయాకర్‌రావు పూజలో పాల్గొన్నారు. ఈ జాతరకు తొర్రూరు మండలం నుంచి తండు వంశస్తులు దేవరపెట్టెను తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

యాదాద్రిలో హైకోర్టు జడ్జి మాధవిదేవి



యాదగిరిగుట్ట: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆమె గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన తదితర పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జస్టిస్ మాధవిదేవికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఫిబ్రవరి 11 నుంచి ఓయూ డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ (సీబీసీఎస్) రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షలకు వారం రోజుల ముందుగా హాల్‌టికెట్లు జారీ చేయనున్నారు. ఈనెల 24 వరకు ఎలాంటి రుసుము లేకుండా, ఈనెల 28 వరకు రూ.500 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చు.

ప్రైవేటు ఉద్యోగ కార్మికులకు అండగా ఉంటాం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఉద్యోగ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం డైరీని మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. భారత్ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత కూడా ఈ సంఘం పలు రాష్ట్రాల్లో శాఖలను నిర్మించుకోవడం శుభ పరిణామమని అభినందించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు, సలహాదారు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యామినేని ఉప్పల్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం, ఆంధ్రప్రదేశ్ కమిటీ ఇన్‌చార్జి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

తమిళనాడులో సీడీఎస్ ఏర్పాటుకు కృషి

వీసీకే ఎమ్మెల్యేలు సింతనై సెల్వాన్, ఎస్ఎస్ బాలాజీ

హైదరాబాద్: తమిళనాడు రాష్ట్రంలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్) ఏర్పాటుకు కృషి చేస్తామని వీసీకే పార్టీ ఎమ్మెల్యేలు సింతనై సెల్వాన్, ఎస్ఎస్ బాలాజీ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం దళితుల కుటుంబాల్లో వెలుగు నింపుతోందని వారు కొనియాడారు. ఎస్సార్ హిల్స్‌లోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ భవనాన్ని శనివారం తమిళనాడు రాష్ట్ర వీసీకే పార్టీ ఎమ్మెల్యేలు సెల్వాన్, బాలాజీలు తమ బృందంతో సందర్శించారు. తెలంగాణలో దళితుల అభ్యున్నతి కోసం చేపడుతున్న పథకాలను తమ రాష్ట్ర ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. కరీంనగర్ జిల్లాలో దళిత బంధు పథకం లబ్ధిదారులతో తాము స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని చెప్పారు. దళిత్ స్టడీస్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో చేపడుతున్న దళిత సంక్షేమ పథకాలు యావత్ దేశాన్ని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. మాజీ సీఎస్ మాధవరావు, సంపాదకులు కె.రామచంద్రమూర్తి, చెన్నయ్ కార్వాన్ స్టోన్ డైరెక్టర్ రిచార్డ్ దేవదాస్, ఎస్ఏఎస్‌పై స్టేట్ కోఆర్డినేటర్ మురుగన్, తమిళనాడు సోషల్ వాచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

మనోళ్లు ‘స్మార్ట్’గా అడిక్ట్!



ఫోన్, యాప్స్‌కు బానిసలుగా మారుతున్న ఇండియన్లు

- 2022లో సగటున రోజుకు 5 గంటల పాటు మొబైల్స్‌తోనే కాలక్షేపం
- ఏకంగా 28.8 బిలియన్ల యాప్ డౌన్‌లోడ్లతో ప్రపంచంలోనే రెండోస్థానం
- రెండింతలు పెరిగిన ఫ్రెండ్‌షిప్, డేటింగ్ యాప్‌ల వినియోగం
- ఈ యాప్స్‌పై 9.9 మిలియన్ డాలర్ల మేర (సుమారు రూ.81 కోట్లు) ఖర్చు
- యాప్ ఆనీ (డేటా.ఏఐ) ‘స్టేట్ ఆఫ్ ద మొబైల్ రిపోర్ట్–2023’ నివేదికలో వెల్లడి


సాక్షి, హైదరాబాద్

దేశంలో స్మార్ట్ ఫోన్లు, మొబైల్ యాప్స్ (అప్లికేషన్స్) వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. ఫోన్ వినియోగం అడిక్షన్ స్థాయికి చేరుతోంది. 2022 ఏడాదిలో భారత యూజర్లు రోజుకు సగటున ఐదు గంటల పాటు మొబైల్స్‌తోనే కాలక్షేపం చేశారు. ఆ ఏడాదికాలంలో ఏకంగా 28.8 బిలియన్ల యాప్ డౌన్‌లోడ్లు చేసి.. ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచారు. 111 బిలియన్ల డౌన్‌లోడ్లతో చైనా టాప్ ప్లేస్‌లో నిలిచింది. వివిధ మొబైల్ యాప్స్‌లో సమయం గడుపుతున్న విషయంలోనూ భారత్ రెండో స్థానంలో నిలిచింది. మొత్తంగా అందరూ కలిపి గతేడాది మొత్తం 0.74 ట్రిలియన్ గంటలు (74 వేల కోట్ల గంటలు) మొబైల్స్‌లోనే కాలం గడిపారు. ‘యాప్ ఆనీ (ఇటీవలే డేటా.ఏఐగా పేరు మారింది)’ ఇటీవల విడుదల చేసిన ‘స్టేట్ ఆఫ్ ద మొబైల్ రిపోర్ట్-2023’ నివేదికలో ఈ ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.

ఆన్‌లైన్ కొనుగోళ్లలోనూ బిజీగా..

షాపింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్ కొనుగోళ్లలోనూ భారతీయులు ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా మొబైల్ యూజర్లు మొత్తంగా 110 బిలియన్ల గంటలు ఆన్‌లైన్ కొనుగోళ్లలో గడపగా.. అందులో భారతీయులు గడిపిన సమయం 8.7 బిలియన్లు కావడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా అధికంగా డౌన్‌లోడ్ చేసిన పది ఫైనాన్స్ యాప్‌లలో ఐదు (పేటీఎమ్, గూగుల్‌పే, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ యోనో యాప్) మన దేశంలోనే ఉన్నాయి. ఇక కరోనా మహమ్మారి కారణంగా తలెత్తిన అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో.. 2022లో ఇండియన్ల ఫ్రెండ్‌షిప్, డేటింగ్ యాప్‌ల వినియోగం రెండింతలు పెరిగిందని నివేదిక పేర్కొంది. గతేడాది ఈ యాప్స్‌పై 9.9 మిలియన్ డాలర్ల (2021లో 4.5 మిలియన్ డాలర్లు) మేర ఖర్చు చేసినట్టు అంచనా.

2022లో యాప్ డౌన్‌లోడ్లు, ఫోన్ వినియోగం లెక్కలివీ..



కల్పిత రిలేషన్‌షిప్‌లు.. మోసాలు..



మొబైల్స్, యాప్స్ వినియోగానికి అలవాటుపడ్డ వారు తమకు అంతగా పరిచయం లేనివారి నుంచి కూడా పరోక్ష సాంత్వన కోరుకుంటున్నారు. యాప్స్‌తో పరిచయమయ్యేవారు నిజ స్వరూపాన్ని దాచి, కల్పిత వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే అవకాశాలు ఎక్కువ. అమాయకత్వం నుంచి క్రిమినల్ బిహేవియర్ ఉన్న వారిదాకా తమ పద్ధతుల్లో ఈ యాప్స్‌ను ఉపయోగించడమో, దుర్వినియోగం చేయడమో జరుగుతోంది. ఈ దుష్ప్రభావాలను గుర్తెరిగి ప్రవర్తించేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ నిశాంత్ వేమన, సైకియాట్రిస్ట్, సన్‌షైన్, చేతన హాస్పిటల్స్

జనంలో బద్ధకం పెరిగిపోతోంది



విపరీతంగా మొబైల్, యాప్స్ వినియోగంతో జనంలో బద్ధకం పెరిగిపోతోంది. బంధువులు, స్నేహితులు, సన్నిహితులను కలుసుకునేందుకు కూడా ఉత్సాహం చూపడం లేదు. ఊబకాయులు, మధుమేహ పీడితులు, ఇతర అనారోగ్యాల బాధితుల సంఖ్య కూడా ఎగబాకుతోంది. ఇది రాబోయే రోజుల్లో భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. వివిధ యాప్‌ల వినియోగం విషయంలో ప్రభుత్వపరంగా రెగ్యులేటరీ విధానం ఉండాలి. స్కూళ్లలో ఏదో తరగతి నుంచే ఈ యాప్‌లపై అవగాహన కల్పించాలి.

–సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

అగ్నిమాపకశాఖకు ‘కోరలు’ వచ్చేనా?

- రెండేళ్లుగా చట్ట సవరణ ముసాయిదాకు లభించని ఆమోదం
- సికింద్రాబాద్ అగ్నిప్రమాదం నేపథ్యంలో రేపు వివిధ శాఖల ఉన్నతాధికారుల భేటీ
- పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం




సాక్షి, హైదరాబాద్: బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినా... అగ్నిప్రమాదాల్లో కోట్ల విలువైన ఆస్తులు, అంతకంటే విలువైన ప్రాణాలు బుగ్గిపాలైనా అగ్నిమాపకశాఖ చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితి నెలకొంది! నామమాత్రపు శిక్షలు, జరిమానాలు విధించడం మినహా అగ్నిమాపకశాఖ చట్టం కోరల్లేనిదిగా మిగలడమే ఇందుకు కారణం!! నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా కొరడా ఝళిపించే అవకాశం లేదని అగ్నిమాపకశాఖ అధికారులే వాపోతున్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు నేరుగా జోక్యం చేసుకోలేని పరిస్థితి ఉండటంతో జీహెచ్ఎంసీ, పట్టణాభివృద్ధి శాఖలు లేదా పోలీస్ శాఖ నుంచి కేసులు నమోదు చేస్తున్నారు. ఎప్పుడో భారీ ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారుల హడావుడి ఉంటోంది. కేవలం నోటీసులు, తనిఖీలకే పరిమితం అయ్యే పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు, మరిన్ని అధికారులు పొందేందుకు వీలుగా తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టానికి సవరణలు చేయాలని కోరుతూ ఆ శాఖ రెండేళ్ల క్రితమే ముసాయిదాను ప్రభుత్వానికి పంపింది. అయితే ఇప్పటివరకు దానికి ఆమోదం లభించలేదు. తాజాగా సికింద్రాబాద్ నల్లగుట్టలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం నేపథ్యంలో ఈ అంశానికి కదలిక వచ్చినట్లయింది. అగ్నిమాపక, పోలీస్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సోమవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, పట్టణాభివృద్ధిశాఖ అధికారులు పాల్గొననున్నారు. ఈ విషయాన్ని పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. సోమవారం భేటీలో కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బహుళ అంతస్తుల భవనాలు పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరంతోపాటు పట్టణాల్లోనూ భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రాష్ట్రంలోనే ఐటీ జాబ్స్ అధికం

రాష్ట్ర ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈవో విజయ్‌రంగినేని

సాక్షి, ఆదిలాబాద్: మొదటిసారి బెంగళూరుతో పోల్చితే తెలంగాణలోనే ఐటీ జాబ్స్ ఎక్కువ ఉన్నాయని రాష్ట్ర ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈవో విజయ్ రంగినేని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ‘ఫ్రెండ్లీ గవర్నమెంట్ -ఫ్రెండ్లీ పాలసీ’ కారణంగా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఐటీ కంపెనీ టీడీఎస్‌టీ సీఈవో సంజీవ్ దేశ్‌పాండే సౌజన్యంతో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఆధ్వర్యంలో స్టార్టప్ ఎకో సిస్టంపై ఐటీ కంపెనీ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలతో జిల్లా కేంద్రంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ పెరిగాయని, బెంగళూరుతో పోలిస్తే హైదరాబాద్‌లో 10 నుంచి 12 శాతం ఖర్చు తక్కువ కావడంతోనే పలు ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. టైర్-2లో భాగంగా అన్ని జిల్లాలకు ఐటీ విస్తరించాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు.

9వ నిజాంగా మహ్మద్ అజ్మత్ అలీఖాన్



సాక్షి, హైదరాబాద్: నిజాం 9వ వారసుడి పట్టాభిషేకం శుక్రవారం రాత్రి చౌమహల్లా ప్యాలెస్‌లో సాదాసీదాగా జరిగింది. ఇటీవల 8వ నిజాం ముకరంజా బహదూర్ కన్నుమూయడంతో ఆయన పెద్ద కుమారుడు మహ్మద్ అజ్మత్ అలీఖాన్ అజ్మత్ జాను 9వ నిజాంగా ప్రకటించారు. నిజాం సంస్థానానికి సంబంధించిన వ్యవహారాలను కట్టబెడుతూ నిజాం కుటుంబ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. దీనికి అనుగుణంగా చౌమహల్లా ప్యాలెస్‌లో ఈ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఇక నుంచి అజ్మత్ అలీఖాన్ నిజాం ఆస్తులు, ఇతరత్రా వ్యవహారాలు పర్యవేక్షించనున్నారు.

సింగరాయ జాతరకు పోటెత్తిన భక్తులు

వంకాయ కూర, చింతపండు చారుతో భోజనాలు





స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు. ఇన్‌సెట్‌లో వంకాయ కూర వండుతున్న భక్తురాలు

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనరసింహస్వామి జాతరకు శనివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. భక్తులు తొలుత మోయతుమ్మెద వాగులో స్నానం చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వాగు పక్కన చెలమను తోడి అందులో నుంచి తీసిన నీటితో వంకాయ కూర, చింతపండు చారు చేసుకొని అక్కడే భోజనాలు చేశారు. మరికొందరు వంకాయ, చిక్కుడు, టమాటాలను కలిపి కూర చేసుకోవడం గమనార్హం. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు జాతర సాగింది. జాతరకోసం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

ఆస్పత్రిని శుభ్రపరచండి

మందుబాబులకు న్యాయమూర్తి శిక్ష

మంచిర్యాల క్రైం: సాధారణంగా మందు కొట్టి వాహనం నడిపి పట్టుబడితే.. జరిమానా విధిస్తారు.. కానీ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13 మంది మందుబాబులు ఆస్పత్రిలో శుభ్రత పనులు చేయాలని మంచిర్యాల జిల్లా న్యాయమూర్తి శనివారం తీర్పు చెప్పారు. మంచిర్యాలలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై ట్రాఫిక్ సీఐ నరేశ్‌కుమార్ కేసులు నమోదు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం 13మంది మందుబాబులు రెండ్రోజులపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతాశిశు కేంద్రంలో శుభ్రత పనులు చేయాలని న్యాయమూర్తి ఉపనిషద్వాని శనివారం తీర్పు చెప్పారు. లేనిపక్షంలో పది రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శిక్ష పడిన వారిలో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన బొమ్మ మొగిలి, మంచిర్యాల కాలేజీ రోడ్‌కు చెందిన చిలుక శ్రీహరి, తిలక్‌నగర్‌కు చెందిన బిబ్బర సతీష్, హమాలీవాడకు చెందిన అలుగోజు వీరాచారి, జాఫర్‌నగర్‌కు చెందిన ఎండీ షర్ఫొద్దీన్, ఎల్ఐసీ కాలనీకి చెందిన ఎండీ మాజిద్‌ఖాన్, మందమర్రికి చెదిన పిట్టల సాంబయ్య, ఆదెపు లక్ష్మణ్, ఆనంద్ రావుర్తి, కుమురంభీం జిల్లా రెబ్బెనకు చెందిన గోళం రమేష్, భీమారం మండలం ఆరెపల్లికి చెందిన ఎల్‌డీ మహేందర్, పులిమడుగుకు చెందిన పెద్ది సురేష్, తాండూర్‌కు చెందిన భీమ సతీష్‌కుమార్ ఉన్నారు.

‘దావోస్’ పెట్టుబడులు రూ. 21 వేల కోట్లు



తన బృందంతో మంత్రి కేటీఆర్

పర్యటన విజయవంతం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం రూ. 21 వేల కోట్ల మేర పెట్టుబడులను సాధించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు పేర్కొన్నారు. తనతోపాటు అధికారుల బృందం 4 రోజులపాటు అక్కడి సమావేశాల్లో పాల్గొని తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించినట్లు ఆయన ట్విట్టర్‌లో వివరించారు. అంతర్జాతీయ, దేశీయ దిగ్గజ కంపెనీలకు చెందిన చైర్మన్లు, సీఈఓలు తదితరులతో 52 సమావేశాలు, 6 రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను బహుళజాతి కంపెనీల ప్రతినిధులు, ఆర్థిక నిపుణులు, విధానాల రూపకర్తలు సందర్శించారు. తెలంగాణ భౌగోళిక స్వరూపం, మౌలిక వసతులు, కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వ విధానాలపై రూపొందించిన ప్రత్యేక వీడియోలను ఈ పెవిలియన్‌లో ప్రదర్శించారు.

యువతకు భారీగా ఉద్యోగాల కోసం..

వరుసగా ఐదోసారి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు హాజరైన కేటీఆర్... దావోస్‌లో అడుగు పెట్టింది మొదలు వరుసగా వివిధ దిగ్గజ కంపెనీల అధినేతలతో ముఖాముఖి చర్చలు జరిపారు. దావోస్ పర్యటన మార్గమధ్యలో స్విట్జర్లాండ్‌లోని అతిపెద్ద నగరమైన జూరిచ్‌లో ప్రవాస భారతీయులతో ప్రత్యేకంగా కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణకు పెట్టుబడులతో రావాల్సిందిగా వారిని ఆహ్వానించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తెచ్చి పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఆలోచనే నిరంతరం తమను నడిపిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనకు వెళ్లిన కేటీఆర్ బృందం శనివారం హైదరాబాద్‌కు చేరుకుంది.

దావోస్‌లో రాష్ట్రం సాధించిన పెట్టుబడులు

- హైదరాబాద్‌లో మరో 3 డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మైక్రోసాఫ్ట్ రూ. 16 వేల కోట్ల పెట్టుబడి ప్రకటన.
- హైదరాబాద్‌లో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు భారతీ ఎయిర్‌టెల్ గ్రూప్ రూ. 2 వేల కోట్ల ఇన్వెస్ట్‌మెంట్.
- రూ. వెయ్యి కోట్లతో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ మార్కెట్‌లోకి ఫ్రాన్స్ ఔషధ పరిశోధన, తయారీ సంస్థ యూరోఫిన్స్ విస్తరణ
- లండన్ తరువాత హైదరాబాద్‌లో అపోలో టైర్స్ డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్.
- రూ.210 కోట్ల పెట్టుబడితో అలాక్స్ అడ్వాన్స్ మెటీరియల్స్ మల్టీ గిగావాట్ లిథియం క్యాథోడ్ మెటీరియల్ తయారీ కేంద్రం
- తెలంగాణలో పెప్సీకో కార్యకలాపాలు రెట్టింపు
- హైదరాబాద్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక నాలుగో పారిశ్రామిక విప్లవానికి సంబంధించిన కేంద్రం
- హైదరాబాద్‌లో రూ. 150 కోట్లతో రీహాబిలిటేషన్ థెరపీలో రోగులు, వైద్య సంస్థలకు అవసరమయ్యే డిజిటల్ సేవలను అందించే వెబ్‌పీటీ ప్రపంచ సామర్థ్య కేంద్రం.

తప్పించుకునే యత్నంలో ఇరుక్కుపోయారు

రాధా ఆర్కేడ్‌లో గల్లంతైన వారిలో ఒకరి ఎముకలు, సగం కాలిన పుర్రె లభ్యం

- మొదటి అంతస్తు లిఫ్ట్ సమీపంలో లభించిన ఎముకలు
- అక్కడ షట్టర్ మూసి ఉండటంతోనే ప్రాణనష్టమని అంచనా
- మరో ఇద్దరూ చనిపోయి ఉంటారని భావిస్తున్న అధికారులు
- వాళ్ల ఎముకల కోసం నేడు కొనసాగనున్న సెర్చ్ ఆపరేషన్



ఎముకలు,పుర్రెను తీసుకెళ్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో ఉన్న డెక్కన్ కార్పొరేట్ గోడౌన్ అగ్నిప్రమాదంలో గల్లంతైన ముగ్గురిలో ఒకరి మృతదేహానికి సంబంధించిన ఎముకలు, సగం కాలిన పుర్రెను హైదరాబాద్ క్లూస్ టీమ్ శిథిలాల నుంచి రికవరీ చేసింది. గురువారం ఈ ప్రమాదం జరగ్గా శనివారం సాయంత్రం ఇవి లభించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మిగిలిన ఇద్దరు కూడా మృతి చెంది ఉంటారని, వాళ్ల ఎముకలు స్వాధీనం చేసుకోవడం కష్టసాధ్యమని ఓ అధికారి వ్యాఖ్యానించారు. భవనంలోని పరిస్థితులు ఇప్పటికీ నేరుగా అడుగు పెట్టడానికి అనువుగా లేకపోవడంతో విక్టిమ్ లొకేషన్ కెమెరా(వీఎల్‌సీ)తో కూడిన డ్రోన్ల సాయంతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. శుక్రవారం వాడిన డ్రోన్‌కు అదనంగా శనివారం మరొకటి వినియోగించగా... ఆదివారం కూడా ఈ గాలింపు ప్రక్రియ జరగనుంది.

లిఫ్ట్ వద్ద షట్టర్ మూసి ఉండటంతో...

గోదాములో అగ్నిప్రమాదం జరిగి పొగలు వస్తున్న సమయంలో ఆ సంస్థ ఉద్యోగులైన జునైద్, వసీం, జహీర్ అక్కడే ఉన్నారు. అప్పటికే పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు పైఅంతస్తుల్లో ఇరుక్కున్న నలుగురు కూలీలను రెస్క్యూ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ‘డెక్కన్’ యజమాని ఆదేశాల మేరకు ముగ్గురు ఉద్యోగులు మొదటి అంతస్తులో ఉన్న సరుకు తీసుకురావడానికి లోపలకు ప్రవేశించారు. ఇది జరిగిన కొద్దిసేపటికే పొగతో పాటు మంటలూ ఎక్కువ కావడం.. అవి మొదటి అంతస్తును చుట్టేయడంతో ఆ ముగ్గురూ తప్పించుకోవడానికి భవనం వెనుక వైపున ఉన్న లిఫ్ట్ వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే మొదటి అంతస్తుకు, లిఫ్ట్‌కు మధ్య ఉండే షట్టర్ లాక్ చేసి ఉండటంతో అక్కడే ఉండిపోయి పొగ వల్ల మరణించడమో, లేదా అపస్మారక స్థితిలోకి వెళ్లి సజీవ దహనం కావడమో జరిగి ఉంటుందని అక్కడి పరిస్థితులను పరిశీలించిన అధికారులు చెబుతున్నారు.

కూలిన శిథిలాల్లో మరో ఇద్దరి అవశేషాలు...

ఈ భవనానికి వెనుక వైపుగా దాదాపు అన్ని ఫ్లోర్లకు సంబంధించిన స్లాబ్స్ కూలిపోయాయి. మొదటి అంతస్తులో ఉన్న షట్టర్ వద్దా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. షట్టర్ పక్కన గోడ వద్ద ఉన్న యువకుడి మృతదేహంపై స్లాబ్ ముక్కలు పడటంతో స్వాధీనం చేసుకున్న ఎముకలు మాత్రమే మిగిలాయని అధికారులు చెప్తున్నారు. మిగిలిన ఇద్దరూ చనిపోయే ఉంటారని, వారి ఎముకలు వంటి అవశేషాలు శకలాల్లో పడిపోయి ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఆదివారం వీటి కోసం గాలించాలని భావిస్తున్నారు. ఈ అవశేషాలను బయటకు తీసుకురావడానికి క్లూస్ టీమ్‌తో పాటు డీఆర్ఎఫ్ అధికారులు తీవ్రంగా శ్రమించారు. సిటీ క్లూస్‌టీమ్ అధికారులు తమ వద్ద ఉన్న 3డీ స్కానర్‌తో భవనాన్ని విశ్లేషించారు. ఆపై భవనం ఎడమ వైపున ఉన్న సందు నుంచి వెనక్కు వెళ్లారు. అక్కడ కిటికీ సహాయంతో లోపలకు వెళ్లి సగం పడిపోయిన గ్రిల్ ఎక్కడం ద్వారా మొదటి అంతస్తునకు చేరుకున్నారు. అక్కడ శనివారం సాయంత్రానికి కూడా వేడిగానే ఉండటం గమనార్హం.

డీఎన్ఏ పరీక్షలకు మాంసం, ఎముకలు..

ఈ అవశేషాలను శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో క్లూస్ టీమ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకన్న, లాలాపేట క్లస్టర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంజయ్ సేకరించారు. వీటిని తొలుత గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. స్వాధీనం చేసుకున్న వాటిలో సగం కాలిన పుర్రె, కాళ్లు, చేతులకు సంబంధించిన కీలు, తొడ ఎముకలు ఉన్నాయి. తొడ ఎముక వద్ద కొంచెం కాలిన మాంసం కూడా లభించింది. దీన్ని సేకరించి డీఎన్ఏ పరీక్షలకు పంపనున్నారు. ఇప్పటికే ఆ ముగ్గురి బంధువులు నగరానికి చేరుకోవడంతో వారి నుంచి నమూనాలు తీసి ఆ మాంసంతో పోల్చనున్నారు. ఈ నివేదిక వచ్చిన తర్వాతే అది ఎవరి మృతదేహానికి సంబంధించినదో తేలుతుందని నిపుణులు చెప్తున్నారు. ‘చెల్లాచెదురుగా దొరికిన ఎముకలు తదితరాలు కూడా 80 శాతం కాలిపోయాయి. గట్టిగా పట్టుకుంటే బూడిదలా మారేలా ఉన్నాయి. ఒకటి రెండు రోజుల్లో డీఎన్ఏ నివేదిక వస్తుంది’ అని డాక్టర్ వెంకన్న తెలిపారు. భవనం లోపల ఉన్న పరిస్థితుల నేపథ్యంలో మరో ఇద్దరికి సంబంధించిన అవశేషాలైనా దొరుకుతాయా లేదా అనే సందేహాలూ నెలకొన్నాయి.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 22 । జనవరి । 2023



ఎగ్జిబిషన్ పార్కింగ్‌లో అగ్నిప్రమాదం
నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని పార్కింగ్‌లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పార్కు చేసిన కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి మరో 3 కార్లకు వ్యాపించాయి. -12లో



జనాభా ప్రకారం రిజర్వేషన్లు
బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయకుండా అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. -10లో

నిలువు దోపిడీ

నిరుపేద ఆటోవాలాలపైన కొందరు ఫైనాన్సియర్లు నిలువుదోపిడీ సాగిస్తున్నారు. సుమారు 80 వేల పర్మిట్‌లను తమ గుప్పిట్లో పెట్టుకున్న ఫైనాన్సియర్లు ఒక్కో పర్మిట్‌ను ఏకంగా సుమారు రూ.2.20 లక్షల వరకు విక్రయిస్తున్నారు. -11లో

న్యూస్‌రీల్

ఆ ఇద్దరూ ప్రత్యేకం!

- డీసీపీలు ప్రకాష్‌రెడ్డి, జోయల్ డెవిస్‌లకు పదోన్నతి
- సీనియర్ ఎస్పీలుగా ప్రమోషన్ ఇస్తూ ఉత్తర్వులు

ప్రకాష్‌రెడ్డి, జోయల్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలో డీసీపీలుగా పనిచేస్తున్న 2010 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు ఎస్.ప్రకాష్ రెడ్డి, డి.జోయల్ డెవిస్‌లకు పదోన్నతి ఇస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ట్రాఫిక్, వెస్ట్‌జోన్లకు డీసీపీలుగా ఈ ఇరువురూ సీనియర్ ఎస్పీలుగా పదోన్నతి పొందారు. వీరికి గతంలోనూ సిటీలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రకాష్‌రెడ్డి ఉత్తర మండలం, శంషాబాద్ డీసీపీగా, జోయల్ డెవిస్ మధ్య మండల డీసీపీగా పని చేశారు. తెలంగాణ, తమిళనాడులకు చెందిన వీరిద్దరికీ కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి డైరెక్ట్ ఐపీఎస్‌గా ఎంపికైన తొలి వ్యక్తి ప్రకాష్‌రెడ్డి కావడం గమనార్హం. కన్యాకుమారి జిల్లాలోని కొట్టికోడు గ్రామానికి చెందిన సాధారణ కుటుంబంలో పుట్టిన జోయల్ అనేక వ్యయప్రయాసలకు ఓర్చి ఐపీఎస్ సాధించారు. ప్రకాష్‌రెడ్డికి నల్లగొండ ఎస్పీగా, జోయల్‌కు సిద్దిపేట సీపీగా పని చేసిన అనుభవం కూడా ఉంది.

సిటీ నుంచి క్విక్ జెట్ ఫ్రైటర్ విమానాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి క్విక్ జెట్ కార్గో ఎయిర్‌లైన్స్ ఇటీవల తన తొలి ఫ్రైటర్ సర్వీస్‌ను ప్రారంభించింది. క్విక్‌జెట్‌కు చెందిన బోయింగ్ 737–800ఎఫ్ ఫ్రైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఢిల్లీ, బెంగళూరు నగరాలకు రోజువారీ సేవలను అందిస్తుంది. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరును కవర్ చేసేవిధంగా నెట్‌వర్క్‌ను విస్తృతం చేసింది. క్విక్‌జెట్ ఫ్రైటర్ ప్రతిరోజూ అర్ధరాత్రి 12.30 గంటలకు హైదరాబాద్ నుండి ఢిల్లీకి బయలుదేరుతుంది. తిరిగి బెంగళూరు మీదుగా ఉదయం 8.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ప్రస్తుతం, క్విక్‌జెట్ వద్ద 22 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో బి737 -800 ఎఫ్ రెండు విమానాలు ఉన్నాయి. వీటి ద్వారా పెరిగిన కార్గో కనెక్టివిటీతో ఇ-కామర్స్ సరుకులు వేగంగా వినియోగదారులను చేరుకుంటాయని అధికారులు తెలిపారు. క్విక్‌జెట్ సేవలపైన ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుండి దక్షిణ భారతదేశానికి కార్గో కనెక్టివిటీని పెంచడానికి క్విక్‌జెట్ సేవలు ఉపయోగపడతాయన్నారు.

సరుకు రవాణాలో...
హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ కార్గో నుంచి ఫార్మా, పెరిషబుల్స్, ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఏరోస్పేస్ ఉత్పత్తులు, పెద్ద యంత్రాలు, ప్రమాదకర మెటీరియల్స్ రవాణా అవుతాయి. భారతదేశంలోని అన్ని ప్రధాన కార్గో హబ్‌లతో పాటు, ఫ్రాంక్‌ఫర్ట్, ఇస్తాంబుల్, దుబాయ్, దోహా, హాంకాంగ్ వంటి అంతర్జాతీయ గమ్యస్థానాలు కూడా హైదరాబాద్ విమానాశ్రయానికి అనుసంధానమై ఉన్నాయి.

పెరిగిన పుష్పక్ పాస్ చార్జీలు

- రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచిన ఆర్టీసీ

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే పుష్పక్ బస్సుల ఏసీ బస్సుల పాస్‌చార్జీలు పెరిగాయి. ఇప్పటి వరకు రూ.3000 ఉన్న పాస్ ధరను ఆర్టీసీ గుట్టుచప్పుడు కాకుండా రూ.5000లకు పెంచింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టులో పని చేసే వందలాది మంది ప్రయాణికులకు పాస్ ధరల పెంపు భారంగా మారింది. ఉరుము లేకుండానే పిడుగు పడ్డట్లుగా ఒక్కసారిగా పాస్ ధరలు పెంచడం దారుణమని ఈ మార్గంలో ప్రతిరోజు రాకపోకలు సాగించే పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల వేళలకు అనుగుణంగా పుష్పక్ బస్సులను 24 గంటల పాటు నడుపుతున్న సంగతి తెలిసిందే. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తున్న 40 పుష్పక్ బస్సులకు కొంతకాలంగా ప్రయాణికుల ఆదరణ కూడా పెరిగింది. ప్రతి రోజు సుమారు 4500 మందికిపైగా రాకపోకలు సాగిస్తుండగా వారిలో 800 మంది వరకు ఎయిర్‌పోర్టులో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు.

మూడు రూట్లలో..
జేబీఎస్, సికింద్రాబాద్ నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఎయిర్‌పోర్టుకు కొన్ని బస్సులు నడుస్తున్నాయి. బేగంపేట్ పర్యాటక భవన్ నుంచి మెహదీపట్నం, ఆరాంఘర్ మీదుగా మరి కొన్ని బస్సులు బయలుదేరుతాయి. అలాగే కేపీహెచ్‌బీ జేఎన్‌టీయూ నుంచి గచ్చిబౌలి మీదుగా ఔటర్ మార్గంలో మరికొన్ని బస్సులు ఎయిర్‌పోర్టుకు అందుబాటులో ఉన్నాయి. ఈ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో ఇటీవల 45 నుంచి 60 శాతానికి పెరిగింది.



దెక్కన్ భవనం వద్ద పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది
(ఇన్‌సెట్‌లో) మృతదేహం అవశేషాలను బయటకు తీసుకువస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

అంతులేని వేదన.. తప్పని నిరీక్షణ

'డెక్కన్'లో ఇంకా లభించని గల్లంతైన వారి ఆచూకీ

- ఆవేదనతో బంధువుల ఎదురుచూపులు
- ఒకరి మృతదేహం లభ్యమైనా గుర్తింపునకు సమయం
- భవనాన్ని పరిశీలించిన మంత్రి తలసాని
- కూల్చివేతపై నిపుణులతో చర్చించి నిర్ణయం



భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: మినిస్టర్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గల్లంతైన వారి కోసం బంధువులు ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నారు. మూడవ రోజు ఒక మృతదేహం మాత్రమే లభ్యం కాగా మరో ఇద్దరు ఎక్కడ ఉన్నారనే ఆందోళన బంధువుల్లో నెలకొంది. ప్రమాదం జరిగిన రోజు నుంచి శనివారం వరకు గల్లంతైన జునైద్, జహీర్, వసీంల బంధువులు ప్రమాదం జరిగిన భవనం వద్దే నిరీక్షిస్తూ తమ వారి కోసం కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఎదురు చూస్తున్నారు. నిద్రాహారాలు మాని, కుటుంబ సభ్యులు మొత్తం ఏ క్షణంలో ఎలాంటి సమాచారం వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఒకరి మృతదేహం లభ్యం కాగా అది ఎవరిదనేది తేల్చేందుకు మరో రెండు రోజుల సమయం పడుతుందని వైద్యులు చెబుతుండటంతో రెండు రోజులు అదే టెన్షన్ భరించాల్సిన పరిస్థితి వచ్చింది.

భవనం కూలగొడతారనే ఆందోళన...

భవనం మొత్తం శిథిలాలు, బూడిదతో నిండిపోవడంతో ఇద్దరి మృతదేహాలు లభ్యమవుతాయా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే సందర్భంలో భవన పటిష్టత పరిశీలించి కూలగొడతామని అధికారులు అంటుండటంతో మృతదేహాల కోసం గాలింపు చేపట్టకుండానే కూలగొడతారేమోనని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం కూలగొడితే తమ వారు ఉన్నారా, లేదా కనీసం చనిపోయి ఉంటే అవశేషాలైనా ఇస్తే అంత్యక్రియలు జరుపుకొంటామని కన్నీటిపర్యంతం అవుతున్నారు.

భవనాన్ని పరిశీలించిన మంత్రి

అగ్ని ప్రమాదం జరిగిన రాధా ఆర్కేడ్ భవనాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం ఉదయం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, కలెక్టర్ అమోయ్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విశ్వజిత్ కంపాటి, ఫైర్ ఆఫీసర్ పాపయ్య తదితరులతో కలిసి ఆయన క్రేన్ ద్వారా భవనం మొత్తం బయటి నుంచి పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న కాచిబోలికి వెళ్లి బస్తీ ప్రజలతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. బస్తీ ప్రజలు ఇప్పుడే ఇళ్లలోకి రావద్దని, ప్రమాదం జరిగిన భవనం కూల్చివేసిన తర్వాత బస్తీలో ఇండ్లకు ఎలాంటి నష్టం జరిగినా తానే బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా తలసాని హామీ ఇచ్చారు. భవనం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, అక్కడి నుంచి వచ్చే వేడితో ఏమైనా జరిగే అవకాశాలున్నాయని ఆయన ప్రజలను హెచ్చరించారు. అంత వరకు మున్నూరు కాపు సంఘం భవనంలో బస చేయాలని, భోజన సదుపాయాలు కల్పించామని చెప్పారు.

కాయకష్టాలా పనిచేస్తున్నారు

అక్కడే ఉన్న గల్లంతైన వారి బంధువులతో మంత్రి తలసాని మాట్లాడారు. ప్రమాదం జరిగిన రోజు నుంచి అధికార యంత్రాంగం గల్లంతైన వారి ఆచూకీ కోసం కాయకష్టాలా కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రమాదంలో మరణించి ఉంటే ఆ కుటుంబాలను ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందన్నారు.

గాలి మాటలు తగదు..

అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరిగినపుడు నేతలు ప్రజలకు అండగా ఉండాలే కాని నోటికి వచ్చినట్లు రాజకీయాలు మాట్లాడడం సరి కాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హితవు పలికారు. ప్రజలంతా ఆందోళనలో ఉన్నపుడు వారికి భరోసా కల్పించాల్సింది పోయి ప్రభుత్వం ఆదాయం కోసం క్రమబద్ధీకరణ చేస్తుందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. మంటల్లో గల్లంతైన వారి కోసం కొత్తగా వచ్చిన సాంకేతిక రోబోటిక్ సహాయంతో వెతికిస్తామని చెప్పారు. కొన్ని దశాబ్దాల నుంచి నగరంలో అనేక అక్రమ నిర్మాణాలు, జనావాసాల్లో గోదాములు, ప్రమాదకరమైన భవనాలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. వీటిపై ఈ నెల 25వ తేదీన ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు.



భవనం ఎదుట నిరీక్షిస్తున్న బంధువులు

ఆచూకీ దొరికేంత వరకు కూలగొట్టవద్దు: అమీన్

అగ్ని ప్రమాదంలో గల్లంతైన వారి ఆచూకీ దొరికేంత వరకు భవనాన్ని కూలగొట్టవద్దని వసీం సోదరుడు అమీన్ అన్నారు. ముగ్గురు వ్యక్తులు ప్రమాదంలో చిక్కుకుని పోతే దొరకబట్టలేరా అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చివరి క్రియలు చేసుకునే అవకాశం కూడా మాకు వద్దా అని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. వసీం గత 16 సంవత్సరాలుగా దెక్కన్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాడని, ప్రమాదం జరిగిన రోజు యజమాని ఇక్కడికి పిలిపించడంతోనే ఇదంతా జరిగిందని వాపోయారు. వసీంకు భార్య, 8 ఏళ్ల కుమారుడు, కుమార్తె (కవలలు) ఉన్నారు. గుజరాత్‌కు చెందిన జహీర్ (21) అలియాస్ సుఫియాన్ గత 8 నెలల క్రితం నుంచి దక్కన్ నిట్‌వేర్‌లో పనిచేస్తున్నాడు. జునైద్ కూడా గుజరాత్ నుంచి వచ్చి నల్లగుట్టలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు.

జీహెచ్‌ఎంసీ కార్యాలయాలకూ నో సేఫ్టీ

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనతో నగరంలోని వివిధ భవనాల ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. నగరంలోని వాణిజ్య భవనాలు, ఆస్పత్రులు, హోటళ్లు, మాల్స్ తదితర భవనాల్లో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నవి కనీసం పది శాతం కూడా లేవు. చాలా భవనాల్లో ఎలాంటి ఏర్పాట్లు లేవు. కొన్ని భవనాల్లో నిర్మాణ అనుమతులకు ముందు ఎన్‌ఓసీల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసినప్పటికీ, అనంతరం నిర్వహణ లేదు. మిగతా భవనాల సంగతటుంచి నగర ప్రజలకు వివిధ సేవలందించే..నిత్యం వందలాది మంది కార్యాలయాలకు వచ్చే జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లోనూ ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు, నిర్వహణ లేవు. ప్రధాన కార్యాలయానిదీ అదే దుస్థితి. అలంకారప్రాయంగా ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన, తుప్పుపట్టిన పరికరాలుతప్ప పనిచేసే స్థితిలో లేవు. సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోనల్ కార్యాలయాల్లో గతంలో అగ్నిప్రమాదాలు జరిగి విలువైన సమాచారం ఉన్న ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

పట్టించుకోని ఫైర్‌సర్వీసెస్..

నగరంలోని భవనాలకు ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు ఉన్నదీ లేనిదీ పట్టించుకోవాల్సింది, తనిఖీలు చేయాల్సింది ఫైర్ సర్వీసెస్ విభాగమేనని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. నిర్మాణ అనుమతుల సమయంలో ఎన్‌ఓసీ ఉందో లేదో చూడటం తప్ప ఫైర్‌సేఫ్టీతో తమకు సంబంధం లేదంటోంది. ఫైర్ సర్వీసెస్ విభాగం సైతం సేఫ్టీ అంశాల గురించి పట్టించుకున్నట్లు లేదు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడల్లా సదరు భవనాల్లో ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు, ఇతరత్రా రక్షణ చర్యలు లేకపోవడం వెల్లడవుతోంది. నగరంలోని అన్ని వాణిజ్యసంస్థలకు ఫైర్‌సేఫ్టీ ఉందో లేదో తనిఖీ చేయాల్సిందిగా మునిసిపల్ పరిపాలనశాఖ మూడేళ్లక్రితమే ఆదేశించినా ఇంతవరకు అపని జరగలేదు. ఈ నేపథ్యంలో ఫైర్‌సేఫ్టీకి సంబంధించి త్వరలో జరుగనున్న ఉన్నతాధికారుల సమావేశంలో తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. భవనం ఎత్తుతో సంబంధం లేకుండా సేఫ్టీ ఏర్పాట్లు, ఏయే వ్యాపార సంస్థల్లో సేఫ్టీ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలి తదితర అంశాలపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

- ప్రధాన కార్యాలయంతో సహా ఆఫీసులకు భద్రత కరువు



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నామమాత్రంగా మారిన ఫైర్‌హైడ్రెంట్ బాక్స్



రాజకీయం..

- పైలెట్ వర్సెస్ పట్నం.. సబిత పెత్తనం ఏమిటంటున్న తీగల
- మలిపెద్ది, మల్లారెడ్డికి మధ్య మంటలే.. మహేశ్వరం, తాండూరు, మేడ్చల్ నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు
- టికెట్ రాకపోతే ఫిరాయింపులకు సిద్ధం!

రసకందాయం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొత్త, పాత బీఆర్‌ఎస్ నేతల మధ్య తారాస్థాయికి విభేదాలు

'ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు' అనే నానుడి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాలకు అతికినట్టు సరిపోతుంది. కొత్త, పాతల మధ్య కుదిరిన సయోధ్య చెదరడంతో భవిష్యత్తు రాజకీయం రసకందాయంగా మారనుంది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని కీలక నాయకుల అంతర్గత కుమ్ములాటలు, ధిక్కార స్వరాలు క్రమక్రమంగా రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి. నాయకుల వైఖరి అధిష్టానానికి తలనొప్పిగా మారుతోంది.
– సాక్షి, సిటీబ్యూరో

- జిల్లా రాజకీయాలను శాసించే మహేశ్వరం, తాండూరు, మేడ్చల్ నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలు రోజురోజుకూ ముదిరి పాకాన పడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అసంతృప్తి మరింత పెరిగేలా పరిణామాలు కనిపిస్తున్నాయి. మహేశ్వరంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, తాండూరులో ఎమ్మెల్యే పైలెట్

రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నంమహేందర్ రెడ్డి, మేడ్చల్‌లో కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మధ్య చాలాకాలంగా విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. అవి మెల్లమెల్లగా రాజుకుంటూ ఆసక్తికరంగా మారుతున్నాయి. పార్టీ ఒకటే అయినా వైరివర్గం ఆధిపత్యం మింగుడుపడక అధిష్టానంతో తాడోపేడో తేల్చుకోవాలనే భావనలో అసంతృప్త నేతలు ఉన్నారు. తమ కుటుంబ సభ్యులు జిల్లా పరిషత్ పీఠాలపై కూర్చున్నా సరే ప్రత్యర్థుల పెత్తనాన్ని ఒప్పుకొనేది లేదని తెగేసి చెబుతూ తిరుగుబాటుకు సిద్ధపడుతుండడం గమనార్హం.

పైలెట్‌తో పట్నం ఢీ

గత ఎన్నికల్లో తాండూరు నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పైలెట్ రోహిత్ రెడ్డి చేతిలో అనూహ్య ఓటమిని చవిచూశారు. తర్వాత తన సోదరుడి రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని దక్కించుకోవడంతో సంతృప్తి పడ్డారు. అనంతరం జెడ్పీ ఎన్నికలు రావడంతో సారథిగా సతీమణి సునీతను గెలిపించుకోవడం ద్వారా వికారాబాద్ జిల్లాలో తన రాజకీయ పలుకుబడి తగ్గలేదని నిరూపించుకున్నారు. అయితే, తనను ఓడించిన పైలెట్‌ను అధిష్టానం అక్కున చేర్చుకోవడంతో డీలా పడ్డారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రెండువర్గాలు విడిపోవడంతో గులాబీ శిబిరంలో లుకలుకలు మొదలయ్యాయి. వీరి ఆధిపత్యపోరులో శ్రేణులు కూడా చీలిపోవడం.. ప్రొటోకాల్ సమస్యలతో తాండూరు రాజకీయ రంజుగా మారింది. ఎమ్మెల్యేలకు ఎర కేసుతో ప్రగతిభవన్‌కు దగ్గరయిన పైలెట్ మెడకు ఈడీ కేసు బిగుసుకుంటుందని.. తద్వారా వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమనే ధీమాలో పట్నం వర్గీయులు ఉన్నారు. రోహిత్ మాత్రం తన కెరీర్‌ను పణంగా పెట్టి బీజేపీపై కేసీఆర్‌కు పోరాటాస్త్రం అందించానని, ఈ సారి గులాబీ బీఫారం తనదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ సమీకరణలకు అనుగుణంగా అడుగువేయాలని భావిస్తున్న పట్నం అవసరమైతే కండువా మార్చయినా జిల్లా రాజకీయాలపై మళ్లీ పట్టు సాధించాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

సబిత వర్సెస్ తీగల

మహేశ్వరంలో మంత్రి సబిత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి పొసగడం లేదు. గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన తీగలపై సబిత విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఆమె కాంగ్రెస్‌ను వీడి గులాబీ గూటికి చేరి కేబినెట్‌లో బెర్త్ దక్కించుకున్నారు. అప్పటి నుంచి కినుక వహించిన కృష్ణారెడ్డి పలుమార్లు మంత్రి వ్యవహారశైలిని తప్పుబడుతూ వస్తున్నారు. అసంతృప్తిని చల్లార్చేందుకు అధిష్టానం.. ఆయన కోడలు అనితారెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్‌గా నియమించింది. దీంతో కొన్నాళ్లు గుంభనంగా వ్యవహరించిన కృష్ణారెడ్డి తిరిగి మంత్రిపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. అభివృద్ధి జరగడంలేదని,తన వర్గీయులను అణిచివేస్తున్నారని పెదవి విరుస్తున్నారు. ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్‌ను కాదని తనకు టికెట్ ఇచ్చే అవకాశం మృగ్యమనే ప్రచారం నేపథ్యంలో పక్కపార్టీలవైపు చూస్తున్నారు.



మేడ్చల్‌లోనూ సేమ్ సీన్

2018 ఎన్నికల్లో టికెట్ నిరాకరించడంతో మిన్నకుండిన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ఈసారి మాత్రం అధిష్టానంతో చావోరేవో తేల్చుకునేదిశగా అడుగులేస్తున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచిన చామకూర మల్లారెడ్డి అనూహ్యంగా మంత్రివర్గంలో చోటు సంపాదించారు. ఈ పరిణామం మింగుడుపడని మలిపెద్ది.. తన అనుచరవర్గాన్ని కాపాడుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే ఆయనను సంతృప్తి పరిచేందుకు కుమారుడు శరత్‌చంద్రారెడ్డికి మేడ్చల్ జెడ్పీ పీఠాన్ని అప్పగించారు. దీంతో కొన్నాళ్లపాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అయితే, సుధీర్‌రెడ్డి వర్గాన్ని టార్గెట్ చేసిన మల్లారెడ్డి.. నెమ్మదిగా అన్ని మండలాల్లో తన ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోని సుధీర్.. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా బరిలో దిగి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. కుటుంబీకులపై జరిగిన ఐటీ దాడులతో మంత్రి ప్రతిష్ట మసకబారిందని.. ఈసారి తనకు టికెట్ ఖాయమనే భావనలో ఉన్నారు. అధిష్టానం నుంచి రిక్తహస్తం ఎదురైతే ప్రత్యర్థి పార్టీ కండువా కప్పుకొనేందుకు కూడా వెనుకాడరనే ప్రచారం జరుగుతోంది.



జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

కవాడిగూడ: బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయకుండా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలతో జెండాలు మోయించి ఊడిగం చేయించుకుంటున్నారని వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడం లేదన్నారు. బీసీల రిజర్వేషన్లు 27శాతం నుంచి 52 శాతానికి పెంచాలని, బీసీ కులజనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఎస్‌పీ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఒక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా వాడుకుని ఓట్లు వేయించుకుని అనంతరం విస్మరిస్తున్నారని, బీసీలు 60శాతం జనాభా ఉన్నా రాష్ట్రంలో 25 శాతం, కేంద్రంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ మిగతా అన్ని వర్గాల వారికి మాత్రం జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయడంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. అరశాతం ఉన్న అగ్రవర్ణాలకు కూడా ఏడు శాతం ఉంటే పదిశాతానికి రిజర్వేషన్లను పెంచిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీలు అవసరం లేదా, రాబోయే రోజుల్లో బీసీలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిరాహార దీక్షకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రుద్రవరం సునీల్ అధ్యక్షత వహించగా నాయకులు దాసరి ఉప, జక్కని, సంజయ్, శ్యామ్‌సన్, మహ్మద్ షఫీ, అరుణ క్వీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

మొయినాబాద్‌రూరల్: వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని.. కుటుంబాలతో సంతోషంగా ఉంటారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని ఎంఆర్‌ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్టీఏ, సెలబ్రిటీస్‌కు రోడ్డు సేఫ్టీ కప్–2023 పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు పాటిస్తే మరణాలు తగ్గించవచ్చన్నారు. శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో పోలీసులు, ఆర్టీఏ అధికారులు తలపడ్డారు. పోలీస్‌టీం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లుగా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, వరంగల్ డీఎస్పీ ఎస్.రాంబాబు బరిలోకి దిగారు. సీవీ ఆనంద్ 21 బాల్స్‌లో 34 రన్స్ చేశారు. నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో ఆకట్టుకున్నారు. అనంతరం దిగిన అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ 28 బాల్స్‌లో 29 రన్స్ చేశారు. మూడు ఫోర్లు కొట్టారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్, సీసీఎస్ సంగారెడ్డి ఆర్.రవి, అంబర్‌పేట్ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్గనైజర్ కన్నన్, వివేక్‌నందరెడ్డి, క్రికెట్ గ్రౌండ్ ఓనర్ రవీందర్‌రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి


మాట్లాడుతున్న ఆర్.తిరుమలై

హిమాయత్‌నగర్: దేశంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మత చాందస పోకడలను అనుసరిస్తోందని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై ఆరోపించారు. మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రధాని హిందుత్వ అజెండాను దేశంపై రుద్దడానికి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. కేవలం పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలించే విధానాలనే అవలంభిస్తున్నారే తప్ప దేశ యువతకు అవసరమైన విధానాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో 45 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయని, యువతకు ఉపాధి కల్పించకుండా దేశ ప్రగతి సాధ్యం కాదన్నారు. రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోలీసు పరీక్షల్లో అభ్యర్థులకు జరిగిన అన్యాయం పై సమగ్ర విచారణ జరిపించాలని, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లాఖాద్రీ, కె.ధర్మేంద్ర, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నెర్లకంటి శ్రీకాంత్, లింగం రవి, మహేందర్, మానస్ కుమార్ పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్ శరన్‌ను పదవి నుంచి తొలగించాలి


సుందరయ్యపార్కు వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరన్‌ను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యపార్కు వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమకు న్యాయం చేయాలని బ్రిజ్ భూషన్‌ను సమాఖ్య అధ్యక్షత బాధ్యతల నుంచి తొలగించాలని భారత మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనతో భారత ఒలంపిక్ సంఘం దిగివచ్చి ఏడుగురితో విచారణ కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరిపేందుకు అతడిని పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. క్రీడాకారులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు ఇందిరా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగీతం పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత నక్షత్రం వేణుగోపాల్ రచించిన శ్రీగీతం పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. అమెరికాలో స్థిరపడినప్పటికీ తెలుగుభాషలో నవలలు రాయడం ఎంతో అభినందనీయమన్నారు. రచయిత వేణుగోపాల్ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వనమాలి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేశపతి శ్రీనివాస్, జూలూరు గౌరీశంకర్ తదితరులు

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

■ గుంటూరుసిటీ,గోరంట్ల,లాం,JKC రోడ్, భవాని & శక్తినగర్, మధురానగర్, అంబటి, కల్యాణపు, సాసైటీ, బాప్యం, జనసైతన్య & అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన వారు 9848779955 [G-6065]

■ Open Plots & Villas Available Near TCS Adibatla, Vijayawada Highway Choutuppal, Range Starts 7500/- Sqyd. Contact: 7893749887. [H-1215403]

BUILDING CONSTRUCTION

■ SVS Building & Construction 1500 for Sft. కస్టమర్ చాయిస్‌తో 100% వాస్తుతో హౌస్ కన్‌స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. సంప్ర 8142384118, 7032495920. [H-792904]

■ Srirama Constructions మంచి మెటీరియల్ తో 1675/- Sft. కట్టి ఇవ్వబడును & ఇండ్ల ఆల్టరేషన్ చేయబడును. (కార్ డ్రైవర్ కావలెను) ఫోన్ : 9347156817. [HA-10038]

■ ఇల్లు కట్టి ఇవ్వబడును. 100% వాస్తు క్వాలిటీ మెటీరియల్‌తో 20 సం॥ అనుభవం గల ఇంజనీర్లు, మేస్త్రీలు మీ బడ్జెట్‌లో కట్టి ఇవ్వబడును. Ph: 7386082969 [H-792649]

COMMERCIAL

■ Vanastalipuram Ganesh Temple Main Road 15,000 Sft. Commercial Space for Colleges, Schools Etc. Ph: 9848048215, 7845152011 [H-797365]

■ Near Hitech City, Melange Tower, 2068sft, Plug N Play done, for Lease Contact : 9885109127. [HA-8449]

■ Commercial Space for Rental for Godown, 1600 Sq.ft at Amberpet, Hyderabad Main Road near Zinda Tilismat Ph: 8074015650 Basheer [HA-10060]

FLAT FOR SALE

■ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 86, 1st ఫ్లోర్, 3BHK 2400 Sft. UDS 100 (సర్వెంట్ రూం) & బంజారాహిల్స్ రోడ్ నెం. 14 E/F 3 BHK 1800 Sft & ఫిల్మ్‌నగర్ 2400 Sft. 3BHK (New) 2 కార్ పార్కింగ్ N. రాఘవ రెడ్డి. ఫోన్ : 9848087754. [H-793301]

■ Manikonda-Panchavati Colony Road No. 10, 0.5Km to Darga Road, 3BHK Flat, E/F, 1st Floor, 1650 Sft. HMDA Approved Ready to Move 100% Vastu, 24 Hrs. Water. Ph: 9848456899, 9848964499 [HA-918]

■ Jeedimetla TSIIC Colony, Shapur Elite County, 2 & 3 BHK, 1000sft.-1550Sft. GYM, Function Hall, Play Area, Ready to Occupy. Ph: 8790738313, 8008813256 [H-792782]

■ Genome Valley, Near Shamirpet, Own 2 BHK Flat, Invest Just Rs. 32 Lakhs, (T&C Apply) 20K Work force needs. Housing. Call : 9490439711. [H-793303]

■ 2BHK Flat, 1130sft. East Facing. 4th Floor Lift & Carparking Ravindranagar Colony, at Habsiguda St. No. 8 Ph: 9291800481 [HA-10032]

■ Alwal Rukmini Enclave Gated Community 5 Independent Floors Each Floor 1 Flat 2705 Sft. @ 5500 Per Sft. Near by Kompally. Ph: 9949077488 [H-786779]

■ Sainathpuram, Opp: Dmart, Deendayal Nagar Colony, 2 BHK flat, 1100 Sft, 2nd floor, 100% Vastu, 26 lakh Genuine Buyers Only. Ph: 9989133427 [H-787361]

■ 3BHK 1610 sft, Wood Works Falseceiling, Manasa BHEL Exicutive Towers, B/S Bajaj elec. Visweswaraiah Colony Madeenaguda. Ph: 9849959373 [H-787362]

■ ECIL Cherlapally Premium Apartment Flats For Sale 2 BHK-890 Sft. 3 BHK-1225 Sft. Cont. 9676078882, 9966900850 [HA-618]

■ Commercial Flat for Sale, 1040 Sft. 4th Floor E/F in City centre, adj Astalaxmi arch Kothapet, Suitable for Office's Coaching Centre, Hostels. Ph: 9133111128 [H-792982]

HOUSE FOR SALE

■ నాగోల్ తాటి అన్నారం GVR కాలనీలో 120 చ॥గ॥ ల G+1 మరియు పెంట్‌హౌజ్ తూర్పు ఫేస్ అన్ని వసతులు గల ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 9292951392 [Y-772728]

■ 4 Single Bedrooms House for Sale in 200yds. W/F, RC Puram, BHEL, Price 1.40Cr. neg. 2min to bus stop. Call: 9703692409, 8019800981. [HA-616]

■ Chappal Bazar, Kutbiguda, 600Sq. Yds. Old House for Sale Nr. Sultan Bazar Road. Ph: 6303963789, 7997989398. [H-787380]

■ 40 Sq.yds Notaried House for Sale @ 25 Lakhs @ Indiranagar Moosarambagh, 100 Mtrs to Dilsukh Nagar Highway. Call: 9666522289 [H-786780]

■ 112Sq. yrd, Asbestos Sheet, Registered house at Alkapur Rd. Opp. Laxmi Nagar, Near Zeeshan Hotel & Golconda Qila 3BHK with all Amenities. Rs. 36 Lacs. Agents Strictly Execuse Ph: 9396484990. [H-793455]

■ G+1, N/W, 150Sq.yds/2300Sft. 5Yrs, Dr's Luxury 4BHK, Near Gachibowli/ Narsingi Metro -1. 59Cr. @ 9849271322 (Only Whatsapp). [H-779947]

■ 2BHK Flats & INDP Houses with Furniture HMDA, Near Hayathnagar, Gated Community, Loans B. Bheem Reddy Ph: 8885060741, 9700974806 [HA-10951]

■ Indp. House 117.20 S.Yds E/F, Near Chandanagar MMTS Stn. Huda Colony 30% less then Market Due to Ramalayam Temple Beside House. HUDALayout Ph: 9052047426 [HA-49974]

■ 4BHK House with Drawing Room @ 200 Sq./Yds Officers Colony, Suncity. Ph: 8555942923, 9963554516. [HA-49721]

■ Munaganoor Hayathnagar, 404 Sq. Yds. Indp. House for Sale 2.10Cr. With Car parking, 100% Vastu, P.No. 63 &64, Ph: 9059071317/ 9010219658 [H-787477]

■ ALWAL-Independent house for Sale 138.8sq.yds(G+1), West Face, 30-Feet Road, 3-Years Old, Road No-6, Near hitension Road. 1.35 Cr. 9492059710 [G-6942]

LAND FOR SALE

■ జనమహల్ మెయిన్ రోడ్ ఫేసింగ్ 25 ఎకరాల అగ్రికల్చర్ భూమి. ఫుల్ సీటి నదుపాయంతో అమ్మకం. దామెరచర్ల దగ్గర, నల్గొండ జిల్లా. సంప్ర : 9115842234, 8499870868. [H-776444]

PROPERTY FOR SALE

2600 Sq Yds. G+1 Building, Useful for Schools, Colleges, Hospitals, Coaching Center's (Now Rental Income 5 lakhs P/M), Cost 19 Cr. Near Highway Medipally, Uppal. Cell 63090 15999

■ Vijayawada Highway 30Km From LB Nagar Near MSME Malkapur Total 8 Acres (Totally/Partly) For Sale. Ph: 9440869491, 9440869494. [HA-10039]

■ Moinabad Mudmiyal Village 20 guntas, Malkapur Village 19, 10guntas with all Amenities. Ph: 9963554516, 8555942923. [HA-49720]

LEASE / RENT

■ Sagar Road Regannaguda, Opp: Deccon Bawarchi Hotel, Commercial Ground & 1st Floor. Each 1650 Sft. Offices, Banks & 2nd Floor for Family. Ph: 9246193810 [H-792851]

PLOT FOR SALE

■ పెద్దంబర్‌పేట్ రోడ్ నం. 2, అంబికా నగర్ రూట్‌లో 165 చ॥గ॥ E/F 20x75, 60ft. రోడ్ గల ప్లాట్ అమ్మబడును. ఫోన్ : 9849027484. [H-792969]

■ సాగర్ హైవే Nr. ఫార్మాసిటీ, యాచారం, ఇన్వెస్టర్ ప్రైస్ 4,999/- వీకెండ్ ఫాం ప్లాట్స్, గేటెడ్ కమ్యూనిటీ (12yrs మామిడి చెట్లు) గెస్ట్ హౌస్‌తో రెడీ టూ కన్‌స్ట్రక్షన్. Ph: 9121687816 [H-792578]

■ ECIL చీర్యాల & కీసరదాయర HMDA లేఅవుట్ లో రెసిడెన్షియల్ ప్లాట్లు అన్ని డెవలప్‌మెంట్స్ తో అమ్మకానికి కలవు. 100ఫీట్ రోడ్ ఫేసింగ్. ఫోన్ : 7780884948. [HA-49784]

■ వర్ధిగానుపల్లి, శంకర్‌హిల్స్ కాలనీ, ఉదుమాగులపల్లి, గౌతమ్ నగర్, ఐలాపూర్, రాజగోపాల్ నగర్ & కొల్లూరులో ప్లాట్లు కొనబడును. ఫోన్ : 7032116365, 9885949834. [H-792314]

■ వరంగల్ హైవే ఆలేరు - యాదగిరి గుట్ట DTCP ఫైనల్ అప్రూవ్ లేఅవుట్‌లో గ॥ 7000/- రూ॥ 180, 200, 400 గ॥ ప్లాట్లు అన్నిడెవలప్ మెంట్స్‌తో స్పాట్ ఫై పార్ట్ Ph: 9441288029, 9618411387 [H-787472]

■ వర్ణి వాగుల పల్లి "కంట్ హిల్స్" ఉదుమాగులపల్లి "గౌతమ్ నగర్" ఐలాపురం "రాజగోపాల్ నగర్" ప్లాట్లు అమ్మదలచినారు. సం.ప్ర॥ రమేష్ రియల్ ఎస్టేట్ ఫోన్ 9866928587. [H-776699]

■ కంది ఐఐటీ దగ్గరలో, హైవే కి అతి దగ్గరలో HMDA అప్రూవ్ కలిగిన Gated Community Villa ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్ సదుపాయం కలవు. ఫోన్ : 8919065682. [HA-2911]

■ రాజాపూర్ @NH-44 దగ్గర 0% ఇంట్రెస్ట్‌తో 30 నెలల EMIతో అన్ని డెవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA= (HMDA) లేఔట్లో PLOT కలవు. ఫ్రీ సైట్ విజిట్‌కు సంప్ర. Ph: 9949695027 [HA-902]

■ Jodimetla Pocharam 2nd Bit Warangal Highway 1500 sq.yds. Plot for sale @ Rs. 55000/- LRS Done, Suitable for Hospital, School, Apartments. Ph: 9391005628 [HA-49770]

■ Bahadurpally 280Syds, W/F, 30Ft Rd. 200meter for Highway insider ORR Nr 2km only. per yd 17k (Direct Owner). Ph: 9603399165. [HA-10059]

■ Jadcharla, Polapalli Nr. Udandapur DAM 200 & 400 Sq.yds. Plots with GP. Layout, Electricity & Water Facility, Rs. 3000/- Sq.yrd. Contact: 9396484990. [H-793454]

■ At Patancheru Indresham Village 250 yds, 50x40, West Facing, 30 Feet Road, Plot For Sale. Ph: 8247587034. [HA-49722]

■ Buy 605 Sq. Yrds @3.7Lac with Dates Farming, Resort Access & Long Lasting Rental Income of Rs. 1,67,000/- P.A., for details Call : 8309458513 [HA-13166]

■ 212 Sq.yds E/F at Prime Location Sand Stone Cosmocity Layout Gated Community HMDA Approved Layout Besides Lahari Resorts, Sankerpally. Cont: 9490748856, 8985236856 [H-792879]

■ HMDA & DTCP Open Plots for sale on Sagar highway& Sri Sailam Highway Spot Registration, Bank Loans, 9493080626, 9640173579. [HA-10753]

■ 200Sq. Yds. Plot at Chandupatlaguda Village, Near NFC Nagar, GP. Layout, Ghatkesar Municipality, Price 12000/- Contact: 9989629000 [H-792729]

■ Plot For Sale only 4 Lakhas For 605Sq.yds (5 Guntas) Farm @ Narayankhed with Sandalwood Plants. 9963180878@ 9182703926 [H-748346]

■ Attapur - Rajendra Nagar (Buduel) 705Sq.yds West 40ft Road Contact: 8125615976 [H-776744]

■ Malkajgiri Deendayal nagar South 300Sq.yds, East Anandbagh South 346Sq.yds Contact: 8008596333 [H-776743]

■ Saraswathi Nagar Colony Saidabad 267 Sq.Yds. E/Facing (40x60 Size) Open Plot for sale Contact: 9989999753 [H-797365]

■ MANIKONDA PANCHAVATI COLONY, 400 Sq.Yds, West Facing, Plot for Sale, LRS fully paid. Contact no. 9246546336. [HA-4206]

■ 200Sq. yards, North Face, LRS Paid, @ Chkaripuram, 3Km from ECIL Ph: 9849356001. [HA-08254]

■ We Buy Old DTCP and HMDA RESALE Plot in Maheshwaram, Peddago-konda, Nagaram, Tukkuguda, Kandukur, Shamshabad Areas Cell: 9908224832 [HA-1624]

PROPERTY FOR SALE

■ Farmhouse 267Sq.yds @ 150 acre Gated. Zaheerabad. Cell: 9538090865. [HA-08224]

Services

BABY CARE CENTER

■ రూపా డే కేర్ సెంటర్ వివేకానంద కాలనీ, మెహిదిపట్నం Timings: 9:00am to 6:30pm ఫోన్ 9849372759 (రూప). [H-779933]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792810]

BUSINESS OFFER

■ బ్రాయిలర్ కోళ్ళ & నాటు కోళ్ళ పెంపకం మరియు వాటి ఉత్పత్తి (Production) మెషినరీ విభాగంలో 1 లక్ష అపైన పెట్టుబడుకు కావలెను. ఫోన్ : 9441015276. [HA-13167]

■ బిజినెస్ అవకాశం. తక్కువ పెట్టుబడి ఎవరికైనా చేయాలని ఇంట్రెస్ట్ ఉన్న వ్యక్తులు ఈ నెంబర్‌కి కాల్ చేయగలరు. సెల్: 9063518087 [K-1141940]

■ స్త్రీ/పు. మంచివారు పార్టనర్స్ కావలెను, ఆపిల్ షేప్ & ప్రాన్స్ (రొయ్యలు), కర్రీ పాయింట్ స్టాల్ కొరకు కావలెను. పెట్టుబడి 5 లక్షల, 2-3 లక్షల ఆదాయం నెల అర్జెంట్. Ph: [illegible] [HA-13197]

■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748340]

INSURANCE

■ కోటి రూ॥ మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ట త్రక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥ చొప్పున పొదుపు చేయండి. పెన్షన్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రిస్క్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-10016]

AYURVEDAM

■ అన్ని రకముల మందులు, కీళ్ళ నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్ త్రిపాఠి-సెల్: 7738887455 [K-1141937]

VEHICLES WANTED

■ Vehicle Required for (Lease)FN Travels Engage Fortuner, INNOVA CRYSTA, Baleno, SWIFT, BREZZA, ERTIGA, MAHINDRA, KUV 100,I20 ELTIE. and Premium Luxurious Cars Also BENTLEY TOO MERCEDES, Ph : 8886777861, 9000877861. [HA-10061]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Bharat Kumar Ashar S/o. Jamnadas Ashar, R/o. H.No. 1-11-222/5, Begumpet Hyd-500016. have changed my name from Ashar Bharat Kumar to Bharat Kumar Jamnadas Ashar, for all purposes. [H-793483]

■ We, Syed Ilyas Ahmed and Mubina Fatima, R/o. H.No. 8-3-228/1174/A, Rahmath Nagar, Yousufguda, Hyderabad, have changed our Daughter name from Sumayya Sadal to Sumayya Sadal Syed for all purposes. [H-793306]

■ I, Godavarthi Amulya Rose, W/o. B. Abhilash, R/o. H.No. 5-82/65, Kista reddypet, Ameenpur, Hyderabad - 502319, have changed my name to Boosa Amulya dated on 14th February 2019. Hence forth iam being called as Boosa Amulya (New Name) for all purposes. [HA-10064]

■ I, Venkata Lakshmi Raja Siri Chandana Kanala, D/o. Kanala Chittaranjan Rao, DOB: 25-09-1996, Native: Guntur Dist. Residing at Plot No. 57, BHEL HIG, Phase-2, Ushodaya Enclave, Near Sri kara Hospitals, Mytri Nagar, Madeenaguda, Miyapur, KV Rangareddy, Telangana - 500049. shall henceforth be known as Siri Chandana Kanala. [HA-8442]

■ I, Shaik Zainab Salahuddin D/o. of Shaik Muhammed Salahuddin residing at # 11-4-892, Main Road, Chilkalaguda, Hyderabad-500061, have changed my name to Zainab for all future purposes. [HA-8476]

■ I, Muskaan W/o. Ghouse Mohiuddin R/o. H.No. 2, Polisetty Enclave, Vikrampuri, Kharkana, Hyderabad have changed my name from Muskaan to Muskaan Mohammed for all record purposes. [HA-09765]

■ I, Gajjala Subhashini W/o. Gajjala Ramakrishna R/o. H.No. 131/A, Sai Nagar, Near Sai Baba Temple, Kushaiguda, Hyd - 62, T.S. Changed my name P. Subhashini to Gajjala Subhashini. [H-787483]

■ I, Nazima Sultana W/o Mohammed Ateeq R/o 9-2-835/1, Abrar Nagar, Hasmatpet, Old Bowenpally, Hyderabad Changed my son's name from Rayyan to Mohammed Rayyan for Passport renewal. [HA-09771]

■ I, Prashant Ramesh R/o H.No.14-159/10, Four Square Residency Behind Arora College, Chikkadapally Hyd. Declares My Daughter Name has Changed From Aayushee to Aayushee Prashant Utage For All Purposes. [HA-2917]

■ I, Aparna Prashant Utage, R/o H.No. 1-8-155/1D, Four Square Residency, Behind Arora College, Chikkadapally, Hyd-20. Has Changed My Name as Aparna Prashant Utage For All Purposes. [HA-2918]

LOST

■ I, Pratima Mallick S/o. Karthik Chandra Mallick, Age: 46yrs. R/o. Plot No. 2, 1St. Floor, Prakashbhavan, Brahma Kuaris Shanthi Sarovar, Gachibowli, Serlingampally, R.R. Dist. Hyd. T.S. - 500032. Missed my Passport Bearing No. R0141683, If found pls. Call: 9391334473 [H-792784]

■ I, Kodali Jonah S/o. K. Simon, owner of house H.No. 10-250, Vasanthapuri Colony, Malkajgiri, Hyd-47, T.S. on 7/1/23 Lost my Original Sale Deed Document Reg. No. 146/1978 Dt. 10/01/1978, while I was in the Secunderabad Monda Market to Purchase vegetables. I was carrying the document in my bag. If anyone found it. Please call: 9000646456 [H-792699]

OLD AGE HOME

■ అమోదయ ఓల్డేజ్‌హోమ్ బాల్నగర్ నందు వృద్ధులకు & Paying Guest కు అతి తక్కువ ధరలో Singles Sharing Rooms తో ఇంటి భోజనం కలదు. Ph: 7794030847/ 9703893158 [H-776396]

TAILORING

■ టైలర్లు కావలెను మణికొండ లోని ప్రఖ్యాత బొటిక్యూల్ ట్రస్ట్ లో అర్జెంటుగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ ట్రైనింగ్ ఇవ్వడానికి మహిళా టైలర్లు కావలెను. సంప్ర. : 9848507876, 9849900884. [H-793304]

TOURS & TRAVELS

■ గంగా పుష్కరాలు: 30.04.23 నైమి శారణ్యం కాశీ, నేపాల్ ముక్తినాథ్, రో-14, AC బస్సు, ట్రైన్ టోవ., కర్ణాటక 22.02.23 హంపి, గోకర్ణం, హోరనాడ్, ఉడిపి, మైసూరు రో-8, టో వ., బస్సు భాగ్యలక్ష్మి టూర్స్. ఫో.9390817094. [HA-89750]

■ మహర్షియాత్రలు: ఫిబ్రవరిలో కర్ణాటక, 3/4 గుజరాత్ మ.ప్ర.జ్యో.13రో.18క్ష, 18/4 నేపాల్-ముక్తినాథ్, కాశి 14రో.18క్ష, 11/5 & 25/5 & 10/6 చార్ధామ్ యాత్రలు 16రో.18క్ష, శర్మ. ఫోన్. 8019821107 [G-6139]

■ 15/5, 10/5, బద్రి, కేదార్, గంగోత్రి, యమునోత్రి, 14/6 అమర్‌నాథ్, వైష్ణవి, 22/3, 22/4, శ్రీలంక, శాంకరీదేవి ప్రతీ 10 టికెట్ల బుకింగ్‌పై గోల్డ్ కాయిన్ ఫ్రీ. సంప్ర॥ 8121682275/9849747093 [H-792649]

■ సాయి టూర్స్: రామేశ్వరం, కన్యాకుమారి Jan-21, గుజరాత్ సోమనాథ్, ఉజ్జయిని Feb-8, Mar-8 కర్ణాటక, ఉడిపి, గోకర్ణం, శృంగేరి Feb-19, మహారాష్ట్ర అష్టవినాయకులు, షిర్డీ Mar-16 ఫోన్. 9849884891. [H-793253]

■ S.V. టూర్స్ & ట్రావెల్స్ తమిళనాడు ఫిబ్రవరి - 6th, చార్‌ధామ్ - 14th, నేపాల్ మార్చి - 10th, కాశీ 9 ఏప్రిల్ మార్చి - 25th సంప్రదించండి. ఫోన్ : 9030123243, 7386579123 [H-796786]

■ శ్రీ విష్ణుప్రియటూర్స్ ఒడిస్సా 7మార్చి, నేపాల్ ఏప్రిల్ 27, చార్‌ధాం మే 15, తమిళనాడు, కర్ణాటక, శ్రీలంక, సింగపూర్, మలేషియా గుజరాత్ కలవు. Ph: 9908116171 [H-786761]

VAASTU

■ యూ ప్యాకేజ్ ద్వారా వాస్తు చేస్ చేసి ప్రతి ఇంటిని, కంపెనీ, నష్టాలను లక్ష్మీ నిలయంగా మార్చబడును. విద్య, ఉద్యోగం, వ్యాపారం, సంతానలోపం, వివాహం. సమస్యలకు వెంటనే పరిష్కారం అదృష్టం కలుగు తక్షణం 1001 వచ్చిన వారు మాత్రమే సమస్యలు కలుస్తారు. Ph: 9440396179, 9390892104 [H-792877]

Wanted

■ 10th, ఇంటర్, డిగ్రీ, ITI, డిప్లొమా, BE, B.Tech, MBA: టెలికాలర్స్, కలెక్షన్, డ్రైవర్స్, DTP, పార్ట్నర్స్, ADVT, సేల్స్, రిపోర్టర్స్, సూపర్వైజర్స్, హెల్పర్స్. జీతం8-18K + హాస్టల్. @ 9505288777 [HA-20481]

■ 24 గం. "ఇండ్లోనే ఉంటూ ఇంటి, వంట, బేబీ కేర్, పేషెంట్ కేర్, సపోర్టింగ్ చేయుటకు అర్జెంటుగా 18-45 సం॥ స్త్రీలు కావలెను. ఆకర్షణీయ జీతం: 18-18వేలు ఫ్రీ భోజనం+రూం. Ph: 93981 65519 [H-787427]

■ కూకట్‌పల్లిKPHB, JNTU ఏరియాలో హౌస్‌కీపింగ్ పనిచేయుటకు లేడీస్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ డ్యూటీ, 4 వీక్ ఆఫ్స్, ESI + PF + మంచి జీతం సంప్ర॥ 9000888154/9032153413 [H-790808]

■ మెస్‌లో పనిచేయుటకు సప్లయర్స్ కావలెను మరియు వంట చేయుటకు వంట మాస్టర్ కావలెను మంచి జీతం+వసతి సౌకర్యం. ఫోన్ 9848454499/8367879977 [H-792786]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ M/F నాంపల్లి, కూకట్‌పల్లి, పటాన్‌చెరు మరియు మహేశ్వరం ఏరియాలకు కావలెను సంప్రదించండి: 7675830044/9154382329 [H-793361]

■ అర్జెంటుగా జంట నగరాల నలువైపుల ప్రాంతాలలో పని చేయుటకు RTC కార్గో పొలిట్స్ పై ఆటీఎన్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను, మంచి జీతం, వసతి కలదు. ఫోన్:040-66666664, 9392663777, 9502726839, 8249663777. [HA-1326]

■ మ్యారేజ్‌బ్యూరో లో పనిచేయుటకు టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను, జీతం: 10,000 to 20,000వేలు, చదువు : SSC to PG ఫోన్ : 7396369819, హైదరాబాద్. [H-792999]

■ గండిమైసమ్మ SR రెడ్డి హాస్టల్ లో పనిచేయుటకు వంట మాస్టర్లు మరియు పై పనిచేయుటకు అనుభవం ఉన్న వారు కావలెను. సంప్ర : 9618012831. [H-796792]

■ రోజు 3గం.లు మీ ఏరియాలో బైక్ పై ప్రపంచ ఆరోగ్యమైన రెడీ టు ఈట్ & కుక్ ప్రొడక్ట్స్‌ను సేల్స్ చేయగల స్త్రీ/పు. కావాలి. రోజు ఆదాయం. మిస్‌కాల్. ఫోన్ : 9494949937/24 [H-793258]

■ ప్రైవేట్ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 7569955551/ 9848571888 [H-796823]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (1owerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవరు-3, హెల్పర్స్-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ @ 90300 44646 [B-1224211]

■ ఒక పద్ధైన రోజువారి ఆదాయ అవకాశం. కేవలం అతి తక్కువ పెట్టుబడితో ఒక మంచి ప్రయత్నం ఇప్పుడే ప్రారంభించండి. Dont Miss. సంప్ర॥ 7793987988 [G-776147]

■ నిరుద్యోగులకు శుభవార్త Hyd ఓల్డేజ్ హోమ్ & హోమ్ కేర్ నందు పనిచేయుటకు యువతీ/యువకులు కావలెను వ: 18-40 Yrs, M/F 10th- డిగ్రీ Pass/Fail తీసుకోబడును. ANM/GNM/ నర్సులు కావలెను. M/F ఉచిత శిక్షణ, వసతి, భోజనం, జీతం-18k to 38k ఫోన్ : 9515750389, 9180960943. [H-776381]

■ శ్రీమంతుల ఇళ్ళల్లో, ఇంటి పని, వంట పని, పిల్లలను & పెద్దవారిని పేషెంట్‌ని చూసుకొనుటకు స్త్రీలు/పురుషులు కావలెను. జీ. 18000/- సంప్ర: 8885347730, 8367845952. [H-792612]

■ ఇంటి దగ్గర ఉంటు మా ఇన్వెస్ట్‌మెంట్ బిజినెస్ కి సంబంధించిన కాల్స్ మాట్లాడానికి ఫిమేల్ స్టాఫ్ అ॥ కావలెను. కమీషన్+ బోనస్+జీతం. ఇంట్రెస్ట్ గా ఉన్న వారు డీటెయిల్స్ వాట్సాప్ చేయగలరు 6281159171. [HA-29784]

■ సిద్ధి సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, బార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

■ ఆఫీసులో పనిచేయుటకు డిగ్రీ చదివి కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన వ: 25-45 లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. మంచి జీతం. విద్యానగర్. ఫోన్ : 9148512342, 8309152334. [H-792731]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. పంజాగుట్టలో 12గం॥, జీ.12 వేలు + రూం + ఫుడ్ ఫ్రీ. అమీర్‌పేట, బేగంపేటలో 12 గం॥ జీ. 13 వేలు & చర్లపల్లిలో 12 గం॥ జీ.12 వేలు. ఫోన్.7032088797, 9949830907 [H-793305]

■ హాస్టల్‌లో ఉండి ఆడ పిల్లలను చూసు కొనుటకు డిగ్రీ అర్హత కలిగిన (F) అసిస్టెంట్ మేనేజర్ కావలెను. భోజనం+వసతి కలదు. సంప్ర : 7396072695, 9553248717. [H-779946]

■ ప్రముఖ R.E కంపెనీ (బంజారాహిల్స్)కి టెలీకాలర్స్, మార్కెటింగ్ సిబ్బంది & సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్స్ కావలెను. చిరు నిరుద్యోగులు, రిటైర్డ్ ఫుల్/పార్ట్ సాలరీ/కమీషన్+Inc ఫోన్. 9440190279, 8919735040. [HA-8967]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776080]

■ టిఫిన్ సెంటర్ లో పనిచేయుటకు ప్యాకింగ్ బాయ్స్, స్టాల్ & కిచెన్ సూపర్వైజర్స్, టీ & దోశ & టిఫిన్ మాస్టర్స్ కావలెను. జీతం+భోజన వసతి కలదు. ఫోన్ : 9666934949, 9573446770 [H-779948]

■ అమెరికా వీసా కలిగి 45నుండి 58సం. వయస్సు ఇంటిపని, వంటపని & రెస్టారెంట్లో పనిచేయుటకు/బాబును చూసుకొనుటకు నాని (Nany) కావలెను. ఫోన్ : 9054003456. [H-792973]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376 [H-792806]

■ జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-10017]

■ 20 సం॥లోపు, యువకులు హెల్పర్స్, (హౌస్ కీపింగ్, ఎలక్ట్రికల్, కార్పెంటరీ) గా కావలెను (SSC 9000/-PM) దిల్‌సుక్ నగర్, Hyd ఫోన్ : 9000779833 [HA-26 86K]

■ రెవెన్యూ పనుల కోసం రిటైర్డ్ మండల రెవెన్యూ అధికారి (M.R.O.) కావాలి. దయచేసి సంప్రదించండి. 76718 86273 [V-8616]

■ Wanted Male field Executives, Work at Dilsukhnagar, Salary: 15k to 30k, Time: 10 am to 6 pm. Phone: 7989951712. [H-793260]

■ Experienced Supervisors required for supervising the Civilworks. Call: 8790508663, 8309990544. [HA-8441]

■ Wanted Female Baby Sitter Age 25 to 40 years, At Kokapet Contact: 8886023344. [H-786790]

■ Wanted Diploma ITI/Degree having passion for sales @ Hyderabad with 2 Wheeler, Fresh/ One Year Exp. Industrial, Engineering products for a Leading Co @ Ranigunj Sec-bad. Ph: 9949243077, 9849096655, 9490832047 [H-786791]

■ Wanted Photoshop Designers & Flexi Machine Operators, Good Salary, HMT Road, Chintal, Hyd. Ph: 7399689999. [H-788822]

■ Autocad Design Engineer M/F with min 1-2 year's Exp. for Electrical & Mechanical Systems, Contact No.: 9100062887. [H-792730]

FACULTY TEACHERS

■ రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్‌లో ఉంటూ పనిచేయుటకు ఫ్రెష్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ట్యూటర్స్ కమ్ వార్డెన్ కావలెను, జీతం+ భోజనం+ వసతి @ హయత్‌నగర్. ఫోన్.8790998430. [H-786786]

■ AarNi's Nest Preschool @ Mokila (Quality Education Researched Curriculum) Hiring passionate teachers (female) Fluent in English, Vibrant Nature & 0-5 years Experience, Contact : 8790622511. Email: aarnisnest@gmail.com [HA-2912]

■ Require Teachers for Nursery to III Classes, Telugu Teachers for High School. Tutors from 3:30 Pm - 6:30 Pm. Contact St. Philips High School, Kingkoti. 9908490208, 9160040044 [HA-916]

■ A Reputed School in L.B. Nagar, Primary/Upper Primary/ High School, Requires all Subject Teachers & Non-Teaching Staff. Contact : 7569610434 [HA-878]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మూడున్నర నెలల పాటు సహజీవనం చేసి ముఖం చాటేసిన హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా, చెన్నూరుకు చెందిన యువతి(30)కి 2019లో హఫీజ్‌పేట్‌కు చెందిన వృత్తుల కోటి భాను తేజతో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఆమె భాను తేజతో యూసుఫ్‌గూడలోని ఎల్ఎన్‌నగర్‌లో సహజీవనం చేయసాగింది. హెచ్‌డీఎఫ్‌సీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న భాను తేజ ఆమె నుంచి రూ.1.50 లక్షలు తీసుకుని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. గతేడాది నవంబర్‌లో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా ఆమె మొబైల్ నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాడు. ప్రేమ పేరుతో తనను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు భాను తేజను అరెస్ట్ చేశారు.

నిలువు దోపిడీ

- ఫైనాన్షియర్‌ల కాసుల వేటలో ఆటోవాలాలు
- రూ.2.25 లక్షల ఆటో ధర ఏకంగా రూ.4.75 లక్షలకు విక్రయం
- పర్మిట్‌లపైనే భారీగా వసూళ్లు
- పాత ఆటోల స్క్రాప్ నిలిపివేయడంతో గందరగోళం
- ఆర్టీఏ అధికారులపై తీవ్ర ఒత్తిడి
- పర్మిట్‌లపై ఆంక్షల ఎత్తివేత దిశగా ప్రభుత్వం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌కు కేవలం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న భువనగిరిలో కొత్త ఆటో ఖరీదు సుమారు రూ.2.25 లక్షలు. అదే ఆటో హైదరాబాద్‌లో కొనుగోలు చేయాలంటే సుమారు రూ.4.76 లక్షల వరకు చెల్లించాలి. నిరుపేద ఆటోవాలాలపైన కొందరు ఫైనాన్షియర్లు సాగిస్తున్న నిలువుదోపిడీ ఇది. గ్రేటర్‌లో వాహన కాలుష్యాన్ని దృష్టిలో కాలం చెల్లిన పాత ఆటోల స్థానంలో మాత్రమే కొత్తవి కొనుగోలు చేసేందుకు అనుమతినిస్తుంది. నగరంలో సుమారు 80 వేల పర్మిట్‌లను తమ గుప్పిట్లో పెట్టుకున్న ఫైనాన్షియర్లు ఒక్కో పర్మిట్‌ను ఏకంగా సుమారు రూ.2.20 లక్షల వరకు విక్రయిస్తున్నారు. దీంతో పాత పర్మిట్‌పైన ఒక కొత్త ఆటో కొనుగోలు చేయాలంటే ఏకంగా రూ.4.76 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. పాత ఆటోలను తుక్కుగా చేసే ప్రక్రియను రవాణాశాఖ కొద్ది రోజుల క్రితం నిలిపివేయడంతో ఫైనాన్షియర్ల అక్రమవ్యాపార సామ్రాజ్యంలో ప్రకంపనలు మొదలయ్యాయి.

ఏమిటీ పర్మిట్‌లు...

సాధారణంగా ఆటోడ్రైవర్‌లు పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లించి ఆటోలు కొనుగోలు చేయలేక ఫైనాన్షియర్‌లను ఆశ్రయిస్తారు. కొంత మొత్తాన్ని చెల్లించి మిగతా డబ్బు వాయిదాల రూపంలో చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంటారు. కానీ ఫైనాన్షియర్లు విధించే చక్రవడ్డీ కారణంగా 80 శాతం డ్రైవర్లు అప్పు చెల్లించలేక చేతులెత్తేస్తారు. దీంతో ఫైనాన్షియర్‌లు సదరు ఆటోను జప్తు చేసి మరొకరికి విక్రయిస్తారు. ఇలా ఆటోరిక్షా కాలపరిమితి పూర్తయ్యేవరకు చేతులు మారుతూనే ఉంటుంది. ఆటో యాజమాన్యం మాత్రం ఫైనాన్షియర్ పేరిట నమోదై ఉంటుంది. ఇలా కాలపరిమితి ముగిసినవి లేదా బాగా పాతబడిపోయిన ఆటోలను తుక్కుగా మార్చితే వాటి అనుమతి పత్రాలపైన మరో కొత్త ఆటోకు ప్రొసీడింగ్స్ ఇస్తారు. పాత పర్మిట్‌ల పేరిట సాగిస్తున్న ఈ అక్రమ దందాలో సామాన్య ఆటో డ్రైవర్లు సమిధలుగా మారుతున్నారు.


తూతుమంత్రంగా తుక్కు...

మరోవైపు పాత ఆటోలను తుక్కుగా మార్చే ప్రక్రియ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంది. దీంతో కొన్నింటిని తుక్కుగా మార్చకుండానే స్క్రాప్ చేసినట్లు ఏవో కొన్ని విడిభాగాలను ఆర్టీఏ అధికారుల ముందు పెట్టి కొత్తవాటికి ప్రొసీడింగ్స్ తీసుకుంటున్నట్లు ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు ఆటోరిక్షాల స్క్రాప్ ప్రక్రియను నిలిపివేశారు. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నూతన స్క్రాప్ పాలసీకి అనుగుణంగా ఈ ప్రక్రియను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఫైనాన్షియర్ల అక్రమ దందాకు తాత్కాలికంగా తెరపడింది. ఈ క్రమంలో స్క్రాప్ ప్రక్రియను పునరుద్ధరించాలని కోరుతూ కొందరు ఫైనాన్షియర్లు వివిధ రూపాల్లో రవాణాశాఖ అధికారులపై ఒత్తిడిని తీవ్రతరం చేయడం గమనార్హం.

పర్మిట్‌లపైన ఆంక్షల ఎత్తివేత దిశగా...

ఇలా ఉండగా, పర్మిట్‌లపైన ఆంక్షలను ఎత్తివేసే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేపట్టినట్లు సమాచారం. కొత్త ఆటోరిక్షాలపైన నిషేధించడం వల్లనే పాత పర్మిట్‌లపైన కొందరు ఫైనాన్షియర్లు భారీ ఎత్తున అక్రమార్జనకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచనలో పడ్డట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న జేఏసీ బృందం

సుల్తాన్‌బజార్: అర్చకుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన 2023 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు బద్రీనాథ్‌చార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కందూరి కృష్ణమాచారి, రాజేశ్వర్‌శర్మ బృందం మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం ఉపేంద్రశర్మ మాట్లాడుతూ, తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ అర్చకుల సంక్షేమం న్యాయమైన డిమాండ్లపై పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అర్చకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుండడం స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, మహేష్‌శర్మ పాల్గొన్నారు.

మరో వ్యాపారికి రూ.1.50 కోట్లు టోపీ

- వెలుగులోకి వస్తున్న చంద్రదాస్ లీలలు
- ఆరు నెలలుగా శ్రీదుర్గా జ్యువెలరీస్, అతిక్ జ్యువెలరీస్ మధ్య లావాదేవీలు
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

హిమాయత్‌నగర్: బంగారు, వజ్రాలతో ఉడాయించిన గణేష్ చంద్రదాస్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బషీర్‌బాగ్‌కు చెందిన శ్రీయాస్ జ్యువెలరీస్ భాగస్వామి ఆనంద్‌కుమార్ అగర్వాల్ ఫిర్యాదుతో నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలియడంతో మరికొందరు బంగారు వ్యాపారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి నారాయణగూడకు చెందిన 'శ్రీ దుర్గా జెమ్స్ అండ్ జ్యువెలరీస్' షాప్ యజమాని రోహిత్‌కుమార్ గుప్తా నారాయణగూడ పోలీసులను ఆశ్రయించాడు. తాము గణేష్ చంద్ర దాస్‌కు రూ.1.50 కోట్ల విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలను ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో నారాయణగూడ పోలీసులు అతిక్ జ్యువెలరీస్ అధినేత గణేష్ చంద్రదాస్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఆరునెలల క్రితం రోహిత్‌కుమార్ గుప్తా పలు డిజైన్‌లు తయారు చేయాలంటూ గణేష్ చంద్ర దాస్‌కు రూ.2 కోట్ల విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలను అప్పగించాడు. గడువులోగా కొన్ని డిజైన్‌లు రూపొందించి రోహిత్ గుప్తాకు అప్పగించాడు. ఈనెల 1 నుంచి రోహిత్‌గుప్తా ఫోన్ చేసినా గణేష్ చంద్రదాస్ స్పందించడం లేదు. అదే సమయంలోనే శ్రీయాష్ జ్యువెలరీస్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రోహిత్‌గుప్తా సైతం పోలీసులను ఆశ్రయించాడు. తనకు గణేష్ చంద్ర దాస్ నుంచి రూ.1.50 కోట్ల విలువైన 1,900 గ్రాముల బంగారం, వజ్రాల ఆభరణాలు రావాల్సి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరికొందరు బాధితులు నారాయణగూడ పీఎస్‌కు క్యూ కట్టే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఐసీసీసీలో ప్రొబేషనరీ ఐపీఎస్‌లు



సాక్షి, సిటీబ్యూరో: శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 195 మంది ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు శనివారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీని సందర్శించారు. అక్కడ వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఇతర హంగులను కొత్వాల్ సీపీ ఆనంద్ వారికి వివరించారు. ముఖ్యమంత్రి మానసపుత్రికగా అవతరించిన ఈ ఐసీసీసీ నేరాల నిరోధం, కేసులు కొలిక్కి తీసుకురావడం, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో అన్ని విభాగాలకు ఉపయుక్తంగా ఉంటుందని ఆనంద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ ఆనంద్ ప్రొబేషనరీ ఐపీఎస్‌లకు ఆపరేషన్ రోప్, హెచ్-న్యూ, స్మాష్, భరోసా కేంద్రం తదితరాలకు సంబంధించిన కీలకాంశాలను వివరించారు.

28 నుంచి నోవాటెల్‌లో సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సూత్ర వెడ్డింగ్ సీజన్ ప్రీమియం ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ప్రదర్శన బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని ఎస్‌డీఎం గ్రాండ్ హోటల్‌లో శనివారం జరిగింది. ఇందులో ప్రదర్శించబోయే ఉత్పత్తులను మోడల్స్ ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వివాహాల సీజన్‌ను పురస్కరించుకుని వధూవరుల కోసం ప్రత్యేకంగా వెడ్డింగ్, బ్రైడల్ కలెక్షన్లను తీసుకొస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాత డిజైనర్లు తమ అరుదైన డిజైనరీ దుస్తులు, ఆభరణాలతో ఆకట్టుకోనున్నారని వారు పేర్కొన్నారు.

రేపు 'భారత్ మాత మహా హారతి'



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి


కాచిగూడ: భారత్ మాత మహా హారతి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నెక్లెస్‌రోడ్డులో నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ మాత మహా హారతి కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత కొన్నేళ్లుగా భారత్ మాత మహా హారతి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు, ప్రకాష్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టు డే లాస్ట్ డే ఫర్ మీ

తల్లితో ఫోన్‌లో మాట్లాడుతూనే హాస్టల్ భవనంపై నుంచి దూకి ఇఫ్లూ విద్యార్థిని ఆత్మహత్య



అంజలి (ఫైల్)



అంజలి మృతదేహం

లాలాపేట: హాస్టల్ భవనంపై నుంచి పడి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హర్యానా రాష్ట్రానికి చెందిన అంజలి(22) ఓయూ సమీపంలోని ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఎంఏ ఇంగ్లీషు సెకండ్ ఇయర్ చదువుతూ మహాలకుండా గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది. అంజలి తల్లిదండ్రులు ఎప్పుడూ గొడవ పడుతూ ఉండేవారు. వారిని సమాధాయించే క్రమంలో శుక్రవారం రాత్రి తాను ఉంటున్న హాస్టల్ నాల్గో అంతస్తులో సెల్‌ఫోన్‌లో తల్లితో మాట్లాడుతూనే 'టు డే లాస్ట్ డే ఫర్ మీ' అంటూ చెప్పి కిటికీలోంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడిన అంజలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను కిడ్నాప్ చేసిన భర్త

భార్య దూరమైందంటూ ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్: స్నేహితుడితో కలిసి భార్యను కిడ్నాప్ చేసిన భర్తపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం, మాచర్ల గ్రామానికి చెందిన యువతి(22)కి గతేడాది జూన్ 17న డి. కిరణ్‌తో వివాహం జరిగింది. పెళ్లి జరిగిన మర్నాటి నుంచే బాధితురాలికి భర్త అత్త, మామల నుంచి వరకట్న వేధింపులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీలోని తన పుట్టింటికి వచ్చింది. ఈ నెల 20న ఉదయం ఆమె భర్త కిరణ్ స్నేహితుడితో కలిసి కారులో దుర్గా భవానీనగర్‌కు వచ్చి బాధితురాలిని బలవంతంగా ఎక్కించుకుని నాగర్‌కర్నూల్ వైపు తీసుకెళ్తుండగా ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. అప్పటికే అప్రమత్తమైన తల్లిదండ్రులు కారును అడ్డగించి బాధితురాలిని క్షేమంగా ఇంటికి చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిరణ్‌పై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా తన భార్యను తనకు దూరం చేస్తున్నారని భార్య లేనిదే జీవితం వృథా అంటూ కిరణ్ హైదరాబాద్‌కు వస్తూనే మార్గమధ్యంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మలక్‌పేట్ యశోదా ఆస్పత్రికి తరలించారు. కిరణ్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు వైద్యులు తెలిపారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టాస్క్ పేరిట వల

- సామాజిక మాధ్యమాలలో ఆదాయం పేరిట మెసేజ్‌లు..
- పెట్టుబడికి రెట్టింపు లాభాలొస్తాయని వల
- గృహిణులు, ఐటీ ఉద్యోగులే లక్ష్యం



సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పరిధిలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ ఐటీ ఉద్యోగి. కరోనా కారణంగా మొదలైన మూన్‌లైటింగ్‌తో ఒకే సమయంలో రెండేసి ఉద్యోగాలు చేస్తున్నాడు. నెల తిరగ్గానే డబుల్ వేతనం వస్తున్నా.. అతనిలో ఆశ్యాశ తగ్గలేదు. ఓ రోజు తన సెల్‌ఫోన్‌కు టాస్క్ పూర్తి చేస్తే పెట్టిన పెట్టుబడికి రెండింతల లాభం వస్తుందని ఓ సందేశం వచ్చింది. అంతే వెంటనే ఆ మెసేజ్‌లోని లింక్‌ను క్లిక్ చేయగానే టెలిగ్రాం గ్రూప్‌లోకి ఎంటరయ్యాడు. అప్పటికే ఆ గ్రూప్‌లో ఉన్న కొందరు సభ్యులు తాము పెట్టిన పెట్టుబడికి మంచి లాభాలు వస్తున్నాయంటూ మెసేజ్‌లు పెట్టడం చూసి తనకూ ఆశ పుట్టింది. ఇంకేముంది ఇన్వెస్ట్‌మెంట్స్ మొదలు పెట్టాడు.. రెండ్రోజులు తిరక్కుండానే తన ఖాతాలోని రూ.61 లక్షలు సమర్పించుకున్నాడు. తీరా చూస్తే మోసపోయానని గ్రహించి రాచకొండ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. కొందరికి చెవికెక్కడం లేదు. తొందరపాటు, అత్యాశ కారణంగా సైబర్ నేరస్తుల చేతిలో నిలువెల్లా మోసపోయి లబోదిబోమంటున్నారు. అందివచ్చే ప్రతీ ఒక్క అవకాశాన్ని సైబర్ నేరస్తులు వంద శాతం వినియోగించుకుంటున్నారు.

రివ్యూలు రాయాలంటూ...

యూట్యూబ్ లైక్‌లు, షేర్లు చేయాలని, సినిమాలకు రివ్యూలు రాయాలంటూ రకరకాలుగా సైబర్ నేరస్తులు టాస్క్‌లు ఇస్తారు. అవి చేస్తే మీరు రూ.వెయ్యి పెట్టుబడి పెడితే రూ.500 కమీషన్‌తో రూ.1,500 మీ ఖాతాలో జమ అవుతాయని చెబుతారు. తొలుత బాధితులను నమ్మించేందుకు ఒకట్రెండు సందర్భాలలో కమీషన్ తంచనుగా వేస్తారు. ఎప్పుడైతే మీరు లక్షల్లో పెట్టుబడి పెడతారో అప్పుడిక కమీషన్ వేయరు. ఒకవేళ వేసినా ఆయా నగదును ఉపసంహరించుకోలేరు. కేవలం స్క్రీన్ మీద మీ ఖాతాలో డబ్బు ఉన్నట్లు కనిపిస్తుందంతే. వాటిని డ్రా చేసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆదాయ పన్ను, జీఎస్టీ కట్టాలంటూ నమ్మించి సైబర్ నేరస్తులు పనికానిచ్చేసి కామ్‌గా మాయమైపోతారు.

లాగిన్ అయ్యారో అంతే..



సైబర్ నేరస్తులు పంపించే మెసేజ్‌లలోని లింక్‌లను క్లిక్ చేసి మన వ్యక్తిగత వివరాలతో లాగిన్ అవగానే ఆయా వివరాలన్నీ సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. టాస్క్‌లతో వచ్చిన మన ఖాతాలోని డబ్బును ఉపసంహరించుకునే అవకాశం లేకుండా పన్నులు కట్టాలంటూ మోసం చేస్తుంటారు. ఇలా టాస్క్ పేరిట బాధితులను మోసం చేస్తున్న కేసులు ఈమధ్య కాలంలో పెరుగుతున్నాయి

– జే నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ సైబర్‌క్రైమ్, రాచకొండ

సిటీ కళాశాల విద్యార్థులు లేని రంగమే లేదు

కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్



ముగింపు సదస్సులో మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్

చార్మినార్: పూర్వ విద్యార్థులనగానే కేవలం ఆర్థిక కోణంలోనే చూడకుండా విద్యార్థుల్లో జ్ఞాన వనరులను అభివృద్ధి చేసే విధంగా వారి నుండి సేవలను అందుకోవాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ అన్నారు. కళాశాల అల్యూమినీ కమిటీ, ఐక్యూఏసీ సంయుక్తంగా 'నూతన విద్యా విధానం 2020–ఉన్నత విద్యా సంస్థలలో స్థిరమైన శ్రేష్ఠత సాధనలో పూర్వ విద్యార్థుల పాత్ర–అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకులుగా, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కౌన్సిలర్లుగా దోహదపడాలన్నారు. పూర్వ విద్యార్థులకు తాము చదువుకున్న కళాశాలతో భావోద్వేగమైన అనుబంధంతో పాటు కొత్త తరం విద్యార్థులకు ఎదుగుదలకు చేయూతనందించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన పూర్వ విద్యార్థులను గౌరవ అధ్యాపకులుగా నియమించి తద్వారా విద్యార్థుల్లో బోధన, పరిశోధనల్లో ఆసక్తి కలిగించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. గతంలో దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎక్కువగా విదేశాలకు వెళ్లాలనే మోజు ఉండేదని... ప్రస్తుతం మాత్రం విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా రూపొందించి పలువురికి ఉపాధి కల్పించాలని భావిస్తున్నారన్నారు. పీహెచ్‌డీ వంటి విద్యార్హతలతో సంబంధం లేకుండా వ్యక్తిగతమైన ప్రావీణ్యం ప్రాతిపదికన సమాజంలోని వివిధ రంగాల్లోని నిష్ణాతులను విద్యా సంస్థలలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసెస్‌గా నియమించాలన్నారు. దేశ, విదేశాల్లో సిటీ కళాశాల విద్యార్థులు లేని రంగమే లేదన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, సినీనటుడు తీరువీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జె.నీరజా పాల్గొన్నారు.

కల్లపూల దడి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చందర్, అల్లం నారాయణ, జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పుడమి సాహితీవేదిక ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత్రి తుమ్మల కల్పనారెడ్డి రచించిన కల్లపూల దడి పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కె.చందర్ మాట్లాడుతూ..సమాజంలోని నేటి పరిస్థితులను రచయిత్రి అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రచించారని కొనియాడారు. తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. చిన్న చిన్న వస్తువులను ప్రామాణికంగా తీసుకుని ఎన్నో అద్భుతమైన రచనలు చేయడం ప్రశంసనీయమన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. నేటితరాన్ని కవిత్వం, రచనలలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయిత్రి నాగేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ



ఆల్‌మేవా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

సిటీబ్యూరో: తెలంగాణ ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, కేలెండర్‌ను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. శనివారం మంత్రుల నివాస సముదాయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమానికి, ఉర్దూ భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారూఖ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వహీద్ షా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

జోమా...హంగామా...



సిటీబ్యూరో: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన ఫుడ్ కార్నివాల్‌ను జోమో ల్యాండ్‌ను శనివారం సందడిగా ప్రారంభించింది. శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎరీనాలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి భోజన, వినోద ప్రియులు భారీగా హాజరయ్యారు. అంతర్జాతీయంగా పేరొందిన ఫుడ్ బ్రాండ్స్‌తో పాటు నగరానికి చెందిన 60పైగా రెస్టారెంట్స్ ఈ విందు వినోదాల సందడిలో పాల్గొన్నాయి. ఆటలు, పాటలు తదితర వినోద కార్యక్రమాల కోసం తరలివచ్చిన కళాకారుల్లో కింగ్, అనువ్ జైన్, జైడెన్, రాహుల్ దువా, గౌరవ్ కపూర్, ది ఎల్లో డైరీ, దీక్షాత్‌తో సహా జాతీయ స్థాయిలో పేరొందిన టాప్ ఆర్టిస్టులు అలరిస్తున్నారు. వీరి ప్రదర్శనలు వరుసగా జరుగుతూ అతిథుల్ని అలరిస్తున్నాయి. ఈ ఈవెంట్ 2 రోజుల పాటు కొనసాగుతుంది


ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



సతీష్(ఫైల్)

సికింద్రాబాద్: కళాశాలకు డుమ్మా కొట్టిన విషయం తల్లిదండ్రులకు తెలియడంతో మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బొల్లారం దొబీబజార్‌కు చెందిన కే.సుభాష్ కుమారుడు సతీష్(20) అల్వాల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 10 రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లి కళాశాలకు వెళ్లడం లేదు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తల్లిదండ్రులు సతీష్‌కు నచ్చజెప్పి కళాశాలకు పంపించే ప్రయత్నం చేశారు. కళాశాలకు వెళ్తున్నానని చెప్పి కొంత డబ్బు తీసుకుని నేరుగా అల్వాల్–బొల్లారం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాల వద్దకు చేరుకున్నాడు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు.

ఉద్యమకారులతో కూడిన స్మృతివనం ఏర్పాటుకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాధకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న అమరవీరుల స్థూపానికి పూజ కూడా చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రవీంద్రభారతిలో 1969 తెలంగాణ ఉద్యమకారుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సాధనలో తుది దశ, మలిదశ ఉద్యమ అమరవీరుల స్మృతివనం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. నాటి ఉద్యమకారులను గుర్తించి వారికి పెన్షన్ అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ్యులు రఘునందన్‌రావు మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ సమావేశాలలో 1969 ఉద్యమకారుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1969 ఉద్యమకారుల రాష్ట్ర సమితి సలహాదారులు, మాజీ మంత్రి మందిరేని కిషన్‌రావు రాష్ట్ర అధ్యక్షుడు చక్రధరహరి రామరాజు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నాంపల్లి: ఫిబ్రవరి 11న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో జ్యుడిషియల్ ఆఫీసర్లు, అడ్వకేట్స్, రెప్రజెంటేటివ్స్ ఆఫ్ బ్యాంక్ ఆఫీషియల్స్, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్, పోలీసులతో సమావేశమైన ఆయన ప్రసంగించారు. బ్యాంక్ ఆఫీషియల్స్‌కి, పార్టీలకు నోటీసులు జారీ చేసి, అధిక సంఖ్యలో ఎన్.ఐ యాక్టు, చెక్ బౌన్స్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పూర్తయ్యేలా చూడాలని కోరారు. అలాగే కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మాట్రిమోనియల్ కేసులు(కుటుంబ తగాదాలు) రాజీ కుదిర్చేలా చూడాలని చెప్పారు. ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీకుశ, చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దుర్గా ప్రసాద్, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

నాగోలు: దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నాగోల్‌లోని దివ్యాంగుల భవన్‌లో చైర్మన్ గంగారం అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి –సంక్షేమానికి అనేక చట్టాలు రూపొందించినప్పటికి అవి అమలులో నోచుకోవడం లేదు అన్నారు. దివ్యాంగుల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి అనేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 5 శాతం ఉద్యోగాలను డైరెక్ట్‌గా ఇంటర్వ్యూ–రాత పరీక్ష లేకుండా భర్తీ చేయాలని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆయా శాఖ అధిపతులు అమలు చేయడం లేదు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ కృష్ణ, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, కవిత, షేర్ బాషా, కనకరాజు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులతో వైరల్ ఇన్ఫెక్షన్లు

నగరంలో పెరుగుతున్న స్టమక్ ఫ్లూ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఆసుపత్రుల్లో ఫ్లూ, వైరల్ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరుగుతున్నాయి. దాదాపు 50–60 శాతం మంది రోగులు చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆసుపత్రుల రికార్డులు చెబుతున్నాయి.డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, తీవ్రమైన నీరసంతో ఆసుపత్రులకు రోగులు సందర్శిస్తున్నారు. వీరిలో దాదాపు 30–40 శాతం మంది గొంతు, మూత్రం, ఊపిరితిత్తులు ఉదరంలో బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారు. ప్రస్తుత వైరల్ ఫీవర్ వ్యాప్తికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులే కారణమని వైద్యులు అంటున్నారు. గత రెండు వారాలుగా తరచూ నగరంలో పగటిపూట చుర్రుమనిపించేలా ఎండ, వెచ్చని పరిస్థితులు సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు చల్లని పరిస్థితులు ఉండడంతో వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ ఆకస్మిక మార్పులకు తగినట్టుగా మారే క్రమంలో శరీరంతో రోగనిరోధకత దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల వల్ల సాధారణంగా శీతాకాలపు సమస్యలతో పాటుగా బ్రోన్కియోలిటిస్, స్ట్రెప్ థ్రోట్ లేదా గొంతు నొప్పి స్టమక్ ఫ్లూ కలిగించే రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ ఇన్ఫెక్షన్లు కూడా సిటీలో పెరుగుతున్నాయి


రోజూ 40–50 దాకా...

నగరానికి చెందిన కన్సల్టెంట్ శిశువైద్యుడు, నియోనాటాలజిస్ట్ డాక్టర్ సందీప్ మాట్లాడుతూ, ‘‘ డెంగీ, ముక్కు కారటం, టైఫాయిడ్ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లతో రోజూ దాదాపు 40–50 మంది రోగులు తన దగ్గరకు వస్తున్నారని చెప్పారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో వైరస్ వేగంగా వ్యాప్తి చెందడం వల్ల 70 శాతం అంటువ్యాధులు సంభవిస్తాయని, అయితే, మిగిలిన 30 శాతం జంక్ ఫుడ్ తీసుకోవడం, తక్కువ ద్రవపదార్థాల వినియోగం వల్ల అని ఆయన చెప్పారు. కాబట్టి ఈ సీజన్‌లో జంక్ ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు

జాగ్రత్తలు అవసరం...

సీజనల్ అంటువ్యాధులు సాధారణంగా నాలుగు–ఐదు రోజులలో నయమవుతాయి. అయితే ఈ రకమైన వాతావరణం వల్ల గొంతు, ఊపిరితిత్తులు, మూత్రంలో బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల వ్యాప్తి కనిపిస్తోంది. నగరానికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ సిరి కామత్ మాట్లాడుతూ, 'గత రెండు–మూడు వారాల్లో ఎగువ శ్వాసకోశ దిగువ శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరిగాయి'' అని చెప్పారు. 'దోమ కాటుకు దూరంగా ఉండడం, సామాజిక దూరం పాటించడం, ద్రవాహారం బాగా తీసుకోవడం, పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం, వ్యాయామం ద్వారా రోగనిరోధక శక్తిని కాపాడుకోవడం వంటివి ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు.

లిఫ్టులో ఇరుక్కొని యువకుడు మృతి



షేక్ జుబేర్ మృతదేహం

బషీర్‌బాగ్‌లాల్‌పేట్: లిఫ్టులో ఇరుక్కొని ఓ యువకుడు మరణించిన సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ జీవన్‌రెడ్డి తెలిపిన మేరకు.. బస్సీలాల్‌పేట్ ప్రాంతానికి చెందిన షేక్ జుబేర్(25) లిఫ్టులో ఇరుక్కొని మరణించాడు. మృతుడు కొంత కాలం నుంచి బస్సీలాల్‌పేట్ అరుంధతి కాలనీలో ఉన్న బాలాజీ సింగ్ ఎలక్ట్రికల్స్ గోడౌన్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం లిఫ్టులో ఓ మోటార్‌ను రెండవ అంతస్తు నుంచి కిందికి తీసుకువస్తున్నాడు. అయితే లిఫ్టు ఉన్నట్టుండి ఆగిపోయింది. దీంతో జుబేర్ తలను బయటకు పెట్టి లిఫ్టు ఆగిన సమాచారాన్ని ఇస్తున్నాడు. వెనువెంటనే లిఫ్టు ఆన్ కావడంతో జుబేర్ లిఫ్టులో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలకు గురయ్యాడు. సిబ్బంది వచ్చి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారని ఎస్‌ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. గోడౌన్‌లో సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలించారు. మృతుడి సోదరుడు నదీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

నృత్యం.. సమ్మోహనం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా మాధురి విజయ్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషిక వాహన, నాగేంద్రహారాయ, మహాగణపతిమ్, పలుకే బంగారామాయేనా, ముద్దుగారే యశోద తదితర అంశాలను దక్షిత, బాను, ఆరాధ్య, తన్మయి, ఆరుషి ప్రదర్శించారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



వినోద్‌కుమార్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: అతివేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా దాములూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ (23) తన కుటుంబంతో కలిసి సూరారం కాలనీలో నివాసం ఉంటున్నాడు. బయటకు వెళ్లి వస్తానని తన తల్లికి చెప్పి శుక్రవారం రాత్రి తన స్నేహితులు హేమంత్ కుమార్‌తో కలిసి వాహనంపై బయటకు వెళ్లాడు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న యూ టర్న్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మూసాపేట వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరిరువురూ కింద పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. వినోద్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా హేమంత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించి గాయపడిన బాధితుడిని ఆసుపత్రికి తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రవీందర్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్జిబిషన్ పార్కింగ్‌లో అగ్నిప్రమాదం




గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని పార్కింగ్‌లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీసులు తెలిపిన మేరకు..నుమాయిష్‌ను తిలకించేందుకు వచ్చినటువంటి ఓ కుటుంబం గగన్‌విహార్ వద్ద కారును పార్క్ చేసి వెళ్లారు. కొద్ది సేపటికి కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్నటువంటి మరో మూడు కార్లకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఎంజేమార్కెట్ రోడ్డు, నాంపల్లి స్టేషన్ రోడ్డు, అబిడ్స్, తదితర ప్రాంతాలలోభారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఈ అగ్నిప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను క్లూస్ టీమ్స్ సిబ్బంది పరిశీలించారు.

ఉలిక్కిపడ్డ నగరం...

నుమాయిష్ పార్కింగ్‌లో అగ్నిప్రమాదం జరగడంతో ఒక్కసారిగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదం, గతంలో ఎగ్జిబిషన్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై ప్రజలు చర్చించుకున్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు, అధికారులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



బ్రోచర్ ఆవిష్కరణ

నాంపల్లి: దేశ, విదేశాల్లో పర్యటించే పర్యాటకుల కోసం సదరన్ ట్రావెల్స్ మెగా ఆఫర్లను ప్రకటించింది. ఈ మేరకు శనివారం లక్డీకాపూల్‌లోని సదరన్ ట్రావెల్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సదరన్ హాలిడే మార్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ సదరన్ ట్రావెల్స్ మెగా ఆఫర్లను వెల్లడించారు. కరోనా నేపథ్యంలో గడచిన మూడేళ్లుగా పర్యాటకులకు తీవ్ర ఇబ్బందికరమైన వాతావరణం ఉండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో సదరన్ ట్రావెల్స్ హాలిడే మార్ట్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సదరన్ ట్రావెల్స్ హాలిడే మార్ట్‌ను ఈనెల 28వ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. హాలిడే మార్ట్‌కు వెళ్లలేని ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో తమ స్లాట్స్‌ను బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ రామారావు, జనరల్ మేనేజరు శ్రీనివాసరావు పాల్గొన్నారు

29 నుంచి తెలంగాణ స్టేట్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీ

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 తేదీ నుంచి బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, రంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సమన్వయంతో తెలంగాణ స్టేట్ బాడ్మింటన్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లె శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 13 ఏళ్లలోపు బాలురు, బాలికలు సింగిల్స్ అండ్ డబుల్స్, 15 ఏళ్లలోపు బాలురు, బాలికలు సింగిల్స్ అండ్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 27 తేదీలోగా తమ పేర్లు ఎంట్రీ చేసుకోవాలని ఆయన కోరారు. నేషనల్ బాడ్మింటన్ చీఫ్ కోచ్, బీఏఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్ ప్రారంభిస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 77889 93006 సెల్ నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఎంఎంటీఎస్ స్టేషన్లలో ఆధునిక హంగులు

- హైటెక్‌సిటీ, లింగంపల్లి, హఫీజ్‌పేట్ స్టేషన్‌లు ఎంపిక
- సికింద్రాబాద్ డివిజన్‌లో మొత్తం 20 స్టేషన్ల రీడెవలప్‌మెంట్



సాక్షి, సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లలో అత్యాధునిక హంగులు చేపట్టనున్నారు. నగరంలోని హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్, లింగంపల్లి స్టేషన్‌ల రీడెవలప్‌మెంట్‌కు ప్రణాళికలను సైతం రూపొందించారు. ఆసక్తి గల సంస్థల నుంచి ఇప్పటికే బిడ్‌లను ఆహ్వానించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్రం సికింద్రాబాద్ డివిజన్‌లోని 20 రైల్వేస్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు పలు దూరప్రాంతాల రైళ్లు సైతం రాకపోకలు సాగిస్తున్న లింగంపల్లి, హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్‌లను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో డిజైనింగ్....

రైల్వేస్టేషన్‌ల పునరభివృద్ధి సాధ్యాసాధ్యాలు, డిజైనింగ్, అవసరమైన సాంకేతిక సామర్థ్యం, ఇంజినీరింగ్ అవసరాలు, మాస్టర్‌ప్లాన్‌పైన వివరణాత్మకమైన ప్రణాళికలను రూపొందించేందుకు కన్సల్టెన్సీలను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే పలు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నెల 27వ తేదీన బిడ్‌లను ఓపెన్ చేయనున్నారు. ఆయా సంస్థల నుంచి అందిన ప్రతిపాదనలకు అనుగుణంగా రైల్వేస్టేషన్ల పునరభివృద్ధికి రీడిజైనింగ్ నమూనాను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నగరంలో రెండు మార్గాల్లో ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలక్‌నుమా నుంచి సికింద్రాబాద్ మీదుగా లింగంపల్లి వరకు, ఫలక్‌నుమా నుంచి నాంపల్లి మీదుగా లింగంపల్లి వరకు రెండు రూట్‌లలో రోజుకు 78 సర్వీసుల్లో సుమారు లక్ష మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఇవి కాకుండా లింగంపల్లి స్టేషన్ నుంచి కాకినాడ, విజయవాడ, తదితర రూట్‌లకు మరో 5 రైళ్లు నడుస్తున్నాయి. దీంతో లింగంపల్లి, హైటెక్‌సిటీ స్టేషన్‌లకు ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు వివిధ మార్గాలను అనుసంధానం చేయడంలో హఫీజ్‌పేట్ స్టేషన్‌కు కూడా ప్రాధాన్యత ఉంది. దీంతో ఈ మూడు ఎంఎంటీఎస్ స్టేషన్‌లను దశల వారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు.

యాదాద్రి స్టేషన్ రీడెవలప్‌మెంట్...

ఈ పథకంలో భాగంగా యాదాద్రి (రాయగిరి) రైల్వేస్టేషన్‌ను కూడా పునరభివృద్ధి చేయనున్నారు. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా సికింద్రాబాద్ నుంచి రాయగిరి వరకు లైన్‌లను విస్తరించి రైళ్లను నడపాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత బడ్జెట్‌లో ఈ మేరకు కేంద్రం కొన్ని నిధులను కూడా విడుదల చేసింది. కానీ రైల్వేలైన్‌ల విస్తరణకు అవసరమైన భూమి ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి లభించకపోవడంతో జాప్యం నెలకొంది. యాదాద్రి క్షేత్రం అభివృద్ధి చేసిన తరువాత భక్తుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ మార్గంలో ఉన్న రాయగిరి స్టేషన్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

అమృత్ భారత్ స్టేషన్‌లు ఇవే...

కేంద్రం అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో భాగంగా సికింద్రాబాద్ డివిజన్‌లో కరీంనగర్, హైటెక్ సిటీ,హఫీజ్‌పేట్, తాండూరు, వికారాబాద్, పర్లి, లింగంపల్లి, జహీరాబాద్,భద్రాచలం, మధిర, మహబూబాబాద్,వరంగల్,మంచిర్యాల– రామగుండం,పెద్దపల్లి,కాజీపేట్,జనగామ, యాదాద్రి స్టేషన్‌లను గుర్తించింది.

కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు

- తాగి బండి నడపొద్దు.. జీవితాన్ని అంధకారం చేసుకోవద్దు
- యాక్సిడెంట్ చేస్తే మీతో పాటు అవతలి కుటుంబాల్లోనూ విషాదం
- ప్రధానంగా 8 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలు
- 'సాక్షి'తో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు



బంజారాహిల్స్: ''మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే మీ భవిష్యత్ అంధకారం అవుతుంది. మీ కుటుంబంతో పాటు అవతలి వారి కుటుంబాలూ ఆగమవుతాయి. తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించండి''.. అంటూ ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజూ వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో ఇస్తున్న కౌన్సెలింగ్, విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేస్తున్న అవగాహన కార్యక్రమాలు.. వీటి వల్ల వస్తున్న ఫలితాలపై బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్ రాజుతో 'సాక్షి' ముఖాముఖి

గతేడాది 110 మంది పాదచారులు మృతి :

రోడ్డు ప్రమాదాల్లో 2022లో 110 మంది పాదచారులు మృతి చెందారు. ఇందులో 80 శాతం ప్రమాదాలు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ చేసినవే. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన బంజారాహిల్స్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో పీకల దాకా మద్యం తాగి వాహనాలు నడుపుతూ తాము ప్రమాదాలకు కారణమవడమే కాకుండా అవతలి వైపు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చారు.

- డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రమాదాలు జరిగిన తీరును ఆ కుటుంబాల్లో చోటు చేసుకుంటున్న విషాదాన్ని కళ్లకు కడుతున్నాం.
- 45 నిమిషాల పాటు ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుంది. ఒకరిద్దరు తప్పితే వంద శాతం మంది ఈ కౌన్సెలింగ్‌తో పరివర్తన చెందుతుండటంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

ఎనిమిది రకాల ఉల్లంఘనలు :

- నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకుండా, సీట్ బెల్టు పెట్టుకోకుండా, రాంగ్‌సైడ్, సిగ్నల్ జంపింగ్, డ్రంకన్ డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్, మొబైల్ డ్రైవింగ్... ఇలా ఎనిమిది రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు.
- ఇందులో ఎక్కువగా హెల్మెట్ ధరించకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డ వారే అధికంగా ఉంటున్నారు. వీరందికీ కౌన్సెలింగ్ ఇస్తున్నాం.
- ఆయా నిబంధనల ఉల్లంఘనలతో ఎలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయో వివరిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారికి డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాతనే కౌన్సెలింగ్ ఇస్తూ వాహనాలను అప్పగిస్తున్నాం.

రాత్రి పూట సిగ్నల్స్ ఫాలో కావడం లేదు :

- రాత్రి పూట రోడ్లపై, ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులు ఉండరన్న ఉద్దేశంతో వాహనదారులు మితిమీరిన వేగంతో దూసుకెళ్లడమే కాకుండా సిగ్నళ్లను జంపింగ్ చేస్తున్నారు. ఇలా సిగ్నల్ జంప్ చేయడం వల్ల రాత్రిపూట ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- అందుకే ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రాత్రి పూట ఆయా ప్రాంతాల్లో జిగ్‌జాగ్ బారికేడింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కానిస్టేబుల్ నైట్ డ్యూటీలో కూడా ఉంటున్నారు.
- ఉదయం 6-8 గంటల మధ్య స్కూల్ వేళల్లో ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉంటున్నారు. ప్రధాన జంక్షన్లలో నైట్ డ్యూటీలు కూడా చేస్తున్నారు.



జూబ్లీబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న బేగంపేట టీటీఐ సిబ్బంది

స్పీడ్ లిమిట్ 40 కిలో మీటర్లు :

- నగరంలో స్పీడ్ లిమిట్ 40 కిలో మీటర్లు మాత్రమే. అయితే రోడ్లు ఖాళీగా ఉన్నాయి కదా అని చాలా మంది అదుపు తప్పిన వేగంతో దూసుకెళ్తున్నారు. వీరికి ఎప్పటికప్పుడు చలాన్లు పడుతున్నాయనే విషయం గుర్తుంచుకోవాలి.
- పాదచారులు రోడ్డు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను వినియోగించుకోవాలి. నగర సీపీ రద్దీ ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నల్స్ కూడా ఏర్పాటు చేయించారు. వాటిని కూడా వినియోగించుకోవాలి

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడితే :

- డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారు మైనర్లు అయితే కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా తల్లిదండ్రులతో కలిసి హాజరుకావాలి. పెళ్లైన వారు పట్టుబడితే తప్పనిసరిగా భార్యను వెంట తీసుకొని రావాలి
- ఎందుకంటే మద్యం తాగి వాహనాలు నడిపితే ఎన్ని అనర్థాలు వస్తాయో ఆ కుటుంబాలకు తెలియజేయడమే దీని ఉద్దేశం. ఈ విధానానికి మంచి ఫలితాలు వస్తున్నాయి. తల్లిదండ్రుల్లో కూడా పరివర్తన వస్తోంది.

అవగాహన కార్యక్రమాలు :

- విద్యాసంస్థలు, ఆస్పత్రులతో పాటు ఆటో డ్రైవర్లు, వర్క్‌షాపులు, బస్సు డ్రైవర్లు తదితరులకు మా దగ్గర ఉన్న నాలుగు టీమ్‌లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రతిరోజూ ఈ టీమ్‌లు గుర్తించిన ప్రాంతాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాయి.
- ఎవరైనా తమ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇతర సంస్థల్లో డ్రైవర్లకు అవగాహన కల్పించాలనుకుంటే 8712660620 నంబర్‌ను సంప్రదిస్తే మా బృందాలు అక్కడికి పంపించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తాం. ప్రతిరోజూ ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్‌లో 150 మందికి అవగాహన కల్పిస్తున్నాం.
- వితౌట్ డ్రైవింగ్ లైసెన్స్, మొబైల్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంప్, రైడింగ్.. ఇలా నిబంధనలు ఉల్లంఘించే వారికి కౌన్సెలింగ్ చేస్తే మరోసారి వారు ఆ ఉల్లంఘనకు పాల్పడకుండా ఉంటారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రహమత్‌నగర్: సన్‌రైజ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో బోరబండ సైట్- 3లోని ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం (నేడు) ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, గుండె, మానసిక, చర్మవ్యాధులకు వైద్య సేవలందిస్తామన్నారు. హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

నేడు యూఎస్ఏ స్టడీ ఎక్స్‌పో

బంజారాహిల్స్: అమెరికాలో ఉన్నత విద్య అవకాశాలు, వీసా ప్రాసెసింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గ్లోబల్ ట్రీ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తాజ్‌దక్కన్ హోటల్‌లో యూఎస్ఏ స్టడీ ఎక్స్‌పో-2023 పేరుతో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ డైరెక్టర్ సుధాకర్ అలపాటి తెలిపారు. అమెరికాలోని పలు ప్రముఖ యూనివర్సిటీల ప్రతినిధులతో పాటు ఇమ్మిగ్రేషన్ విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో కాన్సులర్ అధికారి క్యాథరిన్ ఎం గ్లేష్మెన్, కమర్షియల్ అడ్వయిజర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

చెట్లకు పురుగుల మందు పిచికారీ



పురుగుల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్, ఇందిరానగర్ కాలనీల్లో చెట్లకు పురుగు పడుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్ విజయారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు శనివారం జీహెచ్ఎంసీ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఆయా కాలనీల్లో చెట్లకు పురుగుల నివారణ మందులు పిచికారీ చేశారు.

నాణ్యతలో రాజీపడొద్దు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నం. 59లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేశ్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకటేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయచంద్రతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని, ఈ విషయంలోఎలాంటి రాజీపడొద్దని ఆయన కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయాలన్నారు.

'ఆశ్రయ్-ఆకృతి' సేవలు ప్రశంసనీయం



వినికిడి యంత్రాలు అందిస్తున్న సినాప్సిస్ సంస్థ ప్రతినిధి

శ్రీనగర్‌కాలనీ: బధిర విద్యార్థులకు ఆశ్రయ్-ఆకృతి సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని సినాప్సిస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం శ్రీనగర్‌కాలనీలోని ఆశ్రయ్-ఆకృతి బధిర పాఠశాలలో విద్యార్థులకు 45 వినికిడి యంత్రాలను, 30 మంది చిన్నారుల ఎడ్యుకేషన్‌కు సహకారం అందించారు. బధిర విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు వారికి ఉద్యోగ భద్రతను కూడా చూస్తున్న ఆశ్రయ్-ఆకృతి సంస్థ సేవలను అభినందించారు. కార్యక్రమంలో సినాప్సిస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
I.A No 164 OF 2022 IN O.S. No 3090 OF 2017
Between
Nagaraju Kishore ...Petitioner/Defendant No.1
And
Smt A.Jaya Lakshmi
Respondent No 1/Plaintiff
M/S Raghava Constructions and others
...Respondents/Defendant Nos 2 to 7
To,
Y.Padmaja W/o Y.R Kishore Chand (R-4)
Aged about 45 Yrs, Occ: Service,
Flat No: 231, 2nd Floor, R/o 6-3-609/421,
A.G Office Employees Co-Operative Society,
Raghava Lakshmi Varam Anand Nagar Colony,
Khairatabad, Hyderabad.
Take notice that the Petitioner/Defendant No 1 has filed the above I.A No 164 of 2022 in O.S No 3090 of 2017 [illegible] 07.02.2023 at 10:30 A.M [illegible]
// By Order //
Hon'ble XXI Junior Civil Judge,
City Civil Court, Hyderabad
A.V.S RAMAKRISHNA, ADVOCATE
H.No 3-31, DurgaNagar Dilsukhnagar,
Hyderabad, Telangana. Ph: 9246567975

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని వినతి

ఫిలింనగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నేతలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు శనివారం నేతలు మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో వంద రోజుల్లో బిల్లు ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారన్న విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొప్పరం వేణు మాదిగ, టీవీ నర్సింహారావు, శివకుమార్, శ్రీనివాస్, విజయ్, రామ్ తదితరులు పాల్గొన్నారు



కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

'క్యాట్'లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



క్యాట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీనగర్‌కాలనీ: క్యాట్ ఒలింపియాడ్‌లో అమీర్‌పేట జోన్ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. దేశ వ్యాప్తంగా ఒలింపియాడ్ సంస్థ 6-10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలింపియాడ్ లెవెల్-2లో ముగ్గురు విద్యార్థులు నగదు పురస్కారాలు, 241 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారని జోన్ ఏజీఎం శివరామ కృష్ణ, ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ సిబ్బంది అభినందనలు తెలిపారు

సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

రహమత్‌నగర్: డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. రూ 15 లక్షలతో రహమత్‌నగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సహకారంతో రహమత్‌నగర్ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, సీవరేజ్, తాగునీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నామన్నారు. కొత్త సీసీ రోడ్ల నిర్మాణంతో రహమత్‌నగర్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వాణిధర్, బస్తీవాసులు పాల్గొన్నారు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎన్ రెడ్డి

అలైదా గువేరా సభకు భారీ ఏర్పాట్లు

లిబర్టీ: ప్రపంచ విప్లవ యోధుడు, క్యూబా దేశ విముక్తి పోరాట నాయకుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా గువేరా పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బి.రాములుయాదవ్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 22 (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు రవీంద్రభారతిలో జరిగే సభలో అలైదా గువేరా, ఎస్తేఫానియా గువేరా పాల్గొంటారన్నారు. పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలకు చెందిన జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. కాగా, అలైదా గువేరా, ఎస్తేఫానియా గువేరాల పర్యటన నేపథ్యంలో భారీగా స్వాగత ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశామన్నారు

బాటసారుల భద్రతకు పెద్దపీట వేయండి

బంజారాహిల్స్: బాటసారులకు భద్రత కల్పించే దిశలో వారికి మరింత భరోసానివ్వాలని నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌బాబు కోరారు. బంజారాహిల్స్ రోడ్ నం.2లోని శ్రీనగర్ కాలనీ టి-జంక్షన్ టీవీ9 చౌరస్తాలో ఆయన పర్యటించారు. ఇక్కడ పెడస్ట్రియన్ ఐలాండ్ల వద్ద 'ఇది పాదచారులు నిలబడే చోటు' అని పేర్కొంటూ ప్రత్యేక రంగులతో బోర్డులు ఏర్పాటు చేయాలని బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ నరసింహరాజుకు సూచించారు. అన్ని చౌరస్తాల్లో పెడస్ట్రియన్ ఐలాండ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్టాప్‌లైన్లు, జీబ్రాలైన్లు వాహనదారులకు కనిపించేలా రంగులు వేయాలని కోరారు.



టీవీ9 జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌బాబు

సామాన్యులను వ్యాపార వేత్తలను చేయడమే లక్ష్యం

పంజాగుట్ట: ఎంతో మంది సామాన్యులకు, రైతులకు వ్యాపారం చేసి అందులో రాణించాలనే కోరిక ఉంటుంది.. కానీ, వారికి వ్యాపారం ఎలా చేయాలో తెలియదు.. ఇంట్లోనే ఉండి కుటీర పరిశ్రమ ఎలా ప్రారంభించాలనే విషయాన్ని ఫ్రీడం యాప్ వివరిస్తుంది. అలా గ్రామీణ ప్రాంతంలో ఉండే 34 మంది ఫ్రీడం యాప్‌లో చేరి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగిన వారికి శనివారం సోమాజిగూడ ఐటీసీ లండన్ హోటల్‌లో ఘనంగా సత్కరించి, ఫ్రీడం యాప్‌కు అనుబంధంగా ఫ్రీడం నెస్ట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఫ్రీడం యాప్ సీఈఓ ప్రతాప్ బెహెరా, దార్విన్ బాక్స్ యాప్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ చెన్నమనేని, రియల్టర్ ఆక్సిజన్ కంపెనీ వ్యవస్థాపకుడు నంది రామేశ్వర రావు, ఎస్ఎస్ చాకోరియామ్ వ్యవస్థాపకులు హిమబిందు, ఫ్రీడం యాప్ తెలుగు కంటెంట్ హెడ్ కౌశిక్ మరిడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన సామాన్యులను వ్యవసాయ, గృహ ఆధారిత పారిశ్రామిక వేత్తలుగా, వారి వ్యాపార విస్తరణకు అవసరమైన ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్, నెట్‌వర్కింగ్, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడమే తమ యాప్ లక్ష్యమన్నారు. తమ యాప్‌లో వెయ్యికి పైగా కోర్సులు, ఆరు భాషల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

నేడు గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు

పంజాగుట్ట: తెలంగాణలో త్వరలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థుల కోసం క్రిష్ణప్రదీప్ 21స్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ తెలిపారు. అశోక్ నగర్‌లోని తమ అకాడమీలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9133237733ను సంప్రదించవచ్చు.

పీహెచ్‌డీ కటాఫ్ మార్కులు తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు కటాఫ్ మార్కులను తగ్గించాలని వీసీ ప్రొ.రవిందర్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎస్‌టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజుగౌడ్ మాట్లాడుతూ గతంలో మాదిరి బీసీ విద్యార్థులకు 20, ఓసీలకు 25, ఎస్సీ, ఎస్టీలకు అర్హత మార్కులు లేకుండ పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించాలన్నారు. అర్హత మార్కులను పెంచడం వలన వివిధ సబ్జెక్టుల్లో అనేక సీట్లు మిగులుతుయని పేర్కొన్నారు. కటాఫ్ మార్కులను తగ్గించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

పీహెచ్‌డీలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పాటించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పాటించాలని విద్యార్థి నాయకులు వీసీ, రిజిస్ట్రార్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఇతర రిజర్వేషన్ విద్యార్థులకు మాదిరి ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులలో రిజర్వేషన్లను వర్తింపచేయాలన్నారు.

ప్రజాప్రతినిధిని కలవనివ్వరా ?

- ఫిలింనగర్‌లో కాంగ్రెస్ ఆందోళన

ఫిలింనగర్: తమ ప్రాంతానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలవనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేతలు శనివారం ఫిలింనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ మాట్లాడుతూ, డివిజన్‌లో విద్యార్థుల కోసం జూనియర్ కాలేజీ అవసరం ఉందని వినతి పత్రం ఇవ్వాలని తాము అనుకున్నామని వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీ నిధులతో రోడ్లు వేయాలని కోరారు. అలాగే డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. బసవతారకం నగర్ నాలా పైకప్పు వేయాలని, గురుబ్రహ్మనగర్, రోడ్ నం. 46 అంబేడ్కర్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం నిధులు మంజూరు చేయించాలన్నారు. 18 బస్తీల ప్రజల సౌకర్యార్థం ఎంపీ నిధులతో కళాశాల నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పోతుల మల్లేష్, భవానీ రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాల పంపిణీ



ఉపాధ్యాయులకు ఎగ్జామ్ వారియర్ పుస్తకాలను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఫిలింనగర్: విద్యార్థులు పరీక్షలు రాసే ముందు ఆందోళన చెందవద్దని, నేను మీకు అండగా ఉంటానని చెప్పడం కోసమే పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎగ్జామ్ వారియర్స్ అనే పుస్తకాన్ని పంపిణీ చేశారు. ఈ పుస్తకాన్ని ఈ నెల 27న అనేక భాషల్లో విడుదల చేస్తారని, ఇందులో భాగంగానే తెలుగు విద్యార్థులకు తెలుగు పుస్తకాన్ని రాశారన్నారు. కోట్లాది మంది విద్యార్థుల నుద్దేశించి ప్రధాని మోదీ అదే రోజున టీవీల్లో ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, డిప్యూటీ డీఈఓ శ్యామూల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే బీసీ జనగణన చేయాలి

లిబర్టీ: బీసీల జనగణన చేయకపోతే బీజేపీ ప్రభుత్వంపై బీసీలు తిరుగుబాటు చేస్తారని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి అన్నారు. బీసీలతో చెలగాటమాడితే ఈ ప్రభుత్వం మనుగడ కొనసాగించదని హెచ్చరించారు. బీసీ దళ్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, బీసీల జనగణన చేయాలని అనేకేళ్లుగా కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తుందో చెప్పాలని నిలదీశారు. బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో జనగణన జరిగిందని, ఆ తర్వాత మళ్లీ చేయలేదన్నారు. జనగణన చేయాలని వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నా 8 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందే కేంద్ర ప్రభుత్వం బీసీల జనగణనపై స్పష్టమైన విధానం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అపూర్వ సమ్మేళనం

బంజారాహిల్స్: ఆల్ సెయింట్స్ హైస్కూల్ 1978 బ్యాచ్ విద్యార్థులంతా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో కలుసుకున్నారు. 60 ఏళ్ల వయసు పైబడిన వీళ్లంతా వివిధ హోదాల్లో ఇక్కడ కలుసుకొని తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రముఖ క్రికెట్ కోచ్ కేఎం జోసెఫ్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన అజహారుద్దీన్, వెంకటపతిరాజులకు కోచ్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉదయ్ కుమార్ రెడ్డి, సత్యశ్రీనివాస్, మహీధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఆల్ సెయింట్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

దళితుల అభ్యున్నతికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: దళితుల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని, దళిత బంధు పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్సీ అభివృద్ధి, సంక్షేమ శాఖ మంత్రికి తెలంగాణ దళిత బహుజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దళితులు, దళిత విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అన్నింటా వెనుకబడి దయనీయ జీవితాలు గడుపుతున్న దళితుల జీవితాల్లో వెలుగు నింపేందుకు, ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రగతిశీల పథకాలను ప్రవేశపెట్టాలని విన్నవించారు.



మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన వలిగొండ శ్రీనివాస్

క్లుప్తంగా

హేతువాద సంఘ చైర్మన్ 'రావిపూడి' కన్నుమూత



చీరాల అర్బన్: భారత హేతువాద సంఘ చైర్మన్, హేతువాది మాసపత్రిక ఎడిటర్ రావిపూడి వెంకటాద్రి (101) అనారోగ్యంతో శనివారం చీరాలలో కన్నుమూశారు. హేతువాద మాసపత్రిక సంపాదకుడిగా ఆయన ఎన్నో వ్యాసాలు రాయడమే కాక.. వందలాది పుస్తకాలను స్వయంగా రచించి ముద్రించారు. వెంకటాద్రి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం ఇంకొల్లు మండలం నాగండ్లలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

'విద్య అమృత మహోత్సవ్'లో ఏపీకి రెండో స్థానం

సాక్షి, అమరావతి: 'విద్య అమృత మహోత్సవ్' కార్యక్రమం అమలులో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే రెండో స్థానం దక్కిందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ 'శిక్షక్ పర్వ్' వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వినూత్న, వైవిధ్య విద్యా అంశాలతో పిల్లల మనసుల్ని ఆకట్టుకునేలా చిన్నచిన్న అద్భుతమైన ఆలోచనలని దృశ్య రూపంగా మార్చి బోధనా అభ్యసనకు తగిన 1,00,758 ప్రాజెక్టులను అప్‌లోడ్ చేసి ఏపీ ఉపాధ్యాయులు ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు.

బీసీ కార్పొరేషన్ల పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి/తణుకు అర్బన్/గణపవరం/పెదవస్నపేట: రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ల పదవీ కాలాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 139 వెనుకబడిన కులాలకు 56 సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆ కార్పొరేషన్ల పదవీకాలం ముగిసింది. దీంతో వాటిలో 55 బీసీ కార్పొరేషన్లను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆయా కార్పొరేషన్లకు చెందిన చైర్మన్లు, డైరెక్టర్లు పదవిలో కొనసాగుతారని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలాన్ని పొడిగించిన నేపథ్యంలో బీసీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

14,000+ పోస్టులు

- గ్రామ, వార్డు సచివాలయాల్లో భర్తీకి ఈసారి ఆన్‌లైన్ పరీక్షలు
- పలు మార్పులతో ఫిబ్రవరిలో మూడో విడత నోటిఫికేషన్‌కు కసరత్తు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న దాదాపు 14 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి మరో విడత నోటిఫికేషన్ జారీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈసారి ఉద్యోగ నియామక రాత పరీక్షలను పూర్తి స్థాయి ఆన్‌లైన్ విధానంలో చేపట్టాలని యోచిస్తోంది. దీనిపై వచ్చే వారం రోజుల్లో తుది నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 1.34 లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను ఒకేసారి మంజూరు చేయడంతో పాటు కేవలం నాలుగు నెలల వ్యవధిలో వాటిని భర్తీ చేసిన విషయం తెలిసిందే. 2019 జూలై – అక్టోబర్ మధ్య మొదటి విడతగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం భారీగా నియామక ప్రక్రియ నిర్వహించింది. అప్పట్లో మిగిలిపోయిన ఉద్యోగాలకు 2020 జనవరిలోనే రెండో విడత నోటిఫికేషన్ జారీ చేసి, కరోనా సమయంలో కూడా ఆ ఏడాది సెప్టెంబర్‌లో రాత పరీక్షలు నిర్వహించి నియామకాలు పూర్తి చేసింది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న, ఇంకా మిగిలిపోయిన ఉద్యోగాల భర్తీకి ఇప్పుడు మరో విడత.. మూడో నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు చేస్తోంది. గత రెండు విడతల మాదిరే.. ఈ సారి కూడా ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. అయితే, గత రెండు విడతల్లో ఉద్యోగ నియామక రాత పరీక్షలను పూర్తి స్థాయి ఆఫ్‌లైన్ (ఓఎమ్మార్ షీట్- పేపర్, పెన్ను) విధానంలో నిర్వహించగా.. ఈ విడతలో మాత్రం ఆన్‌లైన్ విధానంలో నిర్వహణకు పంచాయతీ రాజ్ శాఖ కసరత్తు చేస్తోంది.

ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల


- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీతో పాటు వీలైనంత త్వరగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖతో పాటు వివిధ శాఖలు ఇందుకు సంబంధించిన కసరత్తును వేగవంతం చేశాయి.
- కేటగిరీల వారీగా ఉద్యోగాలకు సంబంధించి ఆయా శాఖలు రోస్టర్- రిజర్వేషన్ల వారీగా ఖాళీల వివరాలకు తుది రూపు ఇస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ ముగియగానే, ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీకి అన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు.

డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా ఏపీ

ఇన్ఫినిటీ వైజాగ్-2023 ముగింపు సదస్సులో ఐటీ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు స్వర్గధామంగా ఉన్న విశాఖపట్నంలో పెట్టుబడుల కోసం వివిధ సంస్థల్ని ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్-2023 విజయవంతంగా ముగిసింది. రెండ్రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో భవిష్యత్తు ఐటీ రంగం మొత్తం ద్వితీయ శ్రేణి నగరాల జాబితాలో మొదటి వరుసలో ఉన్న విశాఖపట్నానిదేనని ప్రముఖ ఐటీ రంగ నిపుణులు స్పష్టంచేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. భవిష్యత్ డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా రూపాంతరం చెందనుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 9వ ధనిక నగరంగా ఉన్న వైజాగ్.. రాబోయే రెండునెలల్లో క్యాపిటల్ సిటీగా మారబోతోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రెండ్రోజుల పాటు నిర్వహించిన సదస్సుకు 40 ఐటీ సంస్థలకు చెందిన సీఈఓలు, 500కి పైగా ఐటీ నిపుణులు హాజరయ్యారని ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు వెల్లడించారు. నిపుణుల సూచనలతో భవిష్యత్తులో ఐటీ అభివృద్ధికి కావల్సిన రోడ్‌మ్యాప్‌ని సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని శ్రీధర్ తెలిపారు.

15 రోజుల్లో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన



ప్రపంచానికి బెస్ట్ ఐటీ డెస్టినేషన్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నాన్ని ప్రమోట్ చేస్తున్నారు. ఇన్ఫోసిస్, రాండ్‌స్టాడ్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. విప్రో, ఐబీఎం కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. 15 రోజుల్లో విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. విశాఖలో పెట్టుబడులకు ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ ఎంతో ఉపయోగపడింది. భవిష్యత్తులో వైజాగ్ ఆసియాలోనే డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్ అవుతుంది.

– రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

రామోజీ.. ఆ రోజులు గుర్తులేవా?

గత ప్రభుత్వాల్లో ఏనాడూ ఉద్యోగులందరికీ 1వ తేదీనే జీతాలివ్వలేదు

- బాబు హయాంలోనూ 1–20 తేదీల మధ్య చెల్లింపులు
- అప్పుడు ఒక్క ముక్క రాయని ఈనాడు.. ఇప్పుడు తప్పుడు కథనాలు
- గతంలో కంటే మెరుగ్గా చేస్తుంటే ఇలాంటి కథనాలు దారుణం..
- పరువు నష్టం దావా వేస్తామని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: మన రాష్ట్రంలో కానీ, పక్క రాష్ట్రాల్లో కానీ.. దేశంలో ఎక్కడైనా సరే వివిధ శాఖల ఉద్యోగులందరికీ ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందడం లేదు. ఇది వరకు కూడా ఏ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ 1వ తేదీనాడే జీతాలు చెల్లించ లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, విభజన అనంతరం చంద్రబాబు ప్రభుత్వంలో కానీ ఏనాడూ ఉద్యోగులందరూ 1వ తేదీనే జీతాలు అందుకున్న దాఖలాలు లేవు. ప్రతి నెలా 1-20వ తేదీ మధ్య గత ప్రభుత్వాలు ఎలాగైతే జీతాలు చెల్లిస్తూ వచ్చాయో.. ఇప్పుడూ అదే తరహాలో రాష్ట్రంలో జీతాలు చెల్లిస్తున్నారు. అయితే ఇప్పుడే కొత్తగా అందరికీ 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు ఇవ్వడం లేదని ఈనాడు 'పచ్చ'పాతంతో తప్పుడు కథనాలు వండివారుస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కూడా 1- 20వ తేదీ మధ్య రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లింపులు చేసేది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లకు ఆరేసి నెలల తరబడి వేతనాలు చెల్లించకపోయినా ఆ రోజుల్లో 'ఈనాడు' ఒక్క వార్త రాసిన పాపాన పోలేదు. వివిధ శాఖలకు సంబంధించి జీతాల బిల్లులు ప్రాసెస్ కావడానికి కొద్ది రోజులు అటూ ఇటూ అవుతుంది. ఈ విషయాలన్నింటినీ 'ఈనాడు' మరచిపోయింది. ఇప్పుడు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, హోంగార్డులకు ఏ నెల వేతనాలు ఆ నెలలోనే చెల్లిస్తుండటం సదరు రామోజీ పత్రికకు కనిపించడం లేదు. చంద్రబాబు హయాంలో అన్ని శాఖల ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇవ్వలేదనే నిజాన్ని వ్యూహాత్మకంగా విస్మరించింది. వాస్తవానికి ఉద్యోగులు, పెన్షనర్లలో అత్యధికులకు సకాలంలోనే జీతాలు చెల్లింపు జరుగుతోంది. చాలా తక్కువ మందికి బిల్లులు సమర్పించడంలో జాప్యం, ఇతరత్రా కారణాల వల్ల 20వ తేదీ వరకు సమయం పడుతోంది. ఈ వాస్తవాలన్నింటికీ మసి పూసి.. తమ చంద్రబాబు సీఎం కుర్చీలో లేరనే ఈర్ష్యతో ఈ ప్రభుత్వం మాత్రమే ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, పెన్షన్లు ఇవ్వడం లేదని విష ప్రచారానికి పూనుకుంది. బాబు హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు ఇవ్వకుండా బకాయి పెట్టి ఎన్నికల ముందు పోస్ట్ డేటెడ్ జీవోలు ఇచ్చినా.. చిరుద్యోగులు ఆకలికి అలమటించేలా చేసినా ఈనాడుకు కనిపించలేదు. ఎందుకంటే అప్పుడు వాళ్ల బాబు పాలన కాబట్టి. ఈ నేపథ్యంలో ఈనాడు, మరికొన్ని పచ్చ పత్రికల తీరును ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ తీవ్రంగా తప్పు పట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం గురించి రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ ఈనాడుతో పాటు కొన్ని పత్రికలు పనికట్టుకొని తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని, వాటిపై పరువు నష్టం దావా వేస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించకుండా వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదంటూ రాస్తున్న కథనాల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. ఉద్యోగుల సంక్షేమం గురించి అనేక చర్యలు తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ తప్పుడు కథనాలు రాస్తుండటంతో ఉద్యోగులు, ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామని చెప్పారు. తప్పుడు కథనాలను నమ్మొద్దని, ఉద్యోగుల సంక్షేమమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్ర విభజన సందర్భంగా ఆర్థిక వనరుల పంపిణీ అశాస్త్రీయంగా ఉండటంతో పాటు కోవిడ్ సంక్షోభం కారణంగా ఆర్థికంగా తీవ్ర ప్రభావం పడినప్పటికీ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తోంది. ఇందుకోసం అనేక చర్యలు తీసుకుంది. అయినప్పటికీ జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించడం లేదంటూ ఆరోపణలు చేయడం, ప్రచారం చేయడం తగదు' అని చెప్పారు.

తిరుమల ఆలయం వీడియో ప్రచారంపై చర్యలు

- శ్రీవారి ఆలయంపై విమానాలు, డ్రోన్లు తిరగడం నిషేధం
- ప్రచారంలో ఉన్న వీడియో చిత్రీకరించారా.. మార్ఫింగ్ చేశారా అన్నది గుర్తిస్తాం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించినట్టుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయం వెలుపల శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ఆలయం పైన ఎలాంటి విమానాలు, డ్రోన్లు తిరిగేందుకు అవకాశం లేదని, ఆగమ శాస్త్రాల ప్రకారం నిషేధించినట్టు తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం సాధ్యం కాదని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ సోషల్ మీడియాలో ఓ వీడియోను ప్రసారం చేస్తోందని టీటీడీ విజిలెన్స్, భద్రతాధికారులు గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే ఆ సంస్థకు చెందిన వ్యక్తులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో డ్రోన్ ద్వారా చిత్రీకరించారా.. లేక పాత ఫొటోలను మార్ఫింగ్ చేసి 3డీ విధానంలోకి మార్చారా అనేది ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా తెలుస్తుందన్నారు. సదరు వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, సమగ్ర విచారణ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రోన్‌తో చిత్రీకరణపై పోలీసు కేసు నమోదు

తిరుమల శ్రీవారి ఆలయంపై డ్రోన్‌తో చిత్రీకరణ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై టీటీడీ వీజీవో బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. కిరణ్ అనే వ్యక్తి ఆలయ భద్రత నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్‌ను వినియోగించి వీడియో చిత్రీకరణ చేసి సదరు వీడియోను గృహ శ్రీనివాస, ఐకాన్ ఫ్యాక్ అకౌంట్లో పోస్ట్ చేశాడు. డ్రోన్ కెమెరాతో శ్రీవారి ఆలయ దృశ్యాలు చిత్రీకరించి భద్రత నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు, అసాంఘిక శక్తులకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరించడంపై ఐపీసీ సెక్షన్ 447 కింద కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగర వార్తలు

నేడు 'సాక్షి' స్పెల్ బీ పోటీలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లోని సుల్తాన్ ఉల్ ఉలుం ఎడ్యుకేషనల్ సొసైటీ గులాం అహ్మద్ ఆడిటోరియంలో ఈ నెల 22(ఆదివారం)న సాక్షి స్పెల్ బీ-2022-23 రౌండ్ 3 రీజినల్ రౌండ్ పోటీలు నిర్వహించనున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు డ్యూక్స్ వాఫీ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తుండగా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అసోసియేషన్ మరో స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది.

'అహ' అధ్యక్షుడిగా డాక్టర్ మార్త రమేష్



లక్డీకాపూల్: అసోసియేషన్ ఆఫ్ హెల్త్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ (అహ) అధ్యక్షుడిగా నిమ్స్, తెలంగాణ ప్రభుత్వ అనుసంధానకర్త డాక్టర్ మార్త రమేష్ ఎన్నికయ్యారు. శనివారం గాంధీ హాస్పిటల్ అలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో హెల్త్ అవార్డ్ 2023 సెమినార్ జరిగింది. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో రమేష్‌ను అహ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన అధ్యక్షతన ఏర్పడిన నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా డాక్టర్ మసూద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేందర్ కుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా విజయరెడ్డి ఎన్నికయ్యారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ పి.సత్యనారాయణ, సలహాదారులుగా డాక్టర్ టి.దయాకర్, నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డాక్టర్ కె.టి.రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్ మాట్లాడుతూ... అసోసియేషన్ అభివృద్ధికి తన వంతుగా ఎక్కువ సమయం కేటాయించి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సీనియర్ల సహాయ సహకారాలతో పని చేస్తానన్నారు.

ఆదాయ మార్గాల అన్వేషణలో 'నిమ్స్'

రాబడి పెంచుకునేందుకు కసరత్తు

- ఆస్పత్రి జమా ఖర్చులపై సమీక్ష
- ప్రత్యేక దృష్టి సారించిన ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) ఆదాయ మార్గాల అన్వేషణలో పడింది. ఆస్పత్రిని ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొచ్చే క్రమంలో రాబడి పెంచుకునేందుకు తీవ్రంగా కసరత్తు చేపట్టింది. వైద్యసేవలకు సంబంధించిన జమా ఖర్చులపై నిమ్స్ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప బుధవారం సమీక్ష నిర్వహించారు.

- మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, ఫైనాన్స్ కంట్రోలర్ మోహన్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ మహేష్, బిల్లింగ్, సీపీఎస్ విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు
- ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధిలోకి తీసుకొచ్చే క్రమంలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని డైరెక్టర్ సూచించారు.
- ముఖ్యమంత్రి కేసీఆర్ చూపుతున్న చొరవకు అనుగుణంగా ఆస్పత్రిలో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.
- 'ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్యసేవలకు ఆస్పత్రికి రోగులు సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా సేవలను మరింత మెరుగుపర్చుకోవాల్సి ఉంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం నుంచి ఆస్పత్రికి రావాల్సిన సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ, జెహెచ్ఎస్, ఈహెచ్ఎస్, ఆర్టీసీ తదితర స్కీమ్‌లకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలి' అని ఆయన స్పష్టం చేశారు.
- సీఎంఆర్ఎఫ్ బిల్లులు రూ. 90 కోట్ల వరకు సమర్పించినట్టు అధికారులు డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన బిల్లులను కూడా త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశించారు.
- ప్రభుత్వం నుంచి ఆస్పత్రికి రావాల్సిన నిధులకు సంబంధించి పూర్తి స్థాయిలో తన కృషి ఉంటుందని... అందుకు అనుగుణంగా ఆస్పత్రి అధికారులు కూడా సమన్వయంతో పని చేయాలని డాక్టర్ బీరప్ప కోరారు.
- ఇదిలా ఉండగా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఆస్పత్రి హెల్త్ సిబ్బంది, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని సూచించినట్టు తెలుస్తోంది. ఆస్పత్రికి పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషిని ఆయన స్పష్టం చేసినట్టు సమాచారం. ఆదే తరహా సమీక్షలను మరో రెండు నిర్వహించాలనే యోచనలో ఇంచార్జి డైరెక్టర్ ఉన్నట్టు తెలిసింది. మొత్తం మీద ఆస్పత్రిని అన్ని విధాలా ప్రక్షాళన చేసేందుకు నిమ్స్ యాజమాన్యం నడుం బిగించింది.
- ఈ విషయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం. ఫలితంగా కొద్ది రోజులుగా డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్లు ఆస్పత్రిలో విధిగా పెద్ద ఎత్తున రౌండ్స్ నిర్వహిస్తున్నారు. దీంతో ఉద్యోగుల్లో కూడా స్తబ్ధత తొలగి ఉత్సాహంలో పని చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఓ సీనియర్ ఉద్యోగి అభిప్రాయపడుతున్నారు.

మలక్‌పేట తరహా మరణాలు జరగకుండా జాగ్రత్తలు

- వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్
- కింగ్‌కోఠి ఆస్పత్రిని సందర్శించిన కమిషనర్



గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ జలజకు సూచనలిస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

హిమాయత్‌నగర్: మలక్‌పేట ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఘటనలు మరెక్కడా జరగకుండా ముందస్తుగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆ దిశగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలను సూచిస్తున్నామన్నారు. శనివారం డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీతతో కలసి కింగ్‌కోఠి జిల్లా ప్రసూతి ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని ప్రసూతి విభాగాన్ని ఇక్కడి విభాగాధిపతి డాక్టర్ జలజ వెరోనికాతో కలిసి పరిశీలించారు. ఇక్కడి ఏర్పాట్లను చూసిన ఆయన ప్రతి ఒక్కరినీ అభినందించారు. అనంతరం కమిషనర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ... మలక్‌పేటలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా ఇతర ఆస్పత్రుల్లోనూ జాగ్రత్తలను మరింత కట్టుదిట్టంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణి బయటకు వెళ్లే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. ఏ ఒక్కరికీ ఎలాంటి ఇన్‌ఫెక్షన్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే సమయంలో ఆ గర్భిణి బయట ఎక్కడైనా చూపించుకున్నదా లేదా అనే వివరాలను సైతం నమోదు చేసుకోవాలని సూచించారు.

శ్రీకాంత్ 'డబుల్' ధమాకా



సాక్షి, హైదరాబాద్: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ ఇంటర్ రీజనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ఈ మీట్‌లో చివరిరోజు టేబుల్ టెన్నిస్ (టీటీ) విభాగంలో తెలంగాణకు చెందిన జి.శ్రీకాంత్ పురుషుల సింగిల్స్‌తోపాటు డబుల్స్ విభాగంలోనూ స్వర్ణ పతకం సాధించి డబుల్ ధమాకా సృష్టించాడు. సింగిల్స్ ఫైనల్లో శ్రీకాంత్ 8–11, 11–1, 11–8, 6–11, 11–5, 11–13, 11–6తో తెలంగాణకే చెందిన డి.సాయికిరణ్‌పై గెలుపొందాడు. డబుల్స్ ఫైనల్లో శ్రీకాంత్–సాయికిరణ్ (తెలంగాణ) జోడీ 11–6, 11–8, 11–8తో శ్రీనివాసన్–చప్రా గౌరి (జోనల్ ఆఫీస్) ద్వయంపై విజయం సాధించింది. ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్ కర్ణాటక జట్టుకు లభించింది. ఎఫ్‌సీఐ రీజనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్‌పీబీ) అధ్యక్షుడు దీపక్ శర్మ, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌పీబీ సెక్రటరీ, ఏజీఎం (స్పోర్ట్స్) ఆర్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

27 నుంచి అంతర్జాతీయ డాగ్‌షో

మాదాపూర్: హైదరాబాద్ నగర కేంద్రంగా ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు అంతర్జాతీయ డాగ్ షోను నిర్వహించనున్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఇందుకు వేదికకానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైటెక్స్ బిజినెస్ హెడ్ టి.జి.శ్రీకాంత్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైకాన్-23 పేరిట హైదరాబాద్ 8వ అంతర్జాతీయ డాగ్‌షోను నిర్వహించనున్నట్టు తెలిపారు. 50 విభిన్న జాతులకు చెందిన 500 కుక్కలను ప్రదర్శనకు రానున్నాయన్నారు. భారత్‌తోపాటు, స్పెయిన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రియా, స్వీడన్‌లకు చెందిన ఎనిమిది అంతర్జాతీయ న్యాయమూర్తులచే ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. పెంపుడు కుక్కల కోసం మినీ మారథాన్‌ను నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న హైకాన్ గ్రూమానియా గ్రూమర్స్‌గా పిలువబడే వివిధ జాతుల మోడల్, లైవ్ డాగ్‌లపై వస్త్రధారణ, నైపుణ్యాలను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. వీటిని ప్రఖ్యాత ఆస్ట్రేలియన్ గ్రూమింగ్ ఎక్స్‌పర్ట్ జేమ్స్ బెన్నెట్ నిర్ణయించనున్నారన్నారు. పెంపుడు జంతువుల కోసం ప్రత్యేకంగా వెటర్నరీ సైంటిఫిక్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి 80 మందికి పైగా పశువైద్యులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ షోకు ప్రవేశ రుసుము పెద్దలకు రూ. 300, పిల్లలకు రూ. 150 ప్రకారం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్స్ ఇంటెల్ ఇండియా సేల్స్ డైరెక్టర్ నితిన్‌జైన్, హైదరాబాద్ కెనైన్ క్లబ్ కార్యదర్శి ఫిలిప్‌భట్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెటెక్స్ ఇండియా-2023కి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. దేశంలో దత్తత తీసుకున్న శునకాల సంఖ్య 2 కోట్ల వరకు ఉంటుందన్నారు. పెట్ కేర్‌పై ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించాలని కోరారు

గంజాయి విక్రేతల అరెస్టు

- సరఫరా చేస్తున్న మైనర్‌తో పాటు ఐదుగురి అరెస్టు
- 1.5 కిలోల గంజాయి స్వాధీనం

నాగోలు: అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురితోపాటు మరో బాలుడిని ఎల్‌బీనగర్ పోలీస్ అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 30 వేల విలువైన గంజాయిని, రూ. 13,450 నగదు, 2 ద్విచక్ర వాహనాలు, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి వెల్లడించారు.

ఆయన సమాచారం మేరకు... కరీంనగర్ జిల్లా తిరుమలనగర్ బిరంలగూడకు చెందిన కాసి శ్రీకర్‌రెడ్డి(21) నగరానికి వచ్చి ఎల్‌బీనగర్ నివాసం ఉంటున్నాడు. వనస్థలిపురం ద్వారకామయి కాలనీకి చెందిన అలరామ బాలసింహ(20), యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం మల్యాపురానికి చెందిన ఎల్లంక శివకుమార్(20), సరూర్‌నగర్ హుడా కాలనీకి చెందిన చిట్టిపోలు ఉదిత్(22), సరూర్‌నగర్ వాడికి చెందిన బోయినపల్లి కృష్ణసాయి వర్షిత్(22), సరూర్‌నగర్‌కు చెందిన మరో మైనర్ బాలుడు కలసి ముఠాగా ఏర్పడ్డారు. అందరూ నగర శివారులోని వివిధ కళాశాలలో చదువుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఒక్కొక్క ప్యాకెట్ 25 గ్రాముల ప్రకారం తయారు చేసి నగరంలో అధిక ధరలకు గంజాయిని విక్రయించాలని ప్లాన్ చేశారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు బైరామల్‌గూడ సౌభాగ్యనగర్ కాలనీలోని ఓ ఇంట్లో ఉన్న 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి నగదు, మొబైల్ ఫోన్‌లు, ద్విచక్ర వాహనలు స్వాధీనం చేసుకున్నారు. మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

రామాచారికి లలిత సంగీతాచార్య శిరోమణి బిరుదు ప్రదానం




రామాచారిని సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: శ్రీ శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ సికింద్రాబాద్, నఫీల్‌గూడ, చైతన్యపురి శాఖల ఆధ్వర్యంలో కొమాండూరి రామాచారి జన్మదిన వేడుకలు, లలిత సంగీతాచార్య శిరోమణి బిరుదు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని శనివారం రాత్రి తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. జి.వి.ఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా గాయకుడు కొమాండూరి రామాచారికి లలిత సంగీతాచార్య శిరోమణి బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో గాన కంఠీరవ చింతలపూడి త్రినాధరావు, ప్రముఖ గాయకుడు వినోద్ బాబు, సినీ నేపథ్య గాయని విజయలక్ష్మి, అమెరికా గాన కోకిల శారదా ఆకునూరి, చిల్లా శివ పార్వతి, చేపూరి లక్ష్మి పాల్గొన్నారు. సభా ప్రారంభంలో శ్రీ శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ స్థాపకురాలు, సంగీత గురువు చిల్లా శివ పార్వతి శిష్య బృందంచే నిర్వహించిన సంగీత విభావరి ఎంతగానో ఆకట్టుకుంది.

పవర్ ఆఫ్ ఉమెన్

జమ్మూలోని దోడా జిల్లాలో 'ఎలక్ట్రీషియన్' అంటే మగవాళ్లు మాత్రమే గుర్తుకు వస్తారు. 'మహిళా ఎలక్ట్రీషియన్' అనే మాట, దృశ్యం ఊహకు కూడా అందనిది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలక్ట్రీషియన్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన షబ్నమ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది...



● ఆత్మవిశ్వాసం, అంకితభావంతో ముందడుగు: షబ్నమ్

జమ్మూ దోడా జిల్లాలోని మారుమూల గ్రామం కహారకు చెందిన షబ్నమ్ పదవ తరగతి పూర్తయిన తరువాత శ్రీనగర్‌లోని పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రీషియన్ కోర్సులో డిప్లొమా చేసింది. తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబానికి కష్టాలు మొదలయ్యాయి. ఆర్థికంగా అండ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ఆమె ఎలక్ట్రీషియన్‌గా పని మొదలు పెట్టింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచింది. కొద్ది కాలంలోనే షబ్నమ్‌కు ఎలక్ట్రీషియన్‌గా మంచి పేరు వచ్చింది.

'తప్పనిసరి పరిస్థితుల్లో ఎలక్ట్రీషియన్ వృత్తిలోకి వచ్చాను. అయితే నా పనితీరును చాలామంది మెచ్చుకోవడంతో ఉత్సాహం వచ్చింది. నాపై నాకు నమ్మకం పెరిగింది. ఈ ఫీల్డ్‌లోనే పనిచేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాను' అంటుంది షబ్నమ్.

నిజానికి దోడా ప్రాంతంలో ఎలక్ట్రీషియన్ అంటే మగవాళ్లు మాత్రమే.

'అమ్మాయిలు ఎలక్ట్రీషియన్‌గా పని చేయడం ఏమిటీ!' అని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేసేవాళ్లే. ఈ విషయం తెలిసి కూడా ఎలక్ట్రీషియన్‌గా అడుగులు మొదలుపెట్టింది షబ్నం.

'ఇది మగవాళ్లు మాత్రమే పనిచేయాల్సిన రంగం. ఇది ఆడవాళ్లు మాత్రమే పనిచేయాల్సిన రంగం అంటూ ఏదీ లేదు' అంటుంది షబ్నమ్.

ఎంటెక్ చదువుకున్న రషీద్‌ఖాన్ జమ్మూలో నిపుణులైన ఎలక్ట్రీషియన్స్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాడు. ఒక వెబ్‌సైట్ కూడా లాంచ్ చేయనున్నాడు. ఖాన్ బృందంలో ఉన్న ఒకే ఒక మహిళ షబ్నమ్.

'వీరితో ఎలాంటి భయం లేదు. మేమందరం ఒక కుటుంబం' అంటుంది షబ్నమ్.

చాటుమాటుగానే కాదు... 'అమ్మాయిలు ఎలక్ట్రీషియన్ వర్క్ చేయడం ఏమిటి!' అని ముఖం మీదే అన్నవాళ్లు ఉన్నారు.

అయితే అలాంటి మాటలను షబ్నమ్ ఎప్పుడూ పట్టించుకోలేదు.

'ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ఇది మహిళలు పనిచేసే రంగం కాదు అనే భావన నుంచి బయటికి రావాలి. ప్రతి రంగంలోనూ మంచి, చెడు ఉంటాయి. చెడును మాత్రమే చూస్తే ఉన్నచోటే ఉండిపోతాం. ప్రతి కొత్త అడుగులో కించపరిచే విధంగా మాట్లాడేవాళ్లు, ప్రతికూలంగా మాట్లాడే వాళ్లు ఎంతోమంది ఉంటారు. అలాంటి వారికి మన పనితోనే సమాధానం చెప్పాలి' అంటున్న షబ్నమ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేయాలనుకునే మహిళలకు సహాయం అందించడానికి సిద్ధంగా ఉంది.

స్త్రీలు- పని

నా డబ్బులు తీసుకో అనొద్దు

'ఉద్యోగం ఎందుకు చేయాలనుకుంటున్నావు?' 'ఇప్పుడు ఏం అవసరం వచ్చింది?' 'డబ్బులు కావాలా?' ఈ ప్రశ్నలు స్త్రీలను పురుషులు అడుగుతారు. 'డబ్బులు కావాలంటే నా డబ్బులు తీసుకో' అని భార్యతో భర్త, కూతురితో తండ్రి, తల్లితో కొడుకు, చెల్లితో అన్న అంటారు. 'నేను సంపాదించుకున్న నా డబ్బులు నాకు కావాలి' అని స్త్రీలు చెప్తే వీరు తెల్లముఖం వేస్తారు. స్త్రీల ఇంటి పని (కేర్ వర్క్)కి విలువ ఇవ్వక, స్త్రీలు బయట పని చేస్తామంటే పట్టించుకోక పోవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ, పురుషుల మధ్య ఆర్థిక తారతమ్యాలు తొలగడానికి ఐక్యరాజ్య సమితి అధ్యయనం ప్రకారం 120 ఏళ్లు పట్టనుందని శనివారం 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న రచయిత్రులు అన్నారు. భవిష్యత్తులో 'కేర్ వర్క్' పెద్ద ఉపాధి రంగం కానుందని తెలిపారు.



● శైలి చోప్రా, మిన్నీ వైద్

'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఒక అధ్యయనం చేసింది. రాబోయే రోజుల్లో ఎటువంటి పనులు గిరాకీ కోల్పోయి ఎటువంటి పనులు గిరాకీలోకి వచ్చి ఉపాధిని ఏర్పరుస్తాయి అనేదే ఆ అధ్యయనం. అందులో దినదిన ప్రవర్ధమానమయ్యే పని రంగంగా సంరక్షణా రంగం (కేర్ వర్క్) వచ్చింది. ఇంటి సంరక్షణ, పిల్లల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ, ఇంటి శుభ్రత, ఇంటి ఆరోగ్యం... ఇవన్నీ కేర్ వర్క్ కింద వస్తాయి. ఈ కేర్ వర్క్ తరాలుగా స్త్రీలు చేస్తున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న స్త్రీల చేత లెక్కా జమా లేని అతి తక్కువ వేతనాలకు చేయిస్తున్నారు. ఇంటిలో పని చేసే గృహిణుల కేర్ వర్క్‌కు విలువ కట్టడం లేదు. కేర్ వర్క్‌ను ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు ఒక ఉపాధి రంగంగా అభివృద్ధి చేస్తే తప్ప కేర్ ఎకానమీ స్వరూపం, ఉనికి, ఉపయోగం అర్థం కాదు. మగవాడు ఇంటి బయట జీతానికి చేసే పని ఒక్కటే పని కాదు. ఇంటి లోపల జీతం లేకుండా స్త్రీలు చేసే పని కూడా పనే' అని జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో శనివారం జరిగిన 'విమెన్ అండ్ వర్క్' అనే సెషన్‌లో పాల్గొన్న రచయిత్రులు అన్నారు. వీరిలో 'సిస్టర్‌హుడ్ ఎకానమి' పుస్తకం రాసిన శైలి చోప్రా, ఇస్రో మహిళా శాస్త్రవేత్తల మీద 'దోజ్ మేగ్నిఫిసియెంట్ విమెన్ అండ్ దెయిర్ ఫ్లయింగ్ మెషిన్స్' పుస్తకం రాసిన మిన్నీ వైద్, ఐక్యరాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ లక్ష్మీ పురి ఉన్నారు.

'స్త్రీలు ఉండదగ్గ చోటు ఇల్లు అనడమే పెద్ద అవరోధం. అన్ని చోట్లు స్త్రీలు ఉండదగ్గ చోట్లే. కాని ఇంట్లో ఉండటం వల్ల, బిడ్డను కనే శారీరక ధర్మం ఆమెకే ఉండటం వల్ల ప్రేమ, బాధ్యత అనే మాటల్లో ఆమెను పెట్టి ఇంటి పని చేయిస్తున్నారు. అంతు లేని ఈ ఇంటి చాకిరికి విలువ ఉంటుందని స్త్రీ ఎప్పుడూ అనుకోదు. విలువ సంగతి అటుంచితే... అంత పని స్త్రీ నెత్తిన ఉండటం గురించి కూడా మాట్లాడదు. గ్లోబల్‌గా చూస్తే పురుషుల కంటే స్త్రీలు 2.8 శాతం ఎక్కువ పని చేస్తున్నారు. భారతదేశంలో ఇది పది శాతమైనా ఉంటుంది. స్త్రీ, పురుషుల శరీర నిర్మాణంలో భేదం ఉంది. కాని ఈ భేదం భేదభావంగా వివక్షగా మారడం ఏ మాత్రం సరి కాదు' అని లక్ష్మీ పురి అన్నారు.



● లక్ష్మీ పురి

'స్త్రీలు పని చేస్తామంటే పురుషులు అడ్డంకులు వేస్తూనే ఉంటారు. ఎందుకు పని చేయడమంటే అది స్త్రీల లక్ష్యం కావచ్చు. ఎంపిక కావచ్చు. ఇష్టం కావచ్చు. ఆర్థిక స్వావలంబన కోసం కావచ్చు. నా డబ్బు తీసుకో ఉంది కదా అని భర్త, తండ్రి, కొడుకు అంటూ ఉంటారు. ఎందుకు తీసుకోవాలి. తాము సంపాదించుకున్న డబ్బు కావాలి అనుకోవచ్చు స్త్రీలు. భారతదేశంలో స్త్రీల జనాభా జపాన్ దేశపు జనాభాకు ఎనిమిది అంతలు ఉంటుంది. అంతటి జనాభా ఉన్నప్పటికీ మన దేశ స్త్రీల అభిప్రాయాలను, భావాలను పరిగణనలోకి తీసుకోరు. దీనిని ఎలా అర్థం చేసుకోవాలి' అని శైలి చోప్రా అన్నారు. 'మగవారి మధ్య బ్రదర్‌హుడ్ ఉంటుంది. స్త్రీల మధ్య సిస్టర్‌హుడ్ బలపడితే అన్నింటిని మార్చగలం. అందుకే నా పుస్తకానికి సిస్టర్‌హుడ్ ఎకానమీ అని పేరు పెట్టాను' అన్నారామె.

'ఇస్రో మహిళా శాస్త్రవేత్తల మీద నేను పుస్తకం రాశాను. వాళ్ల నుంచి విన్న మొదటి మాట మహిళా అనొద్దు... మేమూ శాస్త్రవేత్తలమే... ప్రత్యేకంగా ఎంచడం వల్ల ఏదో ప్రోత్సహిస్తున్న భావన వస్తుంది అంటారు. చాలా బాగుంది. కాని ఇస్రోలో ఇప్పటికీ 16 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు ఇస్రోకు మహిళా శాస్త్రవేత్త డైరెక్టర్ కాలేదు. ఎప్పటికి అవుతారో తెలియదు. మంగళయాన్ వంటి మిషన్‌ను స్త్రీలు విజయవంతం చేసినా... నా కుటుంబం సపోర్ట్ చేయడం వల్లే చేశాను... నా భర్త సపోర్ట్ చేయడం వల్లే చేశాను... వారు చేయనివ్వడం వల్ల చేశాను అని చెప్పుకోవాల్సి వస్తోంది. 'చేయనివ్వడం' అనేది స్త్రీల విషయంలోనే జరుగుతుంది. ఎంత చదివినా, ఎంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా భర్తో/కుటుంబమో వారిని 'చేయనివ్వాలి'... ఈ స్థితి మహిళలకు ఎలాంటి మానసిక అవస్థను కలిగిస్తుందో మగవాళ్లకు తెలియదు. ఉద్యోగం చేస్తున్న స్త్రీ తారసపడితే ఆఫీసు, ఇల్లు ఎలా బేలెన్స్ చేసుకుంటున్నావు అని అడుగుతారు. మగవాడిని ఎందుకనో ఈ ప్రశ్న అడగరు' అన్నారు మిన్నీ వైద్.

'కుటుంబ పరమైన, సామాజిక వొత్తిళ్ల వల్ల పిల్లలు కనే వయసులోని స్త్రీలు తమ వృత్తి, ఉపాధి నుంచి దూరమయ్యి పని చేయడం మానేస్తున్నారు. వారు తమ కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పని చేసే, చేయగలిగే వాతావరణం పూర్తి స్థాయి ఏర్పడాలంటే మగవాళ్లు ఇంకా మారాల్సి ఉంది' అని ఈ వక్తలు అభిప్రాయ పడ్డారు.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి



● గుల్జార్

లతా మంగేష్కర్

నా సినిమా జీవితానికి ఆమె వీసా ఇచ్చింది



● లతా మంగేష్కర్

'మన జీవితంలో పండగ వచ్చినా, నిశ్చితార్థం జరిగినా, పెళ్లి వేడుక, పిల్లాడు పుట్టినా, సుప్రభాత పూజ చేస్తున్నా... ప్రతి సందర్భానికి లతా పాడిన పాట ఉంటుంది. వింటాము. లతా అలా మన జీవితంలో మనకు తెలియకుండానే నిండిపోయింది. అందుకనే ఆమె ఎప్పటికీ వినపడుతూనే ఉంటుంది' అని గీత రచయిత గుల్జార్ అన్నారు.

శనివారం జరిగిన జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో లతా మంగేష్కర్ మీద వెలువర్ధ రాజా పుస్తకం 'లతాజీ- ఏ లైఫ్ ఇన్ మ్యూజిక్' ఆవిష్కరణ సందర్భంగా గుల్జార్ మాట్లాడారు. 'బందినిలో మొర గోర అంగ్ లైలే... నా మొదటి పాట. కాని దానికి మూడేళ్ల ముందు నుంచి లతా దీదీ సంగీత దర్శకుడు ఎస్.డి.బర్మన్‌తో మాట్లాడటం లేదు. ఎస్.డి.బర్మన్ కూడా ఆమెతో మాట్లాడదలుచుకోలేదు. నేనేమో పాట రాశాను. లతా నా పాటను మెచ్చి మొత్తం మీద పాడి నాకు సినిమా రంగంలో ప్రవేశానికి వీసా ఇచ్చింది. ఆ తర్వాత తను ప్రొడ్యూసర్‌గా నా దర్శకత్వంలో 'లేకిన్' నిర్మించింది. నేను ఆమె మీద అభిమానంతో 'నామ్ గుమ్ జాయేగా' (కినారా) పాట రాశాను. ఆ పాటలోని 'మేరి ఆవాజ్ హీ పెహెచాన్ హై' అనే లైన్‌ను మీరు ఆటోగ్రాఫ్ చేసేప్పుడు మెన్షన్ చేసేందుకు వీలుగా రాశాను అని లతాతో చెప్పాను. ఆ లైనే ఆమె బతికి ఉండగానేగాక మరణించాక ఒక అస్తిత్వంగా మారింది' అన్నాడు.

'లతాజీ- ఏ లైఫ్ ఇన్ మ్యూజిక్' పుస్తక రచయిత యతీంద్ర మిశ్రా మాట్లాడుతూ 'ఇవాళ గాయనీ గాయకులు పొందుతున్న రాయల్టీ సౌకర్యాలకు, అవార్డులకు లతా మొదలెట్టిన పోరాటమే కారణం. ఫిల్మ్‌ఫేర్ అవార్డు కొత్తల్లో గాయనీ గాయకులకు ఇచ్చేవారు కాదు. సంగీత దర్శకులకే ఇచ్చేవారు. 'చోరి చోరి' సినిమాలోని 'రసిక్ బల్మా' పాటకు శంకర్ జైకిషన్‌కు ఫిల్మ్‌ఫేర్ వచ్చింది. ఆ వేడుకలో ఆ పాట పాడమని జైకిషన్ లతాను పిలిచాడు. అవార్డు మీకు వచ్చింది... వెళ్లి ట్యూన్ వాయించండి సరిపోతుంది అందామె. గాయని లేకుండా పాట ఎలా? టైమ్స్ గ్రూప్ అధినేత రంగంలో దిగి ఫోన్ చేసి బతిమిలాడినా పాడలేదు. దాంతో ఇంకో రెండేళ్లకు గాయనీ గాయకులకు ఫిల్మ్‌ఫేర్ ప్రవేశపెట్టారు. రాయల్టీ విషయంలో కూడా లతా పట్టుదల వల్లే గాయనీ గాయకులకు డబ్బులు వచ్చాయి' అని తెలియచేశాడు.

లతా పాడిన పాటల వెనుక కథలు, విశేషాలతో 'లతా జీ- ఏ లైఫ్ ఇన్ మ్యూజిక్' వెలువడింది.

హెల్త్

ఒమిక్రాన్ కొత్త సబ్-వేరియెంట్ ఎక్స్‌బిబి 1.5

హెల్త్ టిప్

మెడనొప్పికి టాబ్లెట్ల కంటే టాపికల్ క్రీములే మేలు..!



ఈ ప్రపంచంలోని ప్రతివారూ ఏదో ఒక సమయంలో మెడనొప్పికి గురవుతూనే ఉంటారు. ఈ మెడనొప్పులకు పూత మందులుగా లభ్యమయ్యే నొప్పినివారణ ఆయింట్‌మెంట్స్ చాలానే అందుబాటులో ఉన్నాయి. పైపూతకు వాడే ఆయింట్‌మెంట్స్‌ను 'టాపికల్ మెడిసిన్స్' అంటారు. నోటిద్వారా తీసుకునే పెయిన్‌కిల్లర్స్ ఇటు కిడ్నీలనూ, అటు కాలేయాన్నీ ప్రభావితం చేయవచ్చు. కాబట్టి... నోటి ద్వారా తీసుకునే మందుల కంటే టాపికల్ మెడిసిన్స్ వాడటమే మేలు. నొప్పి తీవ్రతను బట్టి... టాపికల్ క్రీమ్స్‌ను రోజుకు ఐదారు సార్లు రాయవచ్చు. దీంతో పాటు వేడి నీళ్లలో మెత్తటి గుడ్డను ముంచి, పిండి మెడ పైన కాపడం పెట్టడం, లేదా ఐస్ ముక్కను ఒక బట్టలో చుట్టి దానితో 'ఐస్ కాపడం' పెట్టడం కూడా మంచి ఫలితాలే ఇస్తాయి.

మరీ చిన్నపిల్లల్లో చుండ్రు కనిపిస్తే?

చిన్నపిల్లల్లో చుండ్రు వచ్చే సమస్యను 'క్రెడిల్ క్రేప్' అంటారు. దీని తీవ్రత తగ్గించేందుకు కొన్ని జాగ్రత్తలివి... ● పిల్లలకు వారానికి 3-4 సార్లు తల స్నానం చేయించడం మంచిది. ● ఆహారంలో జింక్, బీ-కాంప్లెక్స్‌తో పాటు మల్టీ విటమిన్లు ఎక్కువగా ఉండే ఆహారాలు ఇవ్వాలి. ● పిల్లల మాడు పొడిబారకుండా, తలకు తేమనిచ్చే ఆలివ్ ఆయిల్, మాయిశ్చరైజింగ్ లోషన్ వంటివి వాడాలి. ● అప్పటికీ తగ్గకపోతే డాక్టరుకు చూపించాలి.



చైనాలోని ఊహాన్‌లో వెలుగు చూసిన నాటి నుంచీ కరోనాకు చెందిన అనేక వేరియెంట్లు... విడతలు విడతలుగా, దఫదఫాలుగా వేవ్‌లంటూ వస్తూనే ఉన్నాయి. తొలినాళ్లలో ఆల్ఫా, డెల్టా అంటూ తీవ్రమైన వేరియెంట్ల రూపంలో అనేక మంది ఉసురు తీశాయి. మూడో వేవ్‌గా వచ్చిన ఒమిక్రాన్ తీవ్రత అంతగా లేదుగానీ ఇంతలోనే ఒమిక్రాన్ కాలూకు మరో సబ్-వేరియెంట్ అయిన ఎక్స్‌బిబి 1.5 వచ్చి అమెరికాను అల్లకల్లోలం చేస్తోంది. భారత్‌లోని ఇంటికొకరు చొప్పున అమెరికాలో నివాసముంటూ... రోజూ కొన్ని లక్షల మంది యూఎస్ నుంచి ఇండియాకీ, ఇక్కణ్నుంచి మళ్లీ యూఎస్‌కు వెళ్తూ వస్తూ, పెద్ద ఎత్తున ప్రయాణాలు సాగిస్తున్న నేపథ్యంలో మన దగ్గర ఈ సబ్ వేరియెంట్ ప్రమేయం (రెలవెన్స్) ఏమిటీ, ఎలా ఉంటుందని తెలుసుకోవడం కోసమే ఈ కథనం.



అమెరికాలో ఒమిక్రాన్ కొత్త సబ్ వేరియెంట్!!

మనమెందుకు పట్టించుకోవాలంటే?

ప్రతి జీవీ తన మనుగడ కోసం కొత్త మ్యూటేషన్స్‌తో ముందుకంటే మరింత సమర్థమైన జీవిగా పరిణామం చెందడానికి ప్రయత్నిస్తుంటుంది. ప్రస్తుత ఒమిక్రాన్ సబ్-వేరియెంట్ కూడా జన్యుపరమైన మార్పులను చేసుకుంటూ 500 కంటే ఎక్కువ రూపాలను సంతరించుకుంది. ఈ ఎక్స్‌బీబీ 1.5 కూడా ఇలాంటి ఓ కొత్త సబ్-వేరియెంటే! ఎక్స్‌బీబీ 1.5 అనే ఈ తాజా సబ్-వేరియెంట్... రెండు రకాల వేరియంట్స్ కలిసినందువల్ల, మరో కొత్త వేరియంట్ గా మారింది. అంటే... బీజే-1 (బీఏ.2.10.1.1) అనే ఒక వేరియంటూ, అలాగే బీఏ.2.75 (బీఏ.2.75.3.1.1.1) మరో వేరియెంట్ల కలయిక వల్ల 'ఎక్స్‌బీబీ' అనే ఈ సబ్-వేరియెంట్ పుట్టుకొచ్చింది. అది మరొక మ్యుటేషన్‌కి గురికావడంతో తాజాగా తన ప్రభావం చూపిస్తున్న ఈ 'ఎక్స్‌బీబీ - 1.5' తయారయింది. ఈ సబ్-వేరియెంట్ పుట్టుకకు కారణమైన మ్యుటేషన్‌ని 'ఎఫ్486 పీ' అని పిలుస్తున్నారు.

ఈ వేరియంట్ లక్షణాలేమిటి?

మిగతా కరోనా వేరియెంట్లు, ఒమిక్రాన్ మాదిరిగానే ఎక్స్‌బిబి 1.5 కూడా... జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు కలగజేస్తుంది. వృద్ధుల్లోనూ, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారి (ఇమ్యూనో కాంప్రమైజ్‌డ్ పర్సన్స్)లోనూ, ఇప్పటికే ఇతరత్రా తీవ్రమైన ఇతర ఆరోగ్య సమస్యలున్న(కో-మార్బిడిటీ)వారిలో ఈ వేరియెంట్ కాస్తంత ప్రమాదకారిగా మారే అవకాశం ఉండవచ్చు. అంతే తప్ప మిగతా వారందరిలో ఇదో చిన్న చిన్న వైరల్ ఇన్ఫెక్షన్ లాగా వచ్చి తగ్గిపోయే అవకాశాలే చాలా ఎక్కువ.

మందు లేమిటీ/ నివారణ ఏమిటి?

ఈ వేరియెంట్‌కు మోనోక్లోనల్ యాంటీబాడీ ఇంజెక్షన్లు పనిచేయవు. ఇప్పటికే భారతదేశంలో అనుమతి పొందిన 'పాక్స్ లోవిడ్' ట్యాబ్లెట్లు ఈ సబ్-వేరియెంట్‌కి కాస్తంత సమర్థంగా పనిచేసే అవకాశం కనిపిస్తోంది. అమెరికాలో ఇప్పుడు అందుబాటులో ఉన్న బైవాలెంట్ కరోనా వ్యాక్సిన్లు దీని నుంచి రక్షణ కల్పించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక గతంలో మాదిరిగానే మాస్కులు ధరించడం, సబ్బుతోగానీ, శానిటైజర్లతోగానీ చేతులు తరచూ శుభ్రపరచుకోవడం, ఇంటినీ, పరిసరాలను డిస్-ఇన్ఫెక్టెంట్లతో తరచూ శుభ్రం చేసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సమూహాల్లోకి, గుంపుల్లోకి (క్రౌడ్స్‌లోకి) వెళ్లకుండా ఉండటం వంటి జాగ్రత్తలను పాటిస్తే చాలు.

దీనికి ఓ ముద్దుపేరూ ఉంది...

ఎక్స్‌బీబీ 1.5కి ఓ ముద్దు పేరూ ఉంది. 'క్రాకెన్' అన్నది దీని పెట్‌నేమ్. అంటే 'సముద్ర భూతం' అని అర్థం. అయితే... ఈ నిక్-నేమ్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇవ్వలేదు. కొందరు శాస్త్రవేత్తలు, పరిశోధకులు దీనికా పేరు పెట్టారు. ఇందుకో కారణం కూడా ఉంది. అదేమిటంటే... ఒమిక్రాన్‌కు ఉన్న అనేక వేరియంట్ల కంటే కూడా...

ఈ 'ఎక్స్‌బీబీ-1.5' అన్నది మానవ వ్యాధినిరోధక వ్యవస్థను (ఇమ్యూనిటీని) తప్పించుకోవడంలో దిట్ట అని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. ఈ ఎక్స్‌బీబీ 1.5' సబ్-వేరియెంట్... మునుపటి వేరియంట్ల కంటే మరింత తేలిగ్గా, మరింత బలంగా 'ఏసీఈ2 రిసెప్టార్'లతో అనుసంధానితమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తల నమ్మకం. అందుకే వారు ఈ సబ్-వేరియంట్‌కు 'క్రాకన్' అనే నిక్-నేమ్ ఇచ్చారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏం చెబుతోంది?

అమెరికాలోని వ్యాధుల నిపుణురాలు (ఎపిడిమియాలజిస్ట్) అయిన మేరియా వాన్ కెర్కోవ్ మాట్లాడుతూ "ఇప్పటివరకూ వచ్చిన అన్ని కరోనా వైరస్‌ల కన్నా ఈ ఎక్స్‌బిబి 1.5 చాలా ఎక్కువ వేగంతో వ్యాప్తి చెందుతోంది. అంతేకాదు ప్రస్తుతం దీని ప్రభావం అమెరికాతో పాటు మరో 29 దేశాలలో కనిపిస్తోంది" అన్నారు. "అందువల్ల అమెరికా మాత్రమే కాకుండా మిగతా అన్ని దేశాల ప్రజలతో పాటు అమెరికా నుంచి రాకపోకలు ఎక్కువగా ఉండే భారత్‌లాంటి దేశాల ప్రజలూ, విమాన ప్రయాణీకులందరూ మునుపటిలాగే మాస్కులు ధరించడం వంటి నివారణ చర్యలు చేపట్టడం అవసరం" అంటూ ఆమె (మేరియా) పేర్కొన్నారు. ఇక గతంలో వ్యాక్సిన్ తీసుకున్నవారు సైతం బూస్టరు డోసులు తీసుకోవాలంటూ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' సూచిస్తోంది.

మనదేశంలో ఎక్స్‌బిబి 1.5 వ్యాప్తికి అవకాశమెంత?

ఇప్పుడు ప్రపంచంలోని ఓ మూల నుంచి మరో మూల వరకు రాకపోకలు మామూలైపోయాయి. ప్రపంచమో పల్లెటూరుగా మారినందుకే ఇప్పుడు భూగోళాన్ని 'గ్లోబల్ విలేజ్' అంటూ అభివర్ణిస్తున్నారు. పెద్ద ఎత్తున పెరిగిన రవాణా, రాకపోకలూ, వలసల వంటి వాటివల్ల ఈ కొత్త వేరియంట్ అమెరికా నుంచి అన్ని ప్రాంతాలకూ, ఆ మాటకొస్తే మన దేశానికి సైతం పాకే అవకాశం ఖచ్చితంగా ఉంది.

అయితే ఒకసారి భారత్‌కు వచ్చాక మన దేశవాసులు ఈ ఎక్స్‌బిబి 1.5 తో ఎలాంటి ఇబ్బందులకు లోనవుతారనే విషయాన్ని అంచనా వేయడానికి మాత్రం ఇప్పుడప్పుడే చెప్పడానికి లేదు. ఒమిక్రాన్ కారణంగా మన దేశవాసుల్లో కరోనా పట్ల ఇమ్యూనిటీ చాలా ఎక్కువగా వచ్చింది. అందువల్ల వేగంగా విస్తరించినప్పటికీ ఈ 'ఎక్స్ బి బి 1.5' మన దేశంలో తీవ్రమైన ప్రభావాన్ని కలగజేస్తుందనడానికి మాత్రం ఎలాంటి ఆధారాలు లేవని చెప్పవచ్చు. అందుకే ఈ వేరియెంట్ వల్ల మనదేశవాసులంతా భయాందోళనలకు గురికావలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. కానీ వ్యాధినిరోధక శక్తి కాస్తంత తక్కువగా ఉన్నవారు, ఇతరత్రా వ్యాధులతో ఇప్పటికీ బాధపడుతున్నవారు మాత్రం ఒకింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది.



డా. ఎంఎస్‌ఎస్ ముఖర్జీ,
సీనియర్ కన్సల్టెంట్
కార్డియాలజిస్ట్

హెడ్ అండ్ నెక్ క్యాన్సర్స్.. పరాకువద్దు

తల భాగంలోని శ్వాస-జీర్ణ సంబంధ వ్యవస్థలో వచ్చే క్యాన్సర్స్‌ను హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ అంటారు. పెదవులు, నోరు, చిగుర్లు, నాలుక, నేసల్ క్యావిటీ (ముక్కు భాగం), ఫ్యారింగ్స్, స్వరపేటిక వంటి భాగాలలో క్యాన్సర్స్ హెడ్ అండ్ నెక్ కిందికి వస్తాయి. ఈ క్యాన్సర్స్‌లో 90 శాతం వరకు స్క్వామస్ సెల్ కార్సినోమా రకానికి చెందినవి. అంటే మ్యూకస్ ఉండి ఎప్పుడూ తడిగా ఉండే లోపలి పెదవులు, చిగుర్లు, కాలుక వంటి భాగాలలో ఈ క్యాన్సర్ వస్తుంటాయి. మెదడు, అన్నవాహిక, థైరాయిడ్ గ్రంథి, తలలోని కండరాలు, చర్మానికి వచ్చే క్యాన్సర్స్‌ను క్యాన్సర్స్‌ను హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లుగా పరిగణించరు.

ఊపిరితిత్తుల క్యాన్సర్స్‌కు లాగానే ఈ క్యాన్సర్స్‌కూ ఆల్కహాల్, పొగాకు, దాని సంబంధిత ఉత్పత్తులే ప్రధాన కారణాలు. తల, మెడకు సంబంధించిన క్యాన్సర్స్‌కు 75% కారణాలుగా పొగాకు, పొగాకు సంబంధిత ఉత్పాదనలు, గుట్కా, పాన్, జర్దా, నస్యం, వక్క, బీడీ, చుట్ట, తమలపాకులు, సిగార్‌లు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆల్కహాల్, పొగాకు... రెండు అలవాట్లూ ఉన్నట్లయితే ముప్పు మరింత ఎక్కువ.

నోటిలో తెలుపు ఎరుపు మిళితమైన మచ్చలు (ప్యాచెస్), గొంతు బొంగురుగా ఉండటం, మింగడంలో ఇబ్బంది, దవడల వాపు, శ్వాస తీసుకోవడం, మాట్లాడటం కష్టం కావడం, తలనొప్పి, వినికిడిశక్తి తగ్గడం, చెవిపోటు... ఇలా క్యాన్సర్ కణితి పెరిగే ప్రదేశాన్ని బట్టి లక్షణాలు అనేక రకాలుగా ఉంటాయి.



లక్షణాలు అనుమానాస్పదంగా ఉంటే బయాప్సీ, ఎమ్మారై, పెట్ స్కాన్ వంటి ఇమేజింగ్ ప్రక్రియలతో క్యాన్సర్ వచ్చిన భాగాన్ని పరీక్షించి స్టేజ్‌నూ, గ్రేడింగ్‌లను నిర్ధారణ చేస్తారు. క్యాన్సర్ వచ్చిన భాగం, స్టేజ్, రోగి వయసు, ఆరోగ్యం వంటి అనేక అంశాల ఆధారంగా చికిత్స ఉంటుంది. సర్జరీ, రేడియేషన్, కీమో, టార్గెటెడ్ థెరపీ లేదా అవసరాన్ని బట్టి కొన్ని కాంబినేషన్ థెరపీలూ నిర్ణయిస్తారు.

హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లు ఓరల్ క్యావిటీ అంటే పెదవులు, నాలుక చిగుర్లు, నోటిలోని కింది భాగం, పైభాగం, జ్ఞానదంతాల వెనుకవైపున ఉండే చిగుర్ల వంటి ప్రాంతాల్లో ప్రధానంగా కనిపిస్తుంటాయి.

ఫ్యారింజియల్ : ముక్కు వెనక కూడా ఆ భాగం 5 అంగుళాల లోతు వరకు ఉంటుంది.

లారింజియల్ : మాట్లాడటానికి సహకరించే స్వరపేటిక, వోకల్ కార్డ్స్, ఆహారాన్ని శ్వాసనాళాల్లోకి పోకుండా అడ్డుకునే ఎపిగ్లాటిస్.

పారానేసల్ సైనసెస్‌తో పాటు నేసల్ క్యావిటీ : తల మధ్యభాగంలో ముక్కుకు ఇరువైపులా బోలుగా ఉండే సైనస్‌లు.

లాలాజల (సెలైవరీ) గ్రంథులు : నోటి లోపల కింది భాగంలో దవడ ఎముకలకు ఇరువక్కలా ఉండే లాలాజల గ్రంథులు.

మన దేశంలో కనిపించే ప్రతి మూడు క్యాన్సర్లలో ఒకటి ఈ తరహా క్యాన్సర్లకు సంబంధించినదై ఉంటుంది. లేటు దశలో గుర్తించడం వల్ల లేదా ఇతర భాగాలకు (మెటాస్టాసిస్) క్యాన్సర్ పాకడం వల్ల ఈ క్యాన్సర్‌కు గురైన వారిలో మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. మనదేశంలో ఏడాదికి పది లక్షల మంది వరకు ఈ క్యాన్సర్లకు గురవుతున్నారు. వారిలో దాదాపు రెండు లక్షల మంది వరకు ఈ క్యాన్సర్‌కు సంబంధించినవారే. పొగాకును అనేక రకాలుగా ఉపయోగించడం, సున్నంతో కలిపి ఎక్కువసేపు నోటిలో ఉంచుకోవడం, తమలపాకు, వక్క నమలడం వంటి అలవాట్లే మనదేశంలో ఈ సంఖ్య ఇంతగా పెరగడానికి దోహదం చేస్తున్నాయి.

తొలిదశలో అంటే స్టేజ్ 1, స్టేజ్ 2 లలో కనుగొంటే... కేవలం సర్జరీతోనే ఈ క్యాన్సర్‌కు శాశ్వత పరిష్కారం లభించవచ్చు. సర్జరీ తర్వాత చాలాసార్లు రీ-కన్‌స్ట్రక్టివ్ సర్జరీ అవసరం ఉంటుంది. స్టేజ్ 3, స్టేజ్ 4 లలో కీమో, రేడియేషన్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. 3 డీసీఆర్, వీఎమ్ఏటీ, ఐఎమ్ఆర్‌టీ, ఐజీఆర్‌టీ, బ్రాకీథెరపీ, బీమ్ థెరపీ వంటి ఆధునిక రేడియోథెరపీ పద్ధతులలో చికిత్స విధానాలుంటాయి. సాధారణంగా ఈ క్యాన్సర్‌కు కీమోథెరపీ పాత్ర ఒకింత తక్కువే అని చెప్పుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో కీమోను కంబైన్‌డ్ ట్రీట్‌మెంట్‌గా లేదా కొంతవరకు ఉపశమనంగా ఉపయోగిస్తారు.

ఈ చికిత్స తర్వాత బాధితులు తమకు ఇంతకుముందు ఉన్న అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలి. నోటి పరిశుభ్రతను పాటించాలి. ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, జా-స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్‌ల వంటి వాటిని అనుసరించాలి. డాక్టర్లు సూచించిన మేరకు తప్పనిసరిగా ఫాలో-అప్‌లో ఉండాలి.

మానసిక ఒత్తిడి, విటమిన్ల లోపంతో వచ్చే నోటి పొక్కులు, అల్సర్స్ బాధాకరంగా ఉంటాయి కాబట్టి మనం వాటిని ఎక్కువగా పట్టించుకుంటూ ఉంటాం. నొప్పిలేని వాటిని నిర్లక్ష్యం చేస్తాం. నోటిలో నొప్పి లేకుండా తెలుపు (ల్యూకోప్లేకియా) లేదా ఎరుపు (ఎరిథ్రోప్లేకియా) రంగులో ప్యాచెస్ కనిపించినప్పుడు తప్పక పరీక్షలు చేయించుకోవాలి. చాలామంది డెంటల్ చెకప్స్ లేదా దంత, చిగుర్ల సంబంధిత సమస్యలతో డెంటిస్టుల దగ్గరికి వెళ్లినప్పుడు ఈ సమస్యలు బయటపడుతూ ఉంటాయి. అందుకే తరచూ దంతవైద్యుడిని కలుస్తూ, నోటి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటూ ఉండటం అవసరం.



డా. సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ నంబరు: 9849022121



జీవన్‌-బాలాజీ ద్వయం సంచలనం

చివరి నిమిషంలో ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ టోర్నీలో ఆడే అవకాశం దక్కించుకున్న భారత డబుల్స్‌ జోడీ జీవన్‌ నెడుంజెళియన్‌-శ్రీరామ్‌ బాలాజీ సంచలనం సృష్టించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్‌ తొలి రౌండ్‌లో జీవన్‌-శ్రీరామ్‌ బాలాజీ ద్వయం 7-6 (8/6), 2-6, 6-4తో ఐదో సీడ్‌ ఇవాన్‌ డోడిగ్‌ (క్రొయేషియా)-ఆస్టిన్‌ క్రాయిసెక్‌ (అమెరికా) జోడీని బోల్తా కొట్టించి రెండో రౌండ్‌కు చేరుకుంది.

'మిక్స్‌డ్‌' ప్రిక్వార్టర్‌ ఫైనల్లో సానియా జోడీ



తన కెరీర్‌లో చివరి గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ ఆడుతున్న భారత టెన్నిస్‌ స్టార్‌ సానియా మీర్జా ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌ మిక్స్‌డ్‌ డబుల్స్‌ విభాగంలో ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన తొలి రౌండ్‌లో సానియా-రోహన్‌ బోపన్న (భారత్‌) జోడీ 7-5, 6-3తో జైమీ ఫోర్లిస్‌-ల్యూక్‌ సావిల్లె (ఆస్ట్రేలియా) ద్వయంపై నెగ్గింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా-బోపన్న ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్‌ చేశారు.

మన బౌలింగ్‌ భళా...

ఎలాంటి సంచలన ప్రదర్శనలు, ఎలాంటి ప్రతిఘటన, పోరాటాలు లేవు... అంతా ఏకపక్షమే, భారత్‌ పక్షమే.. తొలి వన్డేలో మన జట్టును వణికించిన న్యూజిలాండ్‌ రెండో పోరులో పూర్తిగా చేతులెత్తేసింది. భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేక 108 పరుగులకే ఆట కట్టేసి ముందే ఓటమికి సిద్ధమైంది. ఆ తర్వాత ఆడుతూ పాడుతూ ఛేదన పూర్తి చేసిన భారత్‌ మరో సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది.

- 108 పరుగులకే కుప్పకూలిన కివీస్‌
- 8 వికెట్లతో భారత్‌ ఘనవిజయం
- 2-0తో వన్డే సిరీస్‌ సొంతం
- మంగళవారం ఇండోర్‌లో చివరి వన్డే


షమీ


మ్యాచ్‌ సమయంలో మైదానంలోకి దూసుకొచ్చి రోహిత్‌ను హత్తుకున్న అభిమాని

రాయ్‌పూర్‌: తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లో రాయ్‌పూర్‌ అభిమానులకు తగిన ఆనందం దక్కలేదు. మొత్తం మ్యాచ్‌ 54.4 ఓవర్లలోనే ముగిసిపోయింది. శనివారం జరిగిన రెండో వన్డేలో భారత్‌ 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. టాస్‌ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ 34.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. భారత్‌పై ఆ జట్టుకు ఇది మూడో అత్యల్ప స్కోరు. గ్లెన్‌ ఫిలిప్స్‌ (52 బంతుల్లో 36; 5 ఫోర్లు) టాప్‌ స్కోరర్‌. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' షమీ (3/18) కివీస్‌ను దెబ్బ తీశాడు. అనంతరం భారత్‌ 20.1 ఓవర్లలో 2 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. రోహిత్‌ శర్మ (50 బంతుల్లో 51; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్‌ గిల్‌ (53 బంతుల్లో 40 నాటౌట్‌; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించి విజయానికి పునాది వేశారు. భారత్‌కు సొంతగడ్డపై ఇది వరుసగా ఏడో వన్డే సిరీస్‌ విజయం. చివరిదైన మూడో వన్డే మంగళవారం ఇండోర్‌లో జరుగుతుంది.

సమష్టి వైఫల్యం...

ఇన్నింగ్స్‌ ఐదో బంతికి అలెన్‌ (0)ను షమీ బౌల్డ్‌ చేయడంతో కివీస్‌ పతనం మొదలైంది. ఆ తర్వాత పరుగు తేడాతో నికోల్స్‌ (2), మిచెల్‌ (1) వెనుదిరగ్గా... ఆరు బంతుల వ్యవధిలో కాన్వే (7), లాథమ్‌ (1) అవుటయ్యారు. దాంతో కేవలం 15 పరుగుల స్కోరు వద్దే కివీస్‌ సగం బ్యాటర్లు పెవిలియన్‌ చేరారు. ఈ దశలో ఫిలిప్స్‌తో కలిసి గత మ్యాచ్‌ హీరోలు బ్రేస్‌వెల్‌, సాన్‌ట్నర్‌ పోరాడారు. ఫిలిప్స్‌... ఆరో వికెట్‌కు బ్రేస్‌వెల్‌తో 41 పరుగులు, ఏడో వికెట్‌కు సాన్‌ట్నర్‌తో 47 పరుగులు జోడించాడు. షమీ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి జోరు పెంచే ప్రయత్నం చేసిన బ్రేస్‌వెల్‌ తర్వాతి బంతికి అవుట్‌ కాగా, కుల్దీప్‌ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన సాన్‌ట్నర్‌ను పాండ్యా వెనక్కి పంపించాడు. స్కోరు 100 దాటాక తర్వాతి రెండు వికెట్లు సుందర్‌ ఖాతాలో చేరగా, కుల్దీప్‌ చివరి వికెట్‌ పడగొట్టాడు.

స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. రోహిత్‌, గిల్‌ చక్కటి షాట్లతో పరుగులు రాబట్టడంతో 10 ఓవర్లలో స్కోరు 52/0కు చేరింది. 47 బంతుల్లో రోహిత్‌ హాఫ్‌ సెంచరీ పూర్తయ్యాక టిక్నర్‌ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. కోహ్లి (11) విఫలంకాగా... అప్పటికే కుదురుకున్న గిల్‌... ఇషాన్‌ కిషన్‌ (8 నాటౌట్‌)తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు.

రోహిత్‌ మతిమరుపు...



టాస్‌ సమయంలో అనూహ్య ఘటన జరిగింది. టాస్‌ గెలిచిన రోహిత్‌ ఏం ఎంచుకోవాలో చెప్పకుండా కొన్ని క్షణాల పాటు తటపటాయించాడు. టాస్‌ గెలిస్తే ఏం చేయాలో తాను మరచిపోయానని అంటూ కొంత ఆలోచించి, ఆలోచించి చివరకు ఫీల్డింగ్‌ అంటూ చెప్పడం నవ్వు తెప్పించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్‌ ఇన్నింగ్స్‌: అలెన్‌ (బి) షమీ 0; కాన్వే (సి అండ్‌ బి) పాండ్యా 7; నికోల్స్‌ (సి) గిల్‌ (బి) సిరాజ్‌ 2; మిచెల్‌ (సి అండ్‌ బి) షమీ 1; ఫిలిప్స్‌ (సి) సూర్యకుమార్‌ (బి) సుందర్‌ 36; బ్రేస్‌వెల్‌ (సి) ఇషాన్‌ (బి) షమీ 22; సాన్‌ట్నర్‌ (బి) పాండ్యా 27; షిప్లీ (నాటౌట్‌) 2; ఫెర్గూసన్‌ (సి) సూర్యకుమార్‌ (బి) సుందర్‌ 1; టిక్నర్‌ (ఎల్బీ) (బి) కుల్దీప్‌ 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (34.3 ఓవర్లలో ఆలౌట్‌) 108.** **వికెట్ల పతనం:** 1-0, 2-8, 3-9, 4-15, 5-15, 6-56, 7-103, 8-103, 9-105, 10-108. **బౌలింగ్‌:** షమీ 6-1-18-3, సిరాజ్‌ 6-1-10-1, శార్దుల్‌ 6-1-26-1, హార్దిక్‌ పాండ్యా 6-3-16-2, కుల్దీప్‌ 7.3-0-29-1, వాషింగ్టన్‌ సుందర్‌ 3-1-7-2.

భారత్‌ ఇన్నింగ్స్‌: రోహిత్‌ (ఎల్బీ) (బి) టిక్నర్‌ 51; గిల్‌ (నాటౌట్‌) 40; కోహ్లి (స్టంప్డ్‌) లాథమ్‌ (బి) సాన్‌ట్నర్‌ 11; ఇషాన్‌ (నాటౌట్‌) 8; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20.1 ఓవర్లలో 2 వికెట్లకు) 111.** **వికెట్ల పతనం:** 1-72, 2-98. **బౌలింగ్‌:** ఫెర్గూసన్‌ 5-0-21-0, షిప్లీ 5-0-29-1, టిక్నర్‌ 4-0-19-0, సాన్‌ట్నర్‌ 4.1-0-28-1, బ్రేస్‌వెల్‌ 2-0-13-0.

ముగ్గురు సభ్యులతో కమిటీ

- కేంద్ర క్రీడా శాఖ ప్రకటన
- విచారణ ముగిసేవరకు డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్ష పదవికి బ్రిజ్‌భూషణ్‌ దూరం
- డబ్ల్యూఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్‌ తోమర్‌ సస్పెండ్‌
- నిరసన విరమించిన రెజ్లర్లు


మీడియా సమావేశంలో కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌, రెజ్లర్లు బజరంగ్‌, వినేశ్‌

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్‌లో నెలకొన్న తాజా వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర క్రీడాశాఖ నడుం బిగించింది. భారత రెజ్లింగ్‌ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ శరణ్‌ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు, ఇతర సమస్యలపై విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు క్రీడా శాఖ ప్రకటించింది. ఇదే కమిటీ ఇకపై రెజ్లింగ్‌ రోజువారీ వ్యవహారాలు కూడా పర్యవేక్షిస్తుంది. విచారణ ముగిసే వరకు బ్రిజ్‌భూషణ్‌ తన పదవి నుంచి దూరంగా ఉంటారు. ఈ వివాదంలో డబ్ల్యూఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్‌ తోమర్‌ను కేంద్ర క్రీడా శాఖ సస్పెండ్‌ చేసింది. శనివారం బ్రిజ్‌భూషణ్‌ పర్యవేక్షణలో ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో మొదలైన జాతీయ ఓపెన్‌ ర్యాంకింగ్‌ రెజ్లింగ్‌ టోర్నమెంట్‌ను నిలిపివేయాలని కేంద్ర క్రీడా శాఖ ఆదేశించింది. రెజ్లింగ్‌ వివాదంపై చర్చించేందుకు అనురాగ్‌ ఠాకూర్‌, క్రీడా కార్యదర్శి సుజాత చతుర్వేది, 'సాయ్‌' డీజీ సందీప్‌ ప్రధాన్‌లు శనివారం సమావేశమయ్యారు. ఏర్పాటు చేయబోయే కమిటీలో సభ్యుల పేర్లను ఆదివారం ప్రకటించే అవకాశం ఉంది. రెజ్లర్ల నిరసన నేపథ్యంలో ఈ అంశంపై విచారించేందుకు శనివారమే భారత ఒలింపిక్‌ సంఘం (ఐఓఏ) కూడా ఇప్పటికే ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. మేరీకోమ్‌, యోగేశ్వర్‌, డోలా బెనర్జీ తదితరులు ఇందులో ఉన్నారు. ఈ కమిటీ ప్రకటన తర్వాత రెజ్లర్లు అర్ధరాత్రి తమ నిరసనను విరమించారు. మరోవైపు తాజా ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ క్రీడా శాఖ ఇచ్చిన ఆదేశాలపై డబ్ల్యూఎఫ్‌ఐ స్పందించింది. రెజ్లర్లు చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలనీ డబ్ల్యూఎఫ్‌ఐ సభ్యులు స్పష్టం చేశారు. ఈ ఏడాది డబ్ల్యూఎఫ్‌ఐలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా తమను దెబ్బ తీసేందుకు వెనక నుంచి ఇదంతా నడిపిస్తున్నారని, ఇప్పటివరకు కూడా ఫెడరేషన్‌ ఆటగాళ్ల ప్రయోజనాల కోసమే పారదర్శకంగా పని చేసిందని కార్యదర్శి వీఎన్‌ ప్రసాద్‌ వివరణ ఇచ్చారు.

ప్రపంచకప్‌ హాకీ టోర్నీ

నేటి 'క్రాస్‌ ఓవర్‌' మ్యాచ్‌లు

మలేసియా X స్పెయిన్‌
సాయంత్రం గం. 4:30 నుంచి

భారత్‌ X న్యూజిలాండ్‌
రాత్రి గం. 7 నుంచి

స్టార్‌ స్పోర్ట్స్‌-2లో ప్రత్యక్ష ప్రసారం

నోట్‌: 'క్రాస్‌ ఓవర్‌ మ్యాచ్‌'ల్లో గెలిచిన జట్లు క్వార్టర్‌ ఫైనల్‌ చేరుకుంటాయి.

భారత్‌కు తొలి ఓటమి

పోష్‌స్ట్రూమ్‌ (దక్షిణాఫ్రికా): తొలిసారి నిర్వహిస్తున్న అండర్‌-19 మహిళల టి20 ప్రపంచకప్‌ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. లీగ్‌ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమిండియా... శనివారం జరిగిన 'సూపర్‌ సిక్స్‌' గ్రూప్‌-1 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ 18.5 ఓవర్లలో 87 పరుగులకే ఆలౌటైంది. శ్వేత సెహ్రావత్‌ (21; 3 ఫోర్లు), వృషిత (14; 1 ఫోర్‌), టిటాస్‌ సాధు (14; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. అనంతరం ఆస్ట్రేలియా 13.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసి గెలిచింది. నేడు జరిగే రెండో మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్‌ ఆడుతుంది.

ఎదురులేని జొకోవిచ్‌

- ప్రిక్వార్టర్‌ ఫైనల్లో సెర్బియా స్టార్‌
- పోరాడి ఓడిన ముర్రే


జొకోవిచ్‌

మెల్‌బోర్న్‌: పదోసారి ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టైటిల్‌ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన తొమ్మిదిసార్లు చాంపియన్‌, సెర్బియా స్టార్‌ నొవాక్‌ జొకోవిచ్‌ ఆ దిశగా మరో అడుగు ముందుకేశాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్‌ మూడో రౌండ్‌ మ్యాచ్‌లో నాలుగో సీడ్‌ జొకోవిచ్‌ 7-6 (9/7), 6-3, 6-4తో 27వ సీడ్‌ దిమిత్రోవ్‌ (బల్గేరియా)పై గెలిచి ఈ టోర్నీలో 13వసారి ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరాడు. 3 గంటల 7 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్‌ 11 ఏస్‌లు సంధించాడు. 28 విన్నర్స్‌ కొట్టిన అతడు 22 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్‌ వద్దకు 20 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు గెలిచాడు. ఐదుసార్లు దిమిత్రోవ్‌ సర్వీస్‌ను బ్రేక్‌ చేసిన జొకోవిచ్‌ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయాడు.

మరోవైపు ఐదుసార్లు రన్నరప్‌, బ్రిటన్‌ స్టార్‌ ఆండీ ముర్రే కథ ముగిసింది. తొలి రెండు రౌండ్‌ మ్యాచ్‌ల్లో ఐదు సెట్‌లపాటు పోరాడి గెలిచిన ముర్రే మూడో రౌండ్‌లో మాత్రం పుంజుకోలేకపోయాడు. బాటిస్టా అగుట్‌ (స్పెయిన్‌) 6-1, 6-7 (7/9), 6-3, 6-4తో ముర్రేను ఓడించి ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరాడు. ఐదో సీడ్‌ రుబ్లెవ్‌ (రష్యా), తొమ్మిదో సీడ్‌ హోల్గర్‌ రూన్‌ (డెన్మార్క్‌) కూడా ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి ప్రవేశించారు. 2004 తర్వాత ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌లో అత్యధికంగా నలుగురు అమెరికా ఆటగాళ్లు ప్రిక్వార్టర్‌ ఫైనల్‌కు చేరారు.

సబలెంకా, గార్సియా ముందంజ

మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్‌ సబలెంకా (బెలారస్‌), నాలుగో సీడ్‌ కరోలినా గార్సియా (ఫ్రాన్స్‌), 12వ సీడ్‌ బెలిండా బెన్‌చిచ్‌ (స్విట్జర్లాండ్‌) ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి అడుగుపెట్టారు. మూడో రౌండ్‌ మ్యాచ్‌ ల్లో సబలెంకా 6-2, 6-3తో ఎలీజ్‌ మెర్‌టెన్స్‌ (బెల్జియం)పై, గార్సియా 1-6, 6-3, 6-3తో లౌరా సీగెమండ్‌ (జర్మనీ)పై, బెన్‌చిచ్‌ 6-2, 7-5తో కామిల్లా జియార్జి (ఇటలీ)పై గెలిచారు.



బిజీ బిజీ

● కథానాయికల క్యాలెండర్‌

హీరోలు దాదాపు ఒకే భాషకు పరిమితం అవుతారు. అయితే హీరోయిన్లు పలు భాషల్లో నటిస్తుంటారు. అందుకే కొందరు కథానాయికలు కొత్త సినిమాలకు డేట్స్‌ ఇవ్వడానికి డైరీని ఒకటికి రెండు సార్లు చెక్‌ చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని అవకాశాలు వస్తాయి. మరి.. ఈ ఏడాది క్యాలెండర్‌లో ఏ హీరోయిన్‌ డైరీలో ఎన్ని చిత్రాలున్నాయో తెలుసుకుందాం.



అనుష్క: అనుష్క లీడ్‌ రోల్‌లో రూపొందిన 'నిశ్శబ్దం' సినిమా 2020 అక్టోబర్‌ 2న రిలీజైంది. ఆ తర్వాత రెండేళ్లు ఆమె తెరపై కనిపించలేదు. దాంతో అనుష్క నెక్ట్స్‌ ప్రాజెక్ట్‌ ఏంటి? అనేది ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో యువ హీరో నవీన్‌ పోలిశెట్టి హీరోగా నటిస్తున్న సినిమాలో నటించేందుకు పచ్చజెండా ఊపి, అందర్నీ ఆశ్చర్యపరిచారు అనుష్క. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్‌ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రంతో బిజీగా ఉన్నారు అనుష్క.

త్రిష: ప్రస్తుతం త్రిష చేతిలో నాలుగు సినిమాలున్నాయి. వాటిలో 'సదురంగ వేట్టై 2, పొన్నియిన్‌ సెల్వన్‌ 2, ది రోడ్‌' వంటి తమిళ చిత్రాలతో పాటు మోహన్‌లాల్‌ హీరోగా నటిస్తున్న మలయాళ చిత్రం 'రామ్‌' ఉన్నాయి. ఇక 2016లో విడుదలైన 'నాయకి' తర్వాత త్రిష తెలుగులో నేరుగా ఏ సినిమాలోనూ నటించలేదు.

తమన్నా: ఇండస్ట్రీకి వచ్చి 17 ఏళ్లు అవుతున్నా వరుస ఆఫర్లతో బిజీగా ఉన్నారు మిల్కీ బ్యూటీ తమన్నా. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'భోళా శంకర్‌', తమిళంలో రజనీకాంత్‌ సరసన 'జైలర్‌', మలయాళంలో 'బాంద్రా' అనే సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఆమె నటించిన తాజా హిందీ చిత్రం 'బోలే చూడియా' విడుదలకు సిద్ధంగా ఉంది.

కాజల్‌ అగర్వాల్‌: ఈ ఏడాది నాలుగు సినిమాలతో అలరించనున్నారు కాజల్‌. ఆమె నటించిన తమిళ చిత్రాలు 'కురుంగాప్పియమ్‌, ఘోస్టీ' విడుదలకు సిద్ధమవుతున్నాయి. హిందీలో చేసిన 'ఉమ' కూడా విడుదల కావాల్సి ఉంది. ఇక కమల్‌హాసన్‌ హీరోగా శంకర్‌ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఇండియన్‌ 2' (భారతీయుడు 2) చిత్రంలో నటిస్తున్నారు.

నయనతార: గత ఏడాది తెలుగులో 'గాడ్‌ ఫాదర్‌' చిత్రంలో నటించిన నయనతార ఈ ఏడాది తెలుగు సినిమాలేవీ కమిట్‌ కాలేదు. హిందీ చిత్రం 'జవాన్‌'లో షారుక్‌ ఖాన్‌ సరసన నటిస్తున్నారామె. బాలీవుడ్‌లో నయనకి ఇది తొలి చిత్రం. తమిళంలో 'ఇరైవన్‌' చిత్రంలో నటిస్తున్నారు.

శ్రుతీహాసన్‌: ఈ ఏడాది సంక్రాంతికి 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' చిత్రాల్లో అలరించారు శ్రుతీహాసన్‌. ప్రస్తుతం ఆమె ప్రభాస్‌కి జోడీగా 'సలార్‌'లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్‌ 28న విడుదలకానుంది. మరోవైపు 'ది ఐ' అనే ఇంగ్లిష్‌ ప్రాజెక్ట్‌లోనూ నటిస్తున్నారు శ్రుతీహాసన్‌.

కీర్తి సురేశ్‌: ప్రస్తుతం అరడజనుకు పైగా సినిమాల్లో నటిస్తున్నారు. కీర్తీ సురేశ్‌. తెలుగులో చిరంజీవి హీరోగా రూపొందుతోన్న 'భోళా శంకర్‌'లో చిరంజీవి చెల్లెలి పాత్ర చేస్తున్నారు కీర్తి. నాని హీరోగా తెరకెక్కుతోన్న 'దసరా'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళంలో 'మామన్నన్‌, సైరన్‌, రఘు తాతా, రివాల్వర్‌ రీటా' వంటి చిత్రాలతో జోరుగా ఉన్నారు కీర్తీ సురేశ్‌.

పూజా హెగ్డే: గత ఏడాది ఐదు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించిన పూజా హెగ్డే ప్రస్తుతం ఒక తెలుగు, మరో హిందీ సినిమా చేస్తున్నారు. త్రివిక్రమ్‌ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో మహేశ్‌బాబుకి జోడీగా నటిస్తున్నారామె. అలాగే 'కిసీ కా భాయ్‌ కిసీ కీ జాన్‌' అనే హిందీ చిత్రం చేస్తున్నారు.

రష్మికా మందన్న: కన్నడ బ్యూటీ రష్మికా మందన్నా ఈ సంక్రాంతికి 'వారీసు' ('వారసుడు) తో తెరపైకి వచ్చారు. అలాగే హిందీలో నటించిన 'మిషన్‌ మజ్ను' శుక్రవారం రిలీజైంది. ప్రస్తుతం ఆమె తెలుగులో అల్లు అర్జున్‌ సరసన 'పుష్ప 2'లో నటిస్తున్నారు. అలాగే రణ్‌బీర్‌ కపూర్‌ సరసన హిందీ చిత్రం 'యానిమల్‌'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు.

కృతీ శెట్టి: గత ఏడాది 'బంగార్రాజు, ది వారియర్‌, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కృతి. ప్రస్తుతం ఆమె నటిస్తున్న తెలుగు చిత్రం 'కస్టడీ'. 'బంగార్రాజు' తర్వాత నాగచైతన్య సరసన ఆమె నటిస్తున్న చిత్రం ఇది. అలాగే 'అజయంటే రండం మోషణం' అనే మలయాళ చిత్రంలోనూ నటిస్తున్నారు.

శ్రీలీల: దక్షిణాదిలో దూసుకెళుతున్న యంగ్‌ హీరోయిన్ల జాబితాలో టాప్‌ ప్లేస్‌లో ఉన్నారు శ్రీలీల. 'పెళ్లిసందడి' సినిమాతో తెలుగుకి పరిచయమైన ఈ బ్యూటీ గత ఏడాది 'ధమాకా'లో కనిపించారు. ప్రస్తుతం మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్‌ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంతో పాటు బాలకృష్ణ హీరోగా అనిల్‌ రావిపూడి తెరకెక్కిస్తున్న మూవీలో నటిస్తున్నారు. అలాగే రామ్‌ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న సినిమాతో పాటు 'అనగనగా ఒకరాజు, జూనియర్‌ (తెలుగు-కన్నడ) వంటి సినిమాలతో తీరిక లేకుండా ఉన్నారీ బ్యూటీ.

అదేవిధంగా బాలీవుడ్‌ బ్యూటీలు దీపికా పదుకోన్‌, కియారా అద్వానీ, కృతీ సనన్‌ అటు తెలుగు, ఇటు హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రభాస్‌ హీరోగా నటిస్తున్న 'ప్రాజెక్ట్‌ కె'తో దీపికా పదుకోన్‌ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్‌లో ఆమె నటించిన 'పఠాన్‌' ఈ నెల 25న రిలీజ్‌ కానుండగా, 'ఫైటర్‌' అనే సినిమాలో నటిస్తున్నారు దీపిక. ఇక రామ్‌చరణ్‌ హీరోగా శంకర్‌ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'వినయ విధేయ రామ' తర్వాత చరణ్‌-కియారా జంటగా నటిస్తున్న చిత్రమిది. అలాగే 'సత్యప్రేమ్‌ కీ కథ' అనే హిందీ చిత్రం చేస్తున్నారు కియారా. ప్రభాస్‌ హీరోగా ఓం రౌత్‌ తెరకెక్కించిన 'ఆది పురుష్‌'లో హీరోయిన్‌గా నటించారు కృతీ సనన్‌. జూన్‌ 16న ఈ సినిమా విడుదల కానుంది. హిందీలో 'షెహజాదా, గణపత్‌'తో పాటు మరో సినిమా చేస్తున్నారు కృతీ సనన్‌.



సమంత లీడ్‌ రోల్‌ చేసిన 'యశోద' గత ఏడాది రిలీజైన విషయం తెలిసిందే. గుణశేఖర్‌ దర్శకత్వంలో ఆమె లీడ్‌ రోల్‌ చేసిన 'శాకుంతలం' ఫిబ్రవరి 17న విడుదల కానుంది. ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న 'ఖుషి'లో విజయ్‌ దేవరకొండకి జోడీగా నటిస్తున్నారు సమంత. మరోవైపు 'సిటాడెల్‌' అనే వెబ్‌ సిరీస్‌ కమిట్‌ అయ్యారు. అయితే మయోసైటిస్‌ వ్యాధి చికిత్సలో భాగంగా ఆరు నెలలుగా షూటింగ్స్‌కు దూరంగా ఉంటున్నారామె. ఇప్పుడు కోలుకున్న సమంత ముంబైలో 'సిటాడెల్‌' షూట్‌లో పాల్గొంటున్నారు. సమంతకు పేరు తెచ్చిన 'ది ఫ్యామిలీమేన్‌ 2' వెబ్‌ సిరీస్‌కి దర్శకత్వం వహించిన రాజ్‌ అండ్‌ డీకే ఈ సిరీస్‌కి దర్శకులు.




కామెరూన్‌, రాజమౌళి, కీరవాణి


హాలీవుడ్‌కి వస్తారా.. చర్చించుకుందాం

- రాజమౌళితో కామెరూన్‌

అమెరికాలో ఇటీవల జరిగిన క్రిటిక్స్‌ చాయిస్‌ అవార్డ్స్‌ ప్రదానోత్సవం వేదికగా హాలీవుడ్‌ దర్శకుడు జేమ్స్‌ కామెరూన్‌, ఇండియన్‌ డైరెక్టర్‌ రాజమౌళి కలిసిన సంగతి తెలిసిందే. 'ఆర్‌ఆర్‌ఆర్‌' సినిమాను జేమ్స్‌ కామెరూన్‌ రెండుసార్లు చూసి ప్రశంసించారని సోషల్‌ మీడియా వేదికగా రాజమౌళి పేర్కొన్నారు. కాగా జేమ్స్‌ కామెరూన్‌, రాజమౌళిల సంభాషణకు సంబంధించిన ఓ వీడియోను 'ఆర్‌ఆర్‌ఆర్‌' టీమ్‌ శనివారం షేర్‌ చేసింది. ''సినిమాలో చూపిన ఫైర్‌ అండ్‌ వాటర్‌ కాన్సెప్ట్‌, కథలో ఉన్న ట్విస్ట్స్‌ అండ్‌ టర్న్స్‌, రామ్‌, భీమ్‌ పాత్రల స్నేహం, ఇద్దరూ ఎందుకు శత్రువులయ్యారు? అనే అంశాలు ఆసక్తికరంగా అనిపించాయి. మీరు (రాజమౌళిని ఉద్దేశించి) ఇక్కడ (హాలీవుడ్‌లో) సినిమా చేయాలనుకుంటే మనం ఓసారి చర్చించుకుందాం. మీరు (కీరవాణిని ఉద్దేశించి) కంపోజ్‌ చేసిన మ్యూజిక్‌ చాలా బాగుంది. గోల్డెన్‌ గ్లోబ్స్‌ అవార్డ్స్‌ వేడుకలో మిమ్మల్ని చూశాను'' అంటూ 'ఆర్‌ఆర్‌ఆర్‌'ను ప్రశంసిస్తూ జేమ్స్‌ కామెరూన్‌ మాట్లాడిన విషయాలు ఈ వీడియోలో ఉన్నాయి. అదే విధంగా జేమ్స్‌ కామెరూన్‌ దర్శకత్వంలో వచ్చిన అన్ని సినిమాలను తాను చూశానని, అద్భుతంగా ఉన్నాయనీ రాజమౌళి ఈ వీడియోలో మాట్లాడారు. ఇక క్రిటిక్స్‌ చాయిస్‌ అవార్డ్స్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్‌'కు రెండు అవార్డులు (బెస్ట్‌ ఫారిన్‌ ఫిల్మ్‌, బెస్ట్‌ ఒరిజినల్‌ స్కోర్‌) వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే గోల్డెన్‌ గ్లోబ్‌ అవార్డ్స్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్‌'లోని 'నాటు నాటు' పాటకు బెస్ట్‌ ఒరిజినల్‌ స్కోర్‌ విభాగంలో అవార్డు అందుకున్నారు కీరవాణి. ఎన్టీఆర్‌, రామ్‌చరణ్‌ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్‌' ఆస్కార్‌ రేస్‌లో ఉంది. ఈ నెల 24న నామినేషన్స్‌ ప్రకటిస్తారు. మరి.. 'ఆర్‌ఆర్‌ఆర్‌'కి ఆస్కార్‌ నామినేషన్‌ దక్కుతుందా? చూడాలి.

ఆ బాధ్యత మాదే

- ఆశిష్‌ విద్యార్థి



''తోటి నటీనటులతో పాటు యాక్ట్‌ చేస్తూ, నా పాత్రకు ఎంత వరకు న్యాయం చేస్తున్నా ననే విషయంపై మాత్రమే నేను దృష్టి పెడతాను. అంతేకానీ ఇది చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడాలు చూడను'' అన్నారు నటుడు ఆశిష్‌ విద్యార్థి. సుహాస్‌ టైటిల్‌ రోల్‌లో నటించిన చిత్రం 'రైటర్‌ పద్మభూషణ్‌'. షణ్ముఖ ప్రశాంత్‌ దర్శకత్వంలో జి. మనోహర్‌ సమర్పణలో అనురాగ్‌ రెడ్డి, శరత్‌ చంద్ర, చంద్రు మనోహర్‌ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీ రోల్‌ చేసిన నటుడు ఆశిష్‌ విద్యార్థి మాట్లాడుతూ– ''మంచి హ్యూమర్‌, ఎమోషన్స్‌ ఉన్న సినిమా ఇది. ఈ చిత్రంలో కొడుకు ఏదో సాధిస్తాడని ఆశపడే ఓ మధ్యతరగతి తండ్రి పాత్రలో నటించాను. కానీ ఈ తండ్రి జీవితంలో ఓ ట్విస్ట్‌ ఉంటుంది. ఈ సినిమాలో నాకు, రోహిణీగారికి మధ్య వచ్చే సన్నివేశాలు అలరిస్తాయి'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''చేసే ప్రతి పాత్రను నేను డ్రీమ్‌ రోల్‌గానే భావిస్తాను. మొదట్లో విలన్‌ రోల్స్‌ చేశాను. అయితే నాకు కామెడీ అంటే ఇష్టం. కానీ నాకు అన్ని రకాల పాత్రలూ చేయాలని ఉంది. అయితే మనకు ఎటువంటి పాత్రలు ఇవ్వాలనేది దర్శక-రచయితలపై ఆధారపడి ఉంటుంది. అలాగే ఏ పాత్ర ఇచ్చినా ఆ పాత్రకు మేం న్యాయం చేస్తామనే నమ్మకాన్ని వారిలో కలిగించే బాధ్యత మా ఆర్టిస్టులదే'' అని అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఆర్థిక సంక్షోభంలో విద్యుత్ సంస్థలు

పంపిణీ సంస్థల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం

- నష్టాల నుంచి గట్టెక్కాలంటే మీటర్ సేల్స్ పెంచి...వృథా ఖర్చులు తగ్గించాల్సిందే
- సాంకేతిక సామర్థ్యం అద్భుతంగా ఉన్నా..ఆర్థికంగా వెనుకబాటు
- విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో సీఎండీ ప్రభాకర్‌రావు



డైరీని ఆవిష్కరిస్తున్న రఘుమారెడ్డి, ప్రభాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: 'సాంకేతిక సామర్థ్యంలో తెలంగాణ విద్యుత్ సంస్థలు దేశంలోని ఇతర డిస్కంల కంటే ముందున్నా...ఆర్థికంగా కొంత వెనుకబడిపోయాయి. నష్టాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఆయా పంపిణీ సంస్థల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ఈ నష్టాల నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలు గట్టెక్కాలంటే మీటర్ సేల్స్ పెంచాలి. అంతర్గత వృథా ఖర్చులు తగ్గించుకోవాలి' అని తెలంగాణ విద్యుత్ (ట్రాన్స్‌కో,జెన్‌కో) సంస్థల సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అభిప్రాయపడ్డారు. శనివారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ–2023 ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం. ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలు కొంత మెరుగ్గా ఉన్నా.. పంపిణీ సంస్థలు మాత్రం నష్టాలను చవి చూస్తున్నాయి. ప్రభుత్వం అనేక విధాలుగా సహకరిస్తున్నా నష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నష్టాల్లో ఉన్న సంస్థలను ఇక లాభాల బాట పట్టించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉంది. లేదంటే సంస్థల మనుగడే కాదు ఉద్యోగుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుతం రోజుకో రకమైన సైబర్ క్రైం వెలుగు చూస్తోంది. విద్యుత్ సంస్థలకు ఈ క్రైం సవాల్ విసురుతోంది. ఇంజనీర్లు, అకౌంటెంట్లు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి. సైబర్ నేరగాళ్లకు సంస్థలు చిక్కకుండా చూడాలి. సాంకేతిక పరిజ్ఞానమే కాదు ఆర్థిక వనరులు వారి చేతికి చిక్కకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపైనే ఉంది. అకౌంటెంట్లు కేవలం అకౌంట్స్‌ను నిర్వహించడమే కాదు బ్యాలెన్స్ షీట్‌ను మెయింటెన్ చేయాలి. సంస్థ ఖాతాలో నిల్వలు ఉన్నప్పుడే అవసరానికి, అభివృద్ధి పనులకు బ్యాంకులు, ఇతర సంస్థలు అప్పులు ఇవ్వడానికి ముందుకు వస్తాయి. నిల్వలు లేక పోతే అప్పులు కూడా పుట్టవు.' అని సీ ఎండీ ప్రభాకర్‌రావు అన్నారు.

ఆ డబ్బులు సొంతానికి వాడుకుంటే ఎలా? సీఎండీ రఘుమారెడ్డి

'వినియోగదారుల నుంచి వసూలు చేసిన విద్యుత్ బిల్లులను, వెంటనే సంస్థ ఖాతాలో జమ చేయడం లేదు. వీటిని కొంత మంది ఉద్యోగులు సొంత ఖర్చులకు వాడుకుంటున్నారు. వరుస డోర్‌లాక్‌లు, మీటర్ స్టకప్‌లు వంటి అంశాలను ఈఆర్‌ఓలు మానిటరింగ్ చేయడం లేదు. పరోక్షంగా సంస్థ నష్టాలకు కారణమవుతున్నారు. వినియోగదారులు చెల్లించిన మొత్తాన్ని సొంత అవసరాలకు వాడుకుంటే ఎలా? ఈఆర్‌ఓ కేంద్రాల్లోని అకౌంటెంట్లు ఏం చేస్తున్నారు? ఎప్పటికప్పుడు బిల్లులు, ఇతర అంశాలను మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత మీపై లేదా..? ఈఆర్‌ఓ కో ఆర్డినేషన్ మీటింగ్‌లో ఏం చర్చిస్తున్నారు? అన్‌బిల్డ్ సర్వీసులపై ఎందుకంత నిర్లక్ష్యం? ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించని సర్వీసులను ఎందుకు ఉపేక్షిస్తున్నారు. సెక్షన్ల వారీగా సమీక్షలు నిర్వహించి, వృథా ఖర్చులు, విద్యుత్ లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత అకౌంటెంట్లపైనే ఉంది' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, జెన్‌కో జేఎండీ శ్రీనివాసరావు, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు నరసింహ్మారావు, టీఆర్‌కే రావు, తిరుపతి రెడ్డి, వీఏఓఏటీ అధ్యక్షుడు ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముందు వాటాలు తేల్చండి!

- ఆ తర్వాతే కాళేశ్వరానికి మూడో టీఎంసీకి అనుమతించాలి గోదావరి బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు మూడో టీఎంసీ తరలింపు పనులపై ఏపీ ప్రభుత్వం మరోసారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విభజన చట్టం ప్రకారం ట్రిబ్యునల్ ద్వారా గోదావరి జలాల్లో వాటాలు తేలే వరకు లేదా నీటి వినియోగంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరే వరకు ఈ పనులకు ఎలాంటి అనుమతులు జారీ చేయరాదని డిమాండ్ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రోజుకు రెండు టీఎంసీల గోదావరి జలాలను తరలించే పనులకు 2018 జూన్ 6న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోని సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. నీటి వాటాలు తేలేదాకా ఆ అనుమతులను పునఃసమీక్షించడంతో పాటు మూడో టీఎంసీ పనులకు అనుమతి ఇవ్వొద్దని కోరింది. ఈ మేరకు ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తాజాగా గోదావరి బోర్డు చైర్మన్ ఎంకే సిన్హాకు లేఖ రాశారు. వాటాలు తేలకుండానే ఎగువ రాష్ట్రాల ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే.. దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులను హరించినట్లేనని తేల్చి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ)ను కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ కోరింది.

డీపీఆర్‌ల పరిశీలనకు సుప్రీం అనుమతి నేపథ్యంలో లేఖ...

కాళేశ్వరం మూడో టీఎంసీ తరలింపు పనులకు పర్యావరణ అనుమతి లేకపోవడంతో గతంలో సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో ఆ ప్రాజెక్టు డీపీఆర్ పరిశీలనను గోదావరి బోర్డు ఆపేసింది. డీపీఆర్ పరిశీలనకు గోదావరి బోర్డుకు ఇటీవల సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో గోదావరి బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది.

వాస్తవాలేంటో తెలుసుకోండి

బైరి నరేశ్ న్యాయవాదికి హైకోర్టు సూచన

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి జైళ్ల అధికారులపై బైరి నరేశ్ చేసిన ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది జైలుకు వెళ్లి తెలుసుకోవాలని అతని న్యాయవాది సురేశ్‌కుమార్‌కు హైకోర్టు సూచించింది. అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌ను గత నెల పోలీసులు అదుపులోకి తీసుకుని చర్లపల్లి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. తనను ఏకాంత నిర్బంధంలో ఉంచడంతో ఆరోగ్యపరిస్థితి విషమించిందని..దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు తనకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ బైరి నరేశ్, ఆయన సతీమణి సుజాత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఏకాంత నిర్బంధ వ్యవస్థ అనేది చాలాకాలం క్రితమే తొలగించామని జైళ్ల శాఖ అధికారి వివరించారు. తదుపరి విచారణను 28కు వాయిదా వేశారు.

ఈఎస్‌ఐకి ఆ అధికారం ఉంటుంది: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నిర్ణీత సమయానికి కాంట్రిబ్యూషన్ మొత్తాన్ని చెల్లించకుంటే నష్ట పరిహారాన్ని వసూలు చేసే అధికారం ఈఎస్‌ఐ సంస్థకు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. విజయ్ మేరీ ఆస్పత్రి అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.96,630ని చెల్లించాల్సిందేనని ఆదేశించింది. తాము ఆస్పత్రులు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నందున ఈఎస్‌ఐకి చెల్లించే కాంట్రిబ్యూషన్ నుంచి మినహాయింపునివ్వాలని కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో కాంట్రిబ్యూషన్ చెల్లింపులో ఆలస్యం జరిగింది. విజయ్ మేరీ ఆస్పత్రి కూడా ఆలస్యం చేయడంతో పరిహారం కింద రూ.96,630 చెల్లించాలని ఈఎస్‌ఐ సంస్థ నోటీసులు ఇచ్చింది. దీనిపై ఆస్పత్రి ఈఎస్‌ఐకు సంబంధించిన కోర్టును ఆశ్రయించడంతో అనుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ..ఈఎస్‌ఐ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావునాయుడు వాదనల అనంతరం ఈఎస్‌ఐ సంస్థకు ఆ అధికారం ఉందని పేర్కొంటూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టి వేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.





1.0L Turbo Boosterjet Engine with Smart Hybrid | 360 View Camera | Head Up Display | NEXTre' Rear Combination Lights | In-Built Suzuki Connect | Wireless Charger